

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



13

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

హాజరుకానున్న 5,09,403 మంది విద్యార్థులు

అందుబాటులో 5 నిమిషాల గ్రేస్ పీరియడ్

శుక్రవారం | 21-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 352

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి తె.4:24 తదుపరి అష్టమి, నక్షత్రం: జ్యేష్ఠ రా.1:46 తదుపరి మూల, వర్జ్యం: తె. ఉ. 7.24, అమృతఘడియలు: సా.4:08-5:53, దుర్ముహూర్తం: ఉ.8:46-9:34, మ.12:46-1:34, రాహుకాలం: ఉ. 10:30-12:00వరకు; సూర్యోదయం: 6:21, సూర్యాస్తమయం: 6:22 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో సహచరుడి మృతదేహంతో జవాన్లు

మళ్లీ నెత్తురోడిన దండకారణ్యం

ఛత్తీస్‌గఢ్‌లో 30 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్

బీజాపూర్, కాంకేర్‌లలో వేర్వేరు ఆపరేషన్లు.. గంగలూరు అడవుల్లో 26 మంది మృతి

మృతుల్లో ఎనిమిది మంది మహిళా నక్సల్స్.. డీఆర్‌జీకి చెందిన ఓ కానిస్టేబుల్ కూడా..

అబూజ్‌మడ్‌లో నలుగురు మావోయిస్టుల మృతి.. ముమ్మరంగా 'ఆపరేషన్ హిడ్మా'..!

చర్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నెలరోజులపాటు ప్రశాంతంగా ఉన్న దండకారణ్యం గురువారం మరోమారు నెత్తురోడింది. బీజాపూర్‌లోని గంగలూరు, కాంకేర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 30 మంది నక్సలైట్లు, ఒక డీఆర్జీ జవాను మృతిచెందారు. చనిపోయిన నక్సల్స్ నుంచి భద్రతా బలగాలు పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. గంగలూరు డీవీసీఎం సభ్యుడు ఎం.దినేశ్ పోలీసులకు లొంగిపోయిన వారంలోనే భారీ ఎన్‌కౌంటర్లు

మిగతా 2వ పేజీలో...

2

వచ్చే ఏడాది మార్చి 31కల్లా


నక్సల్స్ రహిత భారత్: అమిత్ షా

వాళ్లకు టీటీడీ ఉంటే

మనకు వైటీడీ

ప్రతిసారీ మా ఎమ్మెల్యేల లేఖలతో దర్శనం ఇప్పించండని అడుక్కోవడం ఎందుకు? వాళ్లకు టీటీడీ ఉంటే.. మనకు వైటీడీ (యాదగిరి గుట్ట) ఉంది. భద్రాచలంలో రాముడు లేడా? రామప్ప లేదా!?

- ముఖ్యమంత్రి రేవంత్



రవీంద్రభారతిలో జరిగిన కొలువుల పండగ కార్యక్రమంలో ఒక అభ్యర్థినికి నియామక పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి సీతక్క

పంచుకు తింటేనే.. పట్టు వచ్చినట్లా?

దళితులను, బీసీలను క్యాబినెట్ నుంచి తీసేస్తే పాలనపై పట్టు చిక్కినట్టా!?

రోజుకు 18 గంటలు పని చేస్తుంటే నాకు పట్టు రాలేదట

హుందాగా ఉంటే అర్థం చేసుకునేవాళ్లు ఉండాలిగా

మాకు మానవత్వం, విజ్ఞత ఉంది. మీకు అవి లేవు

అడ్డగోలుగా సంపాదించిన డబ్బుతో సర్కారుపై దుష్ప్రచారం

11% వడ్డీకి అప్పు తెస్తే నేను దాన్ని 5 శాతానికి మార్పించా

నోటిఫికేషన్లు ఇచ్చి.. కేసులు వేసి భర్తీ చేయకుండా ఆపేశారు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ ధ్వజం

టెంపర్‌మెంట్ విషయంలో తగ్గేదే లేదని స్పష్టీకరణ

588 మందికి కారుణ్య.. 334 మందికి కొలువు పత్రాలు

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): "రేవంత్ రెడ్డికి పాలనలో పట్టు రాలేదని అంటున్నారు. దళితుడు రాజయ్యను, బలహీన వర్గాలకు చెందిన ఈటల రాజేందర్‌ను మంత్రివర్గం నుంచి తప్పిస్తే పట్టు వచ్చినట్లా!? వాళ్లను తీసేయడానికి సహేతుకమైన కారణం చెప్పి ఉంటే నీకు పట్టు ఉన్నట్లు! తప్పు చేసిన నీ సొంత మనుషులను అయినా లోపల వేయిస్తే పట్టు వచ్చినట్లు!? అంతే తప్ప.. పంచుకు తింటే పట్టు వచ్చినట్లా!?" అంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల సచివాలయానికే రాని వ్యక్తికి పాలనపై పట్టు వచ్చిందని

మిగతా 13వ పేజీలో...

మళ్లీ కొలువుల జాతర!

55,418 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం 12

అంగన్వాడీల్లో 14236.. జీపీవోలు 10954

వివిధ శాఖల్లో 30,228 ఖాళీల గుర్తింపు

ఈ 15 నెలల్లోనే 58,868 పోస్టుల భర్తీ

గ్రూప్ 1, 2, 3ల్లో ఎంపికైన 2,711 మందికి

త్వరలోనే నియామక పత్రాల అందజేత

సత్వరంగా భవన నిర్మాణ అనుమతులు

బిల్డ్ నౌ పోర్టల్‌ను ఆవిష్కరించిన సీఎం

ముదిరిన బెట్టింగ్ వ్యవహారం..

తారలపై కేసులు

రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి సహా 25 మంది సినీ, టీవీ ప్రముఖులపై ఎఫ్ఐఆర్

బెట్టింగ్, జూదం, క్యాసినో యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారంటూ మియాపూర్‌వాసి ఫిర్యాదు

విష్ణుప్రియ, రీతూచౌదరి ప్రశ్నించిన పంజగుట్ట పోలీసులు

41 సీఆర్పీసీ నోటీసులు జారీ.. మళ్లీ 25న రావాలని ఆదేశం

తెలియక చేశా.. తప్పు తెలుసుకుని ఆపేశా: ప్రకాశ్‌రాజ్

నైపుణ్య ఆధారిత ఆటలకే విజయ్ దేవరకొండ ప్రచారం చేశారని ఆయన బృందం స్పష్టీకరణ

చట్టబద్ధమైన యాప్‌లకే ప్రమోషన్: రానా టీమ్ వివరణ

బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తే చర్యలు: ఫిలిం చాంబర్

మెట్రో రైళ్లలో బెట్టింగ్ సరోగేట్ యాడ్స్‌పై సోషల్ మీడియా ధ్వజం.. వాటిని తొలగిస్తామన్న మెట్రో రైల్ వర్గాలు!



విజయ్ దేవరకొండ



రానా దగ్గుబాటి



మంచు లక్ష్మీ ప్రసన్న

హైదరాబాద్ సిటీ/మియాపూర్, పంజగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, క్యాసినో యాప్‌ల ప్రచారానికి సంబంధించి.. సినీ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి, నిధి, అగర్వాల్, ప్రణీత, అనన్య నాగళ్ల సహా 25 మంది సినీ, టీవీ ప్రముఖులపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మియాపూర్‌కు చెందిన ఫణీంద్రశర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరిపై భారతీయ న్యాయసంహితలోని సెక్షన్ 318(4), 112 రెడ్ విత్ 49, తెలంగాణ స్టేట్ గేవింగ్ యాక్ట్‌లోని 3, 3(ఏ), 4 సెక్షన్లు, ఐటీ చట్టంలోని 66(డీ) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు. సినీ ప్రముఖులు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఈ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారని.. వారిని అభిమానించే యువత వారి మాటలు నమ్మి ఈ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయారని, ఇంతమంది

మిగతా 14వ పేజీలో...



మెట్రోరైలు పైన బెట్టింగ్ సరోగేట్ యాడ్ (ఫైల్)

సినిమా పాటల్లో అసభ్యకర స్టెప్పులపై మహిళా కమిషన్ సీరియస్



విలేకరుల సమావేశంలో జూలియా మోర్లే, క్రిస్టినా పిస్కోవా, జూపల్లి

మిస్ వరల్డ్ పోటీలకు ప్రభుత్వ వ్యయం

రూ. 27 కోట్లు

అది కూడా స్పాన్సర్ల ద్వారా సమీకరిస్తాం

250 కోట్లు ఖర్చు చేస్తున్నారన్న విపక్షాల విమర్శలు అవాస్తవం

ఈ పోటీలతో ఉపాధి, పెట్టుబడి అవకాశాలు: జూపల్లి

మే 7న 140 దేశాల నుంచి సుందరీమణుల రాక

31న హైటెక్స్‌లో మిస్ వరల్డ్ ఫైనల్స్

హైదరాబాద్ సిటీ, మార్చి20(ఆంధ్రజ్యోతి): మే 7 వ తేదీ నుంచి 24 రోజుల పాటు తెలంగాణాలో మిస్ వరల్డ్- 2025 పోటీలు జరగనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల నుంచి అందగత్తెలు ఈ పోటీల్లో పాల్గొంటారు. మే 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభ వేడుకలు జరుగుతాయి. మే 31న హైటెక్స్‌లో మిస్ వరల్డ్ ఫైనల్స్ నిర్వహిస్తారు. ఈ పోటీల కోసం రూ.54 కోట్లు ఖర్చు కానుంది. ఇందులో ప్రభుత్వశాఖల వాటా రూ.27 కోట్లు కాగా మిస్ వరల్డ్ సంస్థ వాటా రూ.27 కోట్లు ఖర్చు చేయనుంది. ప్రభుత్వ వాటాగా ఉన్న రూ.27 కోట్లను స్పాన్సర్‌ల ద్వారా సమీకరిస్తారు. ఈ పోటీల వివరాలు తెలిపేందుకు బేగంపేటలోని

మిగతా 13వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్ కేసులో..

హరీశ్‌కు ఊరట



రాధాకిషన్‌రావుకు కూడా..

కేసులో విషయం లేదు.. ఫిర్యాదులో జాప్యం జరిగిందన్న హైకోర్టు

చక్రధర్‌గౌడ్ పెట్టిన కేసు కొట్టివేత

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తన ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ రియల్టర్, కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఫిర్యాదుతో నమోదైన కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు భారీ ఊరట లభించింది. ఆయనతోపాటు.. టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ(డీసీపీ) రాధాకిషన్‌రావుపై ఉన్న కేసును కొట్టివేస్తూ.. హైకోర్టు గురువారం తీర్పునిచ్చింది. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు (విషయం) ఫిర్యాదులో లేదని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఫిర్యాదు చేయడంలోనూ ఆలస్యం జరిగిందని ఆక్షేపించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. 'ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్' పేరుతో సిద్దిపేట నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేస్తూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థిగా పోటీ చేశాననే కక్షతో హరీశ్‌రావు తనను చిత్ర హింసలకు గురిచేశారని, చంపుతానని బెదిరించడమే కాకుండా.. తనతోపాటు, తన కుటుంబ సభ్యుల ఫోన్లను ట్యాప్ చేయించారని పేర్కొంటూ.. రియల్టర్, కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ గత ఏడాది డిసెంబరు 1న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. అయితే.. ఇది తప్పుడు కేసు అని, దీన్ని కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు వేర్వేరుగా హైకోర్టులో క్వాష్ పిటిషన్లను దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. హరీశ్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు, న్యాయవాది

మిగతా 3వ పేజీలో...



సూర్యాపేటలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

వచ్చే ఏడాది పాదయాత్ర!

బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవడమే లక్ష్యం

ఈ ఏడాదంతా పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి

రేవంత్‌ను కాపాడుతున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్

తెలుగు వారి కోసం నాడు ఎన్టీఆర్.. తెలంగాణ కోసం నేడు కేసీఆర్.. సూర్యాపేటలో బీఆర్ఎస్ శ్రేణులతో కేటీఆర్

సూర్యాపేట(కలెక్టరేట్)/హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్‌ని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా వచ్చే ఏడాది పాదయాత్ర చేయనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. గురువారం సూర్యాపేటలో జరిగిన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం సందర్భంగా ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పాదయాత్ర చేయాలని కార్యకర్తలు, నాయకులు కోరుతున్నారని.. దీనిపై పార్టీలో కసరత్తు జరుగుతోందని తెలిపారు. ఈ ఏడాదంతా పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెడుతున్నామన్నారు. అంతకుముందు

మిగతా 12వ పేజీలో...

తెలంగాణలో వచ్చేసారి

అధికారం మనదే

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం

విభేదాలు పక్కనపెట్టి కష్టపడి పనిచేయండి

తెలంగాణ బీజేపీ ఎంపీలకు అమిత్‌షా ఉద్బోధ

ఎమ్మెల్సీలు కొమురయ్య, అంజిరెడ్డిలకు అభినందనలు

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి నియామకం ఉగాదిలోపే?



అమిత్ షాతో సమావేశమైన తెలంగాణ బీజేపీ ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే అందుకు నిదర్శనమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. విభేదాలను పక్కన పెట్టి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉత్సాహంగా పనిచేయాలని తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఉద్బోధించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. కొత్త ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డిని ఆయన అభినందించారు. కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, గ్యారెంటీల అమలులో ఆ పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లోనూ

మిగతా 12వ పేజీలో...



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు టెండర్‌పై

యథాతథ స్థితి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల జారీ

3

బండి సంజయ్‌పై

కేసు కొట్టివేత

జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా కేసు

మత విద్వేష ప్రసంగాలు చేశారంటూ అప్పట్లో ఫిర్యాదు 3

ఎలాంటి ఆధారాలు లేవని.. కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు



3

ఓయూలో నిరసనల నిషేధంపై

హైకోర్టులో పిటిషన్

రిజిస్ట్రార్‌కు న్యాయస్థానం నోటీసులు

తదుపరి విచారణ ఏప్రిల్ 9కి వాయిదా

మధుమేహం, ఊబకాయానికి

కొత్త ఇంజెక్షన్

మార్కెట్లోకి తెచ్చిన ఎలీ లిల్లీ ఇండియా

2.5 ఎంజీ ధర రూ.3,500.. 5 ఎంజీకి రూ.4,375.. వారానికి ఒకటి చాలు

ఇంజెక్షన్‌తో పాటు ఆహార నియంత్రణ, వ్యాయామం తప్పనిసరి 2



కాళేశ్వరం డీపీఆర్‌ను 13

మళ్లీ పంపించండి

రాష్ట్ర ప్రభుత్వానికి సీడబ్ల్యూసీ తాజా లేఖ

అదనపు టీఎంసీ ప్రాజెక్టుపై ఊరట

ఖాళీగా ఉంటూ మనోవర్తి కోరలేరు

» ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ


న్యూఢిల్లీ, మార్చి 20: అన్ని విద్యార్హతలు కలిగి, సంపాదించే సామర్థ్యం ఉండే మహిళ ఖాళీగా ఉంటూ భర్త నుంచి మధ్యంతర భృతి కోరలేదని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. మనోవర్తి అన్నది భద్రత, సమానత్వం కలిగించడానికి ఉద్దేశించిందే తప్ప ఖాళీగా కూర్చోమని చెప్పేదికాదని పేర్కొంది. ఓ జంటకు 2019 డిసెంబరులో వివాహం జరిగింది. అనంతరం సింగపూర్‌లో నివసించడం ప్రారంభించింది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య 2021 ఫిబ్రవరిలో తిరిగి వచ్చేసింది. 2021 జూన్ నుంచి మేనమామ ఇంట్లో ఉంటోంది. పోషణ నిమిత్తం భర్త నుంచి మధ్యంతర మనోవర్తి ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించింది. అయితే, ఆమె ఉన్నత విద్యావంతురాలని, సంపాదించే సామర్థ్యం ఉందని భర్త తెలిపాడు. నిరుద్యోగిగా ఉన్నానన్న కారణం చూపి మనోవర్తి కోరలేదని పేర్కొన్నాడు. ఆమె ఆస్ట్రేలియాలో మాస్టర్ డిగ్రీ చేసిందని, పెళ్లికి ముందు దుబాయ్‌లో ఉద్యోగం కూడా చేసినట్టు కోర్టు దృష్టికి తెచ్చారు. భర్త వాదనతో ఏకీభవించిన కోర్టు మనోవర్తి మంజూరు చేసేందుకు నిరాకరించింది. తాను ఖాళీగా ఏమీ లేనని, ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్నానని అమె కోర్టుకు చెప్పగా, అందుకుతగ్గ ఆధారాలు చూపలేదని కోర్టు అభ్యంతరం తెలిపింది.

రోజుకు 5 వేలు ఇస్తేనే కాపురం చేస్తుందట!

» కర్ణాటకలో బెంగళూరు టెకీ ఫిర్యాదు

బెంగళూరు, మార్చి 20: రోజుకు రూ.5వేలు ఇస్తేనే తన భార్య కాపురం చేస్తానని అంటోందని కర్ణాటకకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్ బెంగళూరులోని వ్యాలికావల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తోందని, ఉద్యోగం చేసుకోనివ్వకుండా వేధిస్తోందని, విడాకులు ఇవ్వాలంటే రూ.45 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. పిల్లలను కనేందుకు తిరస్కరిస్తోందని, 60 ఏళ్ల వయస్సులో దత్తత తీసుకుందామని చెబుతోందని పేర్కొన్నారు. వర్క్ ఫ్రమ్ చేస్తున్న సమయంలో పెద్దగా మ్యూజిక్ ప్లే చేస్తూ, డ్యాన్స్ చేస్తూ గందరగోళం సృష్టిస్తుందని, దీని వలన తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోయిందని, ప్రాజెక్టులపై దృష్టి పెట్టలేకపోయానని పేర్కొన్నారు. శ్రీకాంత్ 2022లో పెద్దలు నిర్ణయించిన వివాహం చేసుకున్నారు. అయితే శ్రీకాంత్ ఆరోపణలను ఆయన భార్య బిందు ఖండించారు. విడాకుల కోసం డబ్బులు డిమాండ్ చేయలేదన్నారు. తమ వివాహానికి తన తండ్రి రూ.40 లక్షలు ఖర్చు చేశారని, ఆ మొత్తాన్ని తిరిగివ్వాలని మాత్రమే కోరానని చెప్పారు. శ్రీకాంతే తనను శారీరకంగా, మానసికంగా హింసించాడని, వరకట్నం వేధింపులకు గురిచేశాడని ప్రత్యారోపణలు చేశారు.

లోకం తీరు



సైన్యం మరింత శక్తిమంతం!

» 54 వేల కోట్లతో మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోలుకు డీఏసీ ఓకే


ఏటీఏజీఎస్

న్యూఢిల్లీ, మార్చి 20: భారత సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు, యుద్ధ సామర్థ్యాన్ని ఆధునీకరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రూ.54 వేల కోట్లతో భారీఎత్తున మిలటరీ హార్డ్‌వేర్ పరికరాలను కొనుగోలు చేసేందుకు గురువారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా 'ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్' వ్యవస్థలు, టార్పెడోలు, టీ-90 ట్యాంకుల కోసం ఇంజన్లు వంటివి కొనుగోలు చేయనున్నారు. మరోవైపు భారీఎత్తున దేశీయంగా తయారు చేసిన ఆర్టిలరీ శతఘ్నుల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఆర్మీ కోసం అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్స్ (ఏటీఏజీఎస్) కొనుగోలుకు సంబంధించి రూ.7 వేల కోట్ల ఒప్పందానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ (భద్రత) ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా 307 హోవిట్జర్లను కొనుగోలు చేయనున్నారు. అదేవిధంగా సైన్యంలోని 15 ఆర్టిలరీ రెజిమెంట్లకు ఆయుధాలు సమకూర్చేందుకు 327 శతఘ్నులను తీసుకెళ్లే వాహనాలు (గన్ టోయింగ్ వెహికల్స్) కొనుగోలు చేస్తారు. 155ఎంఎం/52 క్యాలిబర్ 'ఏటీఏజీఎస్'ను డీఆర్‌డీవో అభివృద్ధి చేయగా.. భారత్ ఫోర్జ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థలు ఉత్పత్తి చేయనున్నాయి. బిడ్డింగ్‌లో భారత్ ఫోర్జ్ ఎల్-1గా నిలిచిన నేపథ్యంలో.. ఆ సంస్థ 60 శాతం శతఘ్నులను, టాటా సంస్థ మిగతా 40 శాతం తయారు చేయనుంది.

బాలిక ఛాతీ తాకడం రేప్ కిందికి రాదు

» రేప్ కేసులో అలహాబాద్ హైకోర్టు స్పష్టం

ప్రయాగ్‌రాజ్, మార్చి 20: మైనర్ బాలిక ఛాతీని తాకడం, ఆమె పైజామా తాడును లాగివేయడం రేప్ కిందకు రాదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. దానిని అంతకన్నా తక్కువ నేరం కింద పరిగణించి కేసును మార్చాలని ఆదేశించింది. ఒక బాలికను చిన్న వంతెన కిందకు తీసుకెళ్లి ఆమె ఛాతీపై చేయి వేయడంతో పాటు, ఆమె ధరించిన పైజామా తాడును లాగారంటూ పవన్, ఆకాశ్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదయింది. ఐపీసీలోని సెక్షన్ 376 (రేప్), పోక్సో చట్టంలోని సెక్షన్ 18 (నేరానికి ప్రయత్నించడం) కింద పోలీసులు కేసు పెట్టారు. ఇవి తీవ్రమైన సెక్షన్లు కావడం, కఠిన శిక్షలు పడే అవకాశం ఉండడంతో వాటిని మార్చాలంటూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రామ్ నారాయణ్ మిశ్ర.. ఆ సెక్షన్లు మార్చి అంతకన్నా తక్కువ శిక్ష పడే సెక్షన్లు నమోదు చేయాలని ఆదేశించారు. సాక్ష్యాలను పరిశీలిస్తే నిందితులిద్దరూ ఆ బాలికపై అత్యాచారం చేయడానికి సిద్ధమయ్యారంటూ నిర్ధారించలేమని తెలిపారు. అందువల్ల తక్కువ శిక్ష పడే ఐపీసీలోని సెక్షన్ 354బీ (బలవంతంగా దుస్తులను లాగడం), పోక్సో చట్టంలోని 9/10 సెక్షన్లు (లైంగిక దాడి) కింద మళ్లీ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

కర్ణాటకలో ఏప్రిల్ నుంచి కరెంట్ చార్జీల పెంపు

బెంగళూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కరెంట్ చార్జీలను యూనిట్‌కు 36 పైసలు చొప్పున పెంచనున్నారు. కర్ణాటక ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (కేఈఆర్‌సీ) నుంచి రెండువారాల కిందటే ప్రభుత్వానికి చార్జీల పెంపు ప్రతిపాదనలు వచ్చాయి. ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడంతో ఏప్రిల్ ఆరంభం నుంచి చార్జీలు పెంచేందుకు కేఈఆర్‌సీ సిద్ధమైంది. శాసనసభ సమావేశాలు శుక్రవారం దాకా కొనసాగుతున్నందున, ఈ అంశంపై అధికారికంగా ప్రకటించకుండా జాప్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర వైద్య విద్యాశాఖ మంత్రి శరణుప్రకాష్ పాటిల్ గురువారం విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ చార్జీలు పెరిగినా సామాన్యులపై ఎటువంటి ప్రభావం ఉండదన్నారు. గృహజ్యోతి గ్యారెంటీ ద్వారా అందిస్తున్న ఇంటికి 200 యూనిట్‌ల ఉచితం కొనసాగుతుందని పేర్కొన్నారు.

అమెరికా అధికారుల అదుపులో భారత పరిశోధకుడు బదర్‌ఖాన్ సూరి

వాషింగ్టన్, మార్చి 20: అమెరికాలోని జార్జిటౌన్ యూనివర్సిటీలో భారత పరిశోధకుడు బదర్ ఖాన్ సూరిని ఇమ్మిగ్రేషన్ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఆయన హమాస్‌కు అనుకూలంగా, యూదులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఆయనను అమెరికా నుంచి బహిష్కరించే అవకాశం ఉంది. విద్యార్థి వీసా కలిగి ఉన్న బదర్ ఖాన్ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూనే పోస్ట్‌డాక్టరల్ అసోసియేట్‌గా పనిచేస్తున్నారు. బదర్ ఖాన్ సోషల్ మీడియాలో హమాస్‌కు అనుకూలంగా, యూదులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్టు డీహెచ్‌ఎస్(హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం) అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. హమాస్‌కు సీనియర్ సలహాదారుగా ఉన్న ఒక అనుమానిత ఉగ్రవాదితోనూ అతనికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం లూసియానాలోని ఐసీఈ(ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) నిర్బంధ కేంద్రంలో బదర్ ఖాన్‌ను ఉంచారు. ఈ నిర్బంధాన్ని బదర్ ఖాన్ న్యాయవాది కోర్టులో సవాల్ చేశారు.

ఆదిత్య ఠాక్రేపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి

» బాంబే హైకోర్టులో దిశ సాలియన్ తండ్రి పిటిషన్

ముంబై, మార్చి 20: బాలీవుడ్ దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజపుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ ఆత్మహత్య కేసు కొత్త మలుపు తిరిగింది. దిశ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె తండ్రి సతీశ్ సాలియన్ బాంబే హైకోర్టును ఆశ్రయించడం మహారాష్ట్రలో మరోసారి రాజకీయ దుమారం రేపింది. ఈ వ్యవహారంలో శివసేన (యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రేపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా ఆదేశించాలని, స్వతంత్ర దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. తన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేశారని, ఫోరెన్సిక్ ఆధారాలు, ప్రత్యక్ష సాక్షుల కథనాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆత్మహత్య లేదా ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా నిర్ధారిస్తూ ముంబై పోలీసులు హడావుడిగా దర్యాప్తును ముగించారని, పలుకుబడి ఉన్న వ్యక్తులను కాపాడేందుకు కేసును నీరుగార్చారని ఆరోపించారు. కాగా, దిశ మృతిచెందిన ఐదేళ్ల తర్వాత ఆమె తండ్రి కోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని ఒక రాజకీయ ఎత్తుగడగా శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అభివర్ణించారు.

ఛావాతో మత ఉద్రిక్తతలు.. నిషేధించండి

» కేంద్ర హోం మంత్రికి ముస్లిం మతగురువు లేఖ

బరేలీ/బహ్రైయిచ్/నాగ్‌పూర్, మార్చి 20: ఛావా సినిమా మత విద్వేషాలు పెంచేలా ఉందని, అందువల్ల ఆ సినిమాను నిషేధించాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ఆలిండియా ముస్లిం జమాత్, దర్గా ఆలా హజ్రత్ జాతీయ అధ్యక్షుడు మౌలానా షాహబుద్దీన్ రజ్వీ కోరారు. నాగ్‌పూర్‌లో గొడవలకు ఈ సినిమానే కారణమని పేర్కొన్నారు. ఈ మేరకు అమిత్‌షాకు లేఖ రాశారు. ఆ సినిమా విడుదల అయినప్పటి నుంచి దేశంలోని పరిస్థితులు దిగజారిపోతున్నాయని అన్నారు. భారతీయ ముస్లింలు ఎవరూ ఔరంగజేబును ఆదర్శ నేతగా భావించరని, కేవలం ఓ పాలకుడిగా మాత్రమే చూస్తారని చెప్పారు. ఇదిలా ఉండగా, నాగ్‌పూర్ హింసలో ప్రధాన నిందితుడు, మైనారిటీ డెమొక్రాటిక్ పార్టీ సిటీ చీఫ్ ఫాహీం ఖాన్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు దేశద్రోహం, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం నేరాల కింద గురువారం కేసు నమోదు చేశారు.

మళ్లీ నెత్తురోడిన దండకారణ్యం

(మొదటిపేజీ తరువాయి)

జరగడం గమనార్హం.! బస్తర్ ఐజీ సుందర్‌దాస్ కథనం ప్రకారం.. బీజాపూర్ జిల్లా గంగలూరు సమీపంలోని బైలాదియ కొండకు అవతల.. ట్రయాంగిల్ అడవుల్లో నక్సల్స్ సంచారం ఉన్నట్లు ఉప్పందుకున్న పోలీసులు.. సుమారు 1,500 మంది బలగాలు బుధవారం కూంబింగ్ ప్రారంభించారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడడంతో.. ఇరువైపులా కాల్పులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు ఐదు విడతలుగా భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ తర్వాత నక్సల్స్ వైపు కాల్పులు నిలిచిపోవడంతో.. కూంబింగ్ బలగాలు ముందుకు సాగాయి. అక్కడ 26 మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో 8 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. నక్సల్స్ జరిపిన కాల్పుల్లో డీఆర్జీ జవాను రాజు మృతిచెందగా.. మరో ఇద్దరు జవాన్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. "చనిపోయిన నక్సల్స్‌ను ఇంకా గుర్తించాల్సి ఉంది" అని బస్తర్ ఐజీ వెల్లడించారు. మరో ఘటనలో.. కాంకేర్-నారాయణపూర్ జిల్లాల సరిహద్దుల్లోని అబూజ్‌మడ్ అడవుల్లో గురువారం కూంబింగ్‌లో ఉన్న భద్రతాబలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు.ఎదురుకాల్పుల్లో నలుగురు నక్సల్స్ మృతిచెందారు. ఈ మార్గంలో పోలీసులే టార్గెట్‌గా మావోయిస్టులు మందుపాతరను పేల్చడంతో.. ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన మావోయిస్టుల్లో తెలంగాణకు చెందిన వారు కూడా ఉండి ఉంటారని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.


మావోయిస్టు మృతదేహాన్ని తరలిస్తున్న జవాన్లు

78 రోజుల్లో.. 97 మంది నక్సల్స్

గత ఏడాది 190 మంది ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లగా.. ఈ ఏడాది తొలి 78 రోజుల్లోనే 97 మంది నక్సలైట్లు చనిపోయారు. గురువారం నాటి ఎన్‌కౌంటర్ ఈ ఏడాదిలో రెండో అతిపెద్దది కావడం గమనార్హం.! జనవరిలో నేషనల్ పార్క్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది చనిపోగా.. తాజా ఎన్‌కౌంటర్లలో 30 మంది మావోయిస్టులు మృతిచెందారు.

నక్సలైట్లను కనికరించేది లేదు

నక్సలైట్లపై తమ సర్కారుకు కనికరం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆయన జవాన్ల సాహసాన్ని అభినందిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. మావోయిస్టుల పట్ల మోదీ సర్కారు నిర్దాక్షిణ్య వైఖరితో ముందుకు వెళ్తోందని, వచ్చే ఏడాది మార్చి 31కల్లా నక్సల్స్ రహిత భారత్‌ను సాధిస్తామని పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి కూడా ఎక్స్‌లో ఈ ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. జవాన్ల విజయాన్ని కొనియాడుతూ.. 2026 నాటికి బస్తర్‌లో భయరహిత వాతావరణాన్ని నెలకొల్పుతామని ధీమా వ్యక్తం చేశారు. బస్తర్ అభివృద్ధి ప్రణాళిక కోసం రెండ్రోజుల క్రితమే ప్రధాని మోదీని కలిసిన విషయాన్ని గుర్తుచేశారు

హిడ్మా కోసం థర్మల్ ఇమేజింగ్

పీఎల్‌జీఏ-1 కమాండర్, మావోయిస్టు గెరిల్లా యుద్ధాల వ్యూహకర్త మాడ్వీ హిడ్మా కోసం భద్రతాబలగాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. వేర్వేరు బృందాలు ఛత్తీస్‌గఢ్-ఒడిసా, ఛత్తీస్‌గఢ్-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని 125 గ్రామాల్లో బలగాలు కూంబింగ్ చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున థర్మల్ ఇమేజింగ్ టెక్నాలజీని వినియోగించుకుంటున్నాయి. నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌టీఆర్‌ఐ) సాంకేతిక సిబ్బంది సహకారంతో ముందుకు సాగుతున్నట్లు సమాచారం. దండకారణ్యంలో బలగాల క్యాంపులు పెరగడం.. కూంబింగ్ ముమ్మరమవ్వడంతో నక్సల్స్ అగ్రనేతలు కుల్హారిఘాట్ అడవుల మీదుగా ఆంధ్ర-ఒడిసా సరిహద్దులు(ఏవోబీ) వైపు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే జనవరి 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత చలపతి సహా.. 16 మంది మావోయిస్టులు చెందిన విషయం తెలిసిందే.!

మధుమేహం, ఊబకాయానికి కొత్త ఇంజెక్షన్

» అందుబాటులోకి తెచ్చిన ఎలీ లిల్లీ

న్యూఢిల్లీ, మార్చి 20: ఉబకాయం, మధుమేహంతో బాధపడేవారికి శుభవార్త! ఆ రెండింటికీ పనిచేసే 'మౌంజారో' అనే ఔషధాన్ని ఎలీ లిల్లీ ఇండియా సంస్థ గురువారం భారత మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) అనుమతితో సింగిల్ డోస్ వయల్ రూపంలో ఈ ఇంజెక్షన్‌ను విడుదల చేస్తున్నట్టు ఆ సంస్థ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. దీన్ని వైద్యులు సిఫారసు చేసిన మోతాదు ప్రకారం వారానికి ఒకసారి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే టిర్జెపటైడ్ అనే ఔషధం.. మన శరీరంలో ఉండే జీఐపీ (గ్లూకోజ్ డిపెండెంట్ ఇన్సులినోట్రోపిక్ పాలీపెప్టైడ్), జీఎల్‌పీ-1 (గ్లూకోగాన్ లైక్ పెప్టైడ్-1) అనే హార్మోన్ గ్రాహకాలను ఉత్తేజితం చేస్తుందని, తద్వారా మధుమేహం, ఊబకాయం, అధికబరువును అదుపులో ఉంచుతుందని కంపెనీ తన ప్రకటనలో వివరించింది. క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా.. ఆహార నియంత్రణ పాటిస్తూ, వ్యాయామం చేస్తూ ఈ ఔషధాన్ని వారానికి 15 మిల్లీగ్రాముల చొప్పున తీసుకున్నవారు 72 వారాల వ్యవధిలో సగటున 21.8 కిలోల బరువు తగ్గారని.. 5ఎంజీ చొప్పున తీసుకున్నవారు సగటున 15.4 కిలోల బరువు తగ్గారని వెల్లడించింది. మన దేశంలో ఈ ఔషధం ధర 2.5 మిల్లీగ్రాముల వయల్ రూ.3,500. అదే 5 మిల్లీ గ్రాముల వయల్ అయితే రూ.4,375. వైద్యులు సిఫారసు చేసిన మోతాదును బట్టి ఖర్చు ఉంటుంది. ఉదాహరణకు.. వారానికి 2.5 ఎంజీ తీసుకోవాల్సి వస్తే నెలకు రూ.14 వేలు ఖర్చవుతుంది. అదే 5ఎంజీ తీసుకోవాలంటే నెలకు రూ.17,500 అవుతుంది. ఇవే మోతాదుల్లో ఈ ఔషధాన్ని అమెరికాలో కొనాలంటే నెలకు రూ.86 వేల నుంచి రూ.లక్ష దాకా ఖర్చవుతుంది.

ఫిన్లాండ్.. సంతోషాల చిరునామా

» హ్యాపీయెస్ట్ కంట్రీగా మళ్లీ అగ్రస్థానం

» భారత్‌కు 118..పాక్‌కు 109వ ర్యాంకు

న్యూఢిల్లీ, మార్చి 20: సంతోషాలకు చిరునామా ఫిన్లాండ్.. అని మరోసారి స్పష్టమైంది. ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్లాండ్ వరుసగా ఎనిమిదోసారి అగ్రస్థానం దక్కించుకుంది. 'అంతర్జాతీయ ఆనంద దినోత్సవం' (మార్చి 20) సందర్భంగా గురువారం విడుదల చేసిన 'వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్ 2025'లో ఫిన్లాండ్ మరోసారి నంబర్‌వన్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 147 దేశాలను ఈ సర్వేలో భాగస్వామ్యం చేయగా.. గతేడాది 126వ స్థానంలో ఉన్న భారత్ ఎనిమిది ర్యాంకులు మెరుగుపడి 118వ స్థానానికి చేరుకుంది. కానీ.. నేపాల్ (92), పాలస్తీనా (108), పాకిస్థాన్ (109), ఉక్రెయిన్ (111) కంటే భారత్ వెనకబడడం గమనార్హం. ఈ జాబితాలో అఫ్ఘానిస్థాన్ 147వ ర్యాంకుతో అట్టడుగున నిలిచింది. ఈ జాబితాలో మన పొరుగున ఉన్న దేశాలైన శ్రీలంక 133, బంగ్లాదేశ్ 134, చైనా 68వ స్థానాల్లో నిలిచాయి. పాశ్చాత్య దేశాల్లో ముఖ్యంగా ఐరోపా దేశాలు టాప్-20లో ఆధిపత్యం చలాయించాయి. అమెరికా 24వ స్థానానికి, బ్రిటన్ 23వ స్థానానికి పడిపోయాయి.

నల్లా నీళ్ల దగ్గర గొడవ.. అన్నను కాల్చేసిన తమ్ముడు

» ఇద్దరూ కేంద్రమంత్రి నిత్యానంద్ మేనల్లుళ్లు

న్యూఢిల్లీ, మార్చి 20: విశ్వజిత్, జయజిత్ ఇద్దరూ అన్నదమ్ములు. కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్‌కు మేనల్లుళ్లు. ఆయన సోదరి హీనాదేవి కుమారులు. బిహార్ భాగల్పూర్‌లోని జగత్‌పూర్ గ్రామంలో ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇంటికి వచ్చే నల్లా నీళ్ల పట్టుకునే విషయంలో వాళ్ల భార్యలిద్దరు గురువారం ఉదయం గొడవపడ్డారు. "నల్లా మాదంటే.. మాది" అని వాదులాడుకున్నారు. గొడవ పెద్దదైంది. విశ్వజిత్, జయజిత్‌లు కలుగజేసుకొన్నారు. గొడవ ఇంకా ముదిరింది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఘర్షణ జరిగింది. ఆవేశంలో విశ్వజిత్ తన తమ్ముడు జయజిత్‌పై కాల్పులు జరిపాడు. బుల్లెట్ గాయంతో రక్తమోడుతున్న జయజిత్ అదే తుపాకీని లాక్కొని అన్న విశ్వజిత్‌పై కాల్పులు జరిపాడు. ఇద్దరు కుమారులను ఆపడానికి తల్లి హీనాదేవి ప్రయత్నించగా.. ఆమెకు కూడా బుల్లెట్ గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే విశ్వజిత్ చనిపోయాడు. జయజిత్ పరిస్థితి విషమంగా మారింది.

అమెరికా విద్యాశాఖ మూసివేత!

» అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలు

» పెన్సిల్వేనియా యూనివర్సిటీకి 17.50 కోట్ల డాలర్లు నిలిపివేత



వాషింగ్టన్, మార్చి 20: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయాన్ని తీసుకున్నారు. దేశ విద్యాశాఖను మూసివేయాలని విద్యా మంత్రి లిండా మెక్‌మోహన్‌ను గురువారం ఆదేశించారు. అయితే దీనిని అమెరికా కాంగ్రెస్.. ముఖ్యంగా సెనేట్ సమర్థించడం అనుమానమే. కోర్టులు కూడా ఈ ఆదేశాలను నిలిపివేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అయితే, తన నిర్ణయాన్ని కాంగ్రెస్ సమర్థిస్తుందన్న విశ్వాసాన్ని ట్రంప్ వ్యక్తంచేశారు. విద్యను ఫెడరల్ ప్రభుత్వం నుంచి తప్పించి గతంలో మాదిరే విద్యావిధానాన్ని రాష్ట్రాలకు వదిలేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. దీనిని అమలు చేస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు కూడా. దానికనుగుణంగానే ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారని వైట్‌హౌస్ ధ్రువీకరించింది. అయితే కీలకమైన కొన్ని సేవలు, కార్యక్రమాలను కొనసాగించాలని మెక్‌మోహన్‌కు ట్రంప్ సూచించారు. ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే శాఖ సిబ్బందిలో సగాన్ని ఇప్పటికే తీసివేశారు. ఆయనపై విపక్ష డెమొక్రాటిక్ సెనేటర్ ప్యాటీ ముర్రే విరుచుకుపడ్డారు. ట్రంప్, డీవోజీఈ అధిపతి ఎలాన్ మస్క్ కలిసి విద్యార్థులు, కుటుంబాల డబ్బును దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇంకోవైపు.. ట్రంప్ చర్యకు వ్యతిరేకంగా 21 రాష్ట్రాల్లో డెమొక్రాటిక్ పార్టీకి చెందిన అటార్నీ జనరల్స్ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. జిమ్మీ కార్టర్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 1979లో విద్యాశాఖను ఏర్పాటుచేశారు. విద్యాసంస్థలకు నిధులు, విద్యార్థులకు రుణాలు, పౌరహక్కుల అమలువంటి వాటిని ఇది పర్యవేక్షిస్తుంది. విద్యా శాఖను రద్దుచేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని పౌర హక్కుల గ్రూపులు, విద్యాసంఘాలు హెచ్చరించాయి. ముఖ్యంగా పేద వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపాయి. ఇంకోవైపు.. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయానికి ఫెడరల్ ప్రభుత్వం ఇవ్వాల్సిన 17.50 కోట్ల డాలర్ల నిధులను ట్రంప్ యంత్రాంగం స్తంభింపజేసింది. బాలికలు, మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిషేధిస్తూ ట్రంప్ గత నెల 5నే ఆదేశాలు జారీచేశారు. అయినా సదరు వర్సిటీలో జరిగిన ఈతల పోటీలో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనడంతో కన్నెర్రజేశారు.

గోల్డ్ కార్డు.. ట్రంప్ కార్డు

గ్రీన్ కార్డుకు బదులుగా ట్రంప్ తెచ్చిన గోల్డ్ కార్డు(గోల్డెన్ వీసా)కు 'ట్రంప్ కార్డు'గా నామకరణం చేస్తారని అంటున్నారు. 50 లక్షల డాలర్లు చెల్లించి గోల్డెన్ వీసా తీసుకునేవారికి పౌరసత్వ సదుపాయాలు కల్పిస్తామంటూ గత నెలలో ఆయన దీనిని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై 'ఫాక్స్ న్యూస్' ఇంటర్వ్యూలో అధ్యక్షుడు మాట్లాడుతూ.. దీనికి తన పేరే పెట్టాలని అందరూ అంటున్నారని వ్యాఖ్యానించారు. '10 లక్షల గోల్డ్ కార్డులు అమ్మితే 5 లక్షల కోట్ల డాలర్ల ఆదాయం వస్తుంది. దీంతో చైనా, ఇతర దేశాలకు అప్పులన్నీ తీర్చేయొచ్చు" అన్నారు.

భారత్‌పై మస్క్ 'ఎక్స్' దావా

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సోషల్ మీడియా దిగ్గజం 'ఎక్స్' (ట్విటర్) భారత్‌పై దావా వేసింది. కేంద్రం చట్టవిరుద్ధంగా కంటెంట్ నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని ఆరోపిస్తూ కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సమాచార హక్కు (ఐటీ) చట్టం ఉల్లంఘనలను ప్రస్తావిస్తూ, ప్రత్యేకించి సెక్షన్ 79(3)(బీ)ని దుర్వినియోగం చేస్తోందని, ఇది సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘించడమేనని పేర్కొంది. సెక్షన్ 69ఏను పక్కదారి పట్టించేలా, కంటెంట్‌ను బ్లాక్ చేసే వ్యవస్థను సృష్టించడానికి ప్రభుత్వం 79(3)(బీ) సెక్షన్‌ను ఉపయోగిస్తోందని పిటిషన్‌లో పేర్కొంది. మరోవైపు, మస్క్‌కు చెందిన ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' వివాదాస్పద కంటెంట్ వాడటంపై కేంద్రం ఆరా తీస్తోంది. కొందరు యూజర్లు అడిగిన ప్రశ్నలకు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం సోషల్ మీడియాలో వివాదానికి దారి తీసింది.

ఢిల్లీ, కోల్‌కతాల్లో సీఐఏ స్థావరాలు

» ఇక్కడినుంచి గతంలో రహస్య ఆపరేషన్లు

» కలకలం రేపుతున్న 'కెన్నడీ' పత్రాలు

న్యూఢిల్లీ, మార్చి 20: అమెరికాకు చెందిన నిఘా సంస్థ సీఐఏ భారత్‌లో రహస్య కార్యకలాపాలు సాగించినట్టు బయటపడింది. దీనికోసం ఢిల్లీ, కోల్‌కతాల్లో ప్రత్యేకంగా స్థావరాలు ఏర్పాటు చేసినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ హత్యకు సంబంధించిన 1963 నాటి రహస్య నివేదికలను ఇటీవల అక్కడి అధికారులు బహిరంగపరచగా, ఈ వివరాలు బయటకొచ్చాయి. ఈ పత్రాలను అనుసరించి.. న్యూఢిల్లీ, కోల్‌కతాల్లోని సీఐఏ రహస్య స్థావరాలను బ్లాక్ సైట్స్ అని వ్యవహరించేవారు. అనుమానిత ఉగ్రవాదులను ఈ కేంద్రాలకు తరలించి విచారించేవారు. ఇక్కడినుంచి సీక్రెట్ ఆపరేషన్లు జరిపేవారు. నిజానికి, స్వాతంత్ర్యం పొందిన రోజునుంచీ సీఐఏతో భారత్‌కు బలమైన బంధం ఉంది. ప్రపంచ ఆధిక్యత కోసం అమెరికా, రష్యాలు సాగించిన ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో ఈ బంధం మరింత బలపడింది. 2013లో అమెరికా కొన్ని రహస్య పత్రాలను విడుదల చేసింది. వాటిని అనుసరించి.. చైనాతో 1962లో భారత్‌కు సరిహద్దు వివాదం తలెత్తింది. భారత్‌కు అండగా సీఐఏ అప్పట్లో ఒడిశాలోని చార్‌బాటియాలో రహస్యంగా వైమానిక స్థావరం నడిపింది. సీఐఏకు చెందిన యూ-2 విమానాలు ఇక్కడ ఇంధనం నింపుకొని చైనా గగనతలంపై చక్కర్లు కొడుతూ అక్కడి సమాచారం భారత్‌కు చేరవేసేవి .స్వాతంత్ర్యానంతరం తన నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకునేందుకు అమెరికా సహకారం భారత్ తీసుకుంది. కమ్యూనిస్టు దేశంగా మారిన చైనా అంతర్గత వ్యవహారాలను 1949లో సీఐఏ సాయంతో అప్పటి ఐబీ డైరెక్టర్ టీజీ సంజీవి తెలుసుకొనేవారు. టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా 1959లో టిబెట్ నుంచి తప్పించుకుని భారత్‌కు రావడంలోనూ సీఐఏ కీలక భూమిక పోషించింది. కాగా, భారతీయ నగరాలతో పాటు పాకిస్థాన్ రాజధాని రావల్పిండీ, శ్రీలంక రాజధాని కొలంబో, జపాన్ రాజధాని టోక్యో, ఇరాన్ రాజధాని టెహ్రాన్, దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో సీఐఏకు 1960ల్లో స్థావరాలు ఉండేవని తాజాగా బయటపడిన పత్రాలు వెల్లడించాయి.



ఈ పెయింటింగ్‌కు 118 కోట్లు

ప్రముఖ చిత్రకారుడు ఎంఎఫ్ హుసేన్ కుంచె నుంచి రూపుదిద్దుకున్న ఈ పెయింటింగ్‌ను బుధవారం న్యూయార్క్‌లో వేలం వేయగా రికార్డు స్థాయిలో ఏకంగా 13.8మిలియన్ డాలర్లకు (రూ.118 కోట్లు) అమ్ముడుపోయింది. అత్యంత ఖరీదైన ఆధునిక భారత కళాకృతిగా ఇది రికార్డుకెక్కింది. 1954నాటి ఈ 'గ్రామ్ యాత్ర' పెయింటింగ్. 14 అడుగుల ఒకే కాన్వాస్‌లో 13 రకాల చిత్రాలతో రూపుదిద్దుకుంది. వీటిలోని ప్రతి చిత్రం గ్రామీణ భారత జీవితాన్ని ప్రతిబింబిస్తుంది.

నవ్వుల్... పువ్వుల్!

- కామెడీ స్కిట్లతో అలరించిన ఏపీ ఎమ్మెల్యేలు
- పడీపడీ నవ్విన చంద్రబాబు, పవన్ కల్యాణ్


సుయోధనుడిగా రఘురామ కృష్ణంరాజు, బాలచంద్రుడిగా కందుల దుర్గేశ్ మెరుపులు

విజయవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాడి వేడి రాజకీయాలు, నియోజకవర్గ సమస్యలు, నిత్యం ఒత్తిళ్లతో సతమతసమయ్యే నేతలు మనసారా నవ్వుకున్నారు. బయట గంభీరంగా కనిపించే నాయకులే 'స్కిట్'లు వేసి కిలకిలా నవ్వించారు. 'నా జీవితంలో ఎప్పుడూ ఇంతగా నవ్వలేదు' అని ఏపీ సీఎం చంద్రబాబు అంటే.. 'గబ్బర్‌సింగ్ సీన్ గుర్తుకొచ్చింది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పడీపడీ నవ్వేశారు. గురువారం సాయంత్రం విజయవాడలోని ఒక కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యేల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారంతా సిసలైన కళాకారుల్లా అలరించారు. 'మన కురువంశము ఏనాడో కులహీనమైనది' అంటూ సుయోధనుడి పాత్రలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు అదరగొట్టారు. పల్నాటి బాలచంద్రుడి పాత్రలో మంత్రి కందుల దుర్గేశ్ చమక్కుమనిపించారు. వీరితోపాటు పలువురు ఎమ్మెల్యేలు ప్రతిభను చాటుకున్నారు. ఎమ్మెల్యేల స్కిట్‌లు నడుస్తున్నంత సేపూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ నవ్వు ఆపుకోలేకపోయారు. ఏకపాత్రాభినయంలో రఘురామకృష్ణంరాజు ప్రథమ బహుమతి సాధించారు. మంత్రి కందుల దుర్గేశ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. స్కిట్లలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు జట్టు ప్రదర్శించిన 'ఇదీ సంగతి' ప్రథమ బహుమతిని, ఈశ్వరరావు, విజయ్‌కుమార్ ప్రదర్శించిన 'అసందర్భపు పాట' ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. పోటీల ముగింపు సందర్భంగా వివిధ క్రీడల్లో విజేతలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ బహుమతులు ప్రదానం చేశారు.


కార్యక్రమాలు తిలకిస్తూ.. నవ్వుతున్న చంద్రబాబు, పవన్

బండి సంజయ్‌పై కేసు కొట్టివేత

- జీహెచ్ఎంసీ ఎన్నికల నాటి కేసు కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల సందర్భంగా సమాజంలోని వివిధ వర్గాల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేశారని పేర్కొంటూ అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుతం కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఆ ఎన్నికల సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మారుతి ఫిర్యాదు మేరకు మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో బండి సంజయ్‌పై కేసు నమోదైంది. ఈ కేసును కొట్టేయాలని బండి సంజయ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జే ప్రభాకర్ వాదిస్తూ.. మొదట ఇచ్చిన సాక్షుల వాంగ్మూలాలకు తర్వాత మరిన్ని విషయాలు జోడించారని ఆరోపించారు. బండి సంజయ్ రెచ్చగొట్టేలా ప్రసంగించినట్లు ఆధారాలు లేవన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ప్రస్తుతం ప్రజాప్రతినిధుల కేసుల కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేస్తూ తీర్పు వెలువరించింది.

ఓయూలో 'నిషేధం'పై హైకోర్టులో పిటిషన్

- రిజిస్ట్రార్‌కు న్యాయస్థానం నోటీసులు

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)లో నిరసనలు, ఆందోళనలు, ప్రదర్శనలను నిషేధిస్తూ రిజిస్ట్రార్ ఈ నెల 13న జారీ చేసిన సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని పేర్కొంటూ ఓయూ రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ ఏప్రిల్ 9కి వాయిదా వేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి వాదనలను వినిపించారు. "చక్రధర్‌గౌడ్ ఒక క్రిమినల్. అతడిపై లైంగికదాడి సహా 11 కేసులున్నాయి. రైతులకు పంచిపెట్టేందుకు ఆయనకు కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఇది రాజకీయ కక్షతో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టించిన కేసు. తప్పుడు ఆరోపణలతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయండి" అని ధర్మాసనాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలను వినిపించారు. చక్రధర్ గౌడ్ ఫోన్‌ట్యాపింగ్ అయినట్లు ఆధారాలున్నాయని, అతడి సీడీఆర్‌లు సైతం అందుబాటులో ఉన్నాయని.. హరీశ్‌రావు మంత్రిగా తన హోదాను దుర్వినియోగం చేశారని.. వ్యక్తిగత గోప్యత హక్కును కాలరాశారని పేర్కొన్నారు. హరీశ్‌రావు చెప్పినట్లు రాధాకిషన్‌రావు ఫిర్యాదుదారుడిని చిత్రహింసలకు గురిచేశారని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలను విన్న ధర్మాసనం.. ఈ కేసులో పెట్టిన సెక్షన్లను బలపరిచేలా ఫిర్యాదు లేదని వ్యాఖ్యానించింది. "ఫిర్యాదుదారు ఇచ్చిన సీఆర్‌పీసీ 161 స్టేట్‌మెంట్‌లో దోపిడీ, ప్రభుత్వ సేవకుల విశ్వాస ఘాతుకం, గాయపర్చడం ద్వారా భయపెట్టడం, సమాచార సాంకేతికతకు సంబంధించిన ఆరోపణలు లేవు. ఐటీయాక్ట్ సెక్షన్ 66 పెట్టడానికి ఫిర్యాదులో ఆ మేరకు ఆరోపణలే లేవు. వివిధ క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న ఫిర్యాదుదారు తనను హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు తనను వేధిస్తున్నారని ఎక్కడా మెజిస్ట్రేట్‌లకు ఫిర్యాదు చేయలేదు. 2023 డిసెంబరులో అధికారం మారింది. అధికారమార్పిడి జరిగి, కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎందుకు ఫిర్యాదు చేయలేకపోయారనేదానికి కారణాలు లేవు. విపరీత ఆలస్యానికి కారణాలు కూడా లేవు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు ఫిర్యాదులను, మెటీరియల్‌ను పరిశీలించామని.. పోలీసులు పెట్టిన సెక్షన్లకు ముడిసరుకు లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు, రాధాకిషన్‌రావుపై కేసు కొట్టివేస్తూ.. తుది తీర్పు ఇచ్చింది.

వడ్డీ చెల్లింపులకే 14.2% సొమ్ము హరీ

రెవెన్యూ వ్యయంలో వడ్డీ భారం ఎక్కువే.. దేశంలోనే ఆరో స్థానంలో తెలంగాణ

- ప్రధాన రాష్ట్రాల సగటుతో పోలిస్తే అధికమే
- 2023-24లో వడ్డీలు, కిస్తీలకు రూ.61,691 కోట్లు
- బడ్జెట్ రుణాల కంటే కార్పొరేషన్ రుణాల వడ్డీ ఎక్కువ
- ఆర్థిక స్థితి బాగా లేక వేస్ అండ్ మీన్స్, ఓడీల బాట
- 'తెలంగాణ సామాజిక, ఆర్థిక దృక్పథం-2025'లో వెల్లడి



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి వడ్డీ చెల్లింపులు పెద్ద గుదిబండగా మారుతున్నాయి. అప్పులు పెరిగినకొద్దీ... వడ్డీ భారం అధికమవుతోంది. రాష్ట్ర రెవెన్యూ వ్యయంలో ఒక్క వడ్డీ చెల్లింపులకే 14.2 శాతం మేర నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించడంలో దేశంలోనే తెలంగాణ ఆరో స్థానంలో నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 'తెలంగాణ సామాజిక, ఆర్థిక దృక్పథం-2025' స్పష్టం చేసింది. ఇంత భారీ స్థాయిలో వడ్డీలు చెల్లించడానికి ప్రధాన కారణం ఏటేటా పెరుగుతున్న రాష్ట్ర అప్పులేనని వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తన రెవెన్యూ వ్యయంలో కేవలం వడ్డీ చెల్లింపులకే 14.2 శాతం నిధులను వెచ్చించిందని తెలిపింది. దేశంలోని ప్రధాన రాష్ట్రాల వడ్డీ చెల్లింపుల సగటు 12.7 శాతం కంటే తెలంగాణ వడ్డీ చెల్లింపులు అధికమని వివరించింది. ఈ విషయంలో తెలంగాణ దేశంలోనే ఆరో స్థానంలో నిలుస్తోంది. హరియాణా (18.9%), పశ్చిమబెంగాల్ (18%), కేరళ (17.7%), పంజాబ్ (17.5%), తమిళనాడు (16.8%) మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. 14.1 శాతంతో గుజరాత్ తెలంగాణ కంటే కాస్త మెరుగ్గా ఏడో స్థానంలో నిలుస్తోంది.

వేస్ అండ్ మీన్స్‌పై ఆధారపడక తప్పడం లేదు

అప్పులకు వడ్డీ, కిస్తీల చెల్లింపులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని, ఫలితంగా ప్రభుత్వం స్వల్పకాలిక రుణాల బాట పట్టిందని తెలిపింది. రాబడులు, రెవెన్యూ వ్యయం మధ్య సమతూకం లోపించి, వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) వంటి స్వల్పకాలిక రుణాలు తెచ్చుకోవాల్సి వస్తోందని వివరించింది. ఈ ఓడీకి వెళ్లే అత్యవసర పరిస్థితులు కూడా పెరుగుతున్నాయని తెలిపింది. 2017-18లో ఓడీ తెచ్చుకున్న రోజులు 5 మాత్రమే ఉండగా... 2023-24లో అవి 121 రోజులకు పెరిగాయని వివరించింది. వేస్ అండ్ మీన్స్‌కు సంబంధించి 2016-17లో 34 రోజులు ఉండగా, 2023-24లో 154 రోజులకు పెరిగాయని తెలిపింది. ఇలాంటి స్వల్పకాలిక రుణాలపై ఆధారపడడం వల్ల కూడా వడ్డీ భారం పెరుగుతుందని, ఇది ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తోందని పేర్కొంది.

రాష్ట్ర అప్పు రూ.7,38,707 కోట్లు

2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.72,658 కోట్లుగా ఉన్న రాష్ట్ర అప్పు ఈ సంవత్సరం ఫిబ్రవరి నాటికి రూ.4,37,223 కోట్లకు చేరింది. ఇవి కాకుండా కార్పొరేషన్ల కోసం తీసుకున్న అప్పు మరో రూ.3,01,484 కోట్లు కూడా ఉందని, దీనితో కలిపితే రాష్ట్ర అప్పు రూ.7,38,707 కోట్లకు చేరిందని తెలిపింది. ఎఫ్ఆర్‌బీఎంకు లోబడి, బడ్జెట్‌పరంగా తీసుకున్న అప్పునకు 2014-15లో రూ.6,954 కోట్లను వడ్డీలు, కిస్తీల రూపంలో చెల్లించగా... 2023-24లో అది రూ.36,866 కోట్లకు చేరింది. బడ్జెట్‌కు ఆవల తీసుకున్న అప్పులను కూడా కలిపితే... 2014-15లో కిస్తీలు, వడ్డీల చెల్లింపులు రూ.7,254 కోట్లు ఉండగా... 2023-24లో రూ.61,691 కోట్లకు చేరాయి. పైగా... బడ్జెట్ రుణాలకు సగటున 7.49 శాతం వడ్డీ రేటు ఉండగా... కార్పొరేషన్ల రుణాలకు 8.93 శాతం నుంచి 11.50 శాతం మేర వడ్డీ రేట్లు పలికాయని తెలిపింది. ఇలా వడ్డీ చెల్లింపుల భారం పెరిగి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలవుతుందని పేర్కొంది.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు టెండర్‌పై యథాతథ స్థితి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్‌ను అనుసంధానిస్తూ ఆ రోడ్డును నిర్మించ తలపెట్టిన సర్కారు

- భూసేకరణ పూర్తికాకుండానే టెండర్ నోటీస్ ఇవ్వడంపై పలువురి పిటిషన్



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)ను అనుసంధానం చేసేలా నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు టెండర్ నోటీస్‌పై యథాతథ స్థితి (స్టేటస్ కో) విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ వ్యవహారం ప్రాథమిక దశలో ఉండగానే రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలవడం అన్యాయమంటూ మదీనాగూడ మైత్రినగర్‌కు చెందిన శిల్పా రియల్ వ్యాల్యూ ప్రాపర్టీస్, నీరటి రవీందర్ మరికొంతమంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భూసేకరణ నోటిఫికేషన్‌కు సంబంధించి 2013 భూసేకరణ చట్టంలో పేర్కొన్న విధంగా తమ వాదనలు కూడా వినలేదని.. అయినా భూసేకరణ పూర్తయినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ముందుకెళ్తున్నాయని పేర్కొన్నారు. జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టింది. ఓఆర్ఆర్ రావిర్యాల నుంచి ఆర్ఆర్ఆర్ ఆమన్‌గల్ (రతన్ టాటా రోడ్డు) వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేశాయని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన ప్రైవేటు భూముల సేకరణకు సాధారణ భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. భూసేకరణ చట్టం సెక్షన్ 11 కింద గతేడాది అక్టోబరు 28న భూయజమానులకు నోటీసులు అందజేశారని.. అయితే చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం ఇంకా భూయజమానుల వాదనలు వినే ప్రక్రియ ప్రారంభం కాలేదని చెప్పారు. ఈలోపే టెండర్ నోటీసు ఇవ్వడమంటే భూసేకరణ ప్రక్రియను అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. యజమానుల అభ్యంతరాలను తిరస్కరించినట్టే భావించి.. భూసేకరణ పూర్తయిందనుకుని టెండర్ వరకు వెళ్లారని.. భూసేకరణ ప్రక్రియను మొక్కుబడి కార్యక్రమంగా మార్చేశారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఇచ్చిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు టెండర్ నోటీస్‌పై యథాతథ స్థితి కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 15వ తేదీకి వాయిదా వేసింది.

ఐపీఎస్ అభిషేక్ మహంతికి

హైకోర్టులో స్వల్ప ఊరట

- కేంద్రం ఉత్తర్వులపై 24వ తేదీ వరకు స్టే

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అఖిల భారత సర్వీసు అధికారులు క్యాడర్ వివాదంలో ఉన్న ఐపీఎస్ అభిషేక్ మహంతికి హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఆయన ఏపీ క్యాడర్‌లో చేరాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలును ఈనెల 24వ తేదీ వరకు నిలిపేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ క్యాడర్‌లో చేరాలన్న ఉత్తర్వులపై ఇటీవల సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో ఎలాంటి ఊరట లభించకపోవడంతో మహంతి మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం 2022లో జీవో 171 ద్వారా అభిషేక్ మహంతిని తెలంగాణ సర్వీసుల్లోకి తీసుకున్న విషయం కేంద్రం దృష్టిలో ఉందా? లేదా? అని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. 'పిటిషనర్ తొలుత ఏపీలో విధులు నిర్వర్తించారు. తర్వాత తెలంగాణ క్యాడర్‌లోకి తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఏపీకి వెళ్లాలని ఆదేశాలిచ్చారు. ఇదేదో కుర్చీల ఆటలాగా ఉంది. అతను మీ అధికారి.. మా ఎదుట కేసు విచారణలో ఉండగానే అతడిని అత్యవసరంగా ఏపీకి పంపాల్సిన అవసరముందా? కనీసం కేసు పూర్తయ్యే వరకు కూడా ఆగలేరా..?' అని అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మను ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై సోమవారం లోపు కేంద్రం తన వైఖరి తెలియజేయాలంటూ విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహత్తర విజయం

ఎనిమిదిరోజుల అంతరిక్ష యాత్రకని వెళ్ళిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు తొమ్మిదినెలల తరువాత తిరిగివచ్చారు. అంతరిక్ష కేంద్రం నుంచి పదిహేడు గంటల ప్రయాణం తరువాత, వాళ్ళను భద్రంగా దాచుకున్న స్పేస్‌ఎక్స్ డ్రాగన్ కాప్సూల్ ఫ్లోరిడా సముద్రజలాలను తాకి, కెరటాల మీద తేలుతున్న దృశ్యం చూసిన ప్రపంచజనం మనసులు ఆనందంతో పులకించిపోయాయి. వారి రాకను డాల్ఫిన్లు సైతం స్వాగతించాయంటూ సామాజిక మాధ్యమాలు మనసు పారేసుకున్నాయి. వారిద్దరూ చిక్కుకున్నారనో, తిరిగి తేలేకపోయామనో అంటే నాసాకు మాచెడ్డ కోపం వస్తుంది కనుక, అనువైన కాలం కోసం ఇంతకాలం వేచివున్నట్టుగా దాని పరిభాషలోనే చెప్పుకోవాలి. మొన్నటివరకూ బైడెన్ అధ్యక్షుడుగా ఉండబట్టే వీరిద్దరూ అక్కడే ఉండిపోయారని, తాను రావడంతోనే వీరికీ కాలం కలిసొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంటున్నారు. శాస్త్రవేత్తలిద్దరినీ కిందకు దించుతానని ప్రపంచానికి హామీ ఇచ్చి, స్పేస్ ఎక్స్ మస్క్‌కు బాధ్యత అప్పగించి, చెప్పింది చేసి చూపించానని ట్రంప్ చెప్పుకున్నారు. అధ్యక్షులవారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని మస్క్ మందహాసం చేశారు. మాకు శాస్త్రమే తెలుసు తప్ప ఈ రాజకీయాలు పట్టవని నాసా ప్రతినిధి ఓ మాటన్నారు. యాభైతొమ్మిదేళ్ళ వయసులో సునీతావిలియమ్స్ చేసిన సాహసాన్ని మనసారా మెచ్చిన ఆమె తల్లి కూడా అదే అంటున్నది. ఎవరు ఏమైనా అనవచ్చు కానీ, ఒక్కమాటలో చెప్పాలంటే ఇది సైన్స్ సాధించిన అద్భుత విజయం. యావత్ శాస్త్ర ప్రపంచం సంబరాలు చేసుకోవాల్సిన సందర్భం. అంతరిక్ష పరిశోధనలకు, ప్రయోగాలకు మరింత శక్తినీ, యుక్తినీ, సమధికోత్సాహాన్ని అందించిన ఘట్టం.

తిరుగు ప్రయాణమవుతున్న తరుణంలో సునీత ఒక మాటన్నారు. అంతరిక్షం నుంచి చూస్తే భూగోళం మాత్రమే కనిపిస్తుంది, దేశాల మధ్య సరిహద్దులు కనబడవని. అంతరిక్ష కేంద్రంలో ఉంటూ, రోజుకు పదహారుసార్లు సూర్యోదయ సూర్యాస్తమయాలను చూస్తున్నప్పుడు ఆమెకు ఇటువంటి భావనలనేకం కలిగివుంటాయి. హద్దులన్నీ మనిషి సృష్టించుకున్నవేనని అనిపించివుంటుంది. బోయింగ్ క్రూకాప్సూల్ పనితీరు అంచనావేయడానికి వెళ్ళి, ఎనిమిది రోజుల్లో వెనక్కు రావాల్సిన వాళ్ళు, 286రోజులు చిక్కుబడిపోయి కూడా చెదరకుండా ఉండటం సామాన్యమైన విషయం కాదు. పది నిముషాలు నిరీక్షించాల్సివచ్చినా, ఎవరికోసమో ఎదురుచూడాల్సి వచ్చినా, రోడ్డుమీద చిక్కుబడిపోయినా మనిషి విసిగెత్తిపోతాడు. అనుకున్నది అనుకున్నట్టుగా జరగనప్పుడు, ఆశించినది వెంటనే దక్కనప్పుడు నీరుగారిపోతాడు, లేదంటే వీరంగం వేస్తాడు. అటువంటిది భారరహిత స్థితిలో, కాళ్ళు గట్టిగా సాగదీసుకోవడానికి వీల్లేని ఒక అగ్గిపెట్టెలాంటి గదిలో, నాలుగు అడుగులు వేసిరావడానికి కుదరని నిర్బంధంలో అంతకాలం మనుగడసాగించాలంటే దేహదారుఢ్యం ఒక్కటే చాలదు. మనోనిబ్బరంతో సమస్యను ఎదుర్కోవడానికి, ఊహలో కూడా లేని ఇబ్బందిని అధిగమించడానికి, ఆ నిర్బంధస్థితిని సదవకాశంగా మలుచుకోవడానికి, సమయాన్ని సద్వినియోగపరచడానికి ఎంతో కర్తవ్యనిష్ఠకావాలి. మనసు గాడితప్పకుండా, బుద్ధి తిరిగిపోకుండా నియంత్రణ, నిగ్రహం కావాలి. తమకు అప్పగించిన పనినేకాదు, అవాంతరాన్ని సైతం అవకాశంగా ఉపయోగించుకొని శాస్త్రవేత్తలు ఇద్దరూ మానవాళి శ్రేయస్సుకు ఉపకరించే పరిశోధనలు అనేకం చేశారు.

నింగినుంచి నేలమీదకు దిగుతామన్న నమ్మకం ఒకదశలో పూర్తిగా నశించిపోయిన దశలో కూడా వారు చెదరలేదు. ఇరువురి ఆరోగ్యం బాగా పాడైందంటూ కొంతకాలంగా వచ్చిన వరుస విశ్లేషణల్లో ఎంత నిజం ఉన్నదో లేదో తెలియదు కానీ, ఇంతకాలం ఆకాశాన ఉండిపోయినందుకు సమస్త అవయవాలూ దుష్ప్రభావాన్ని చవిచూడటం సహజం. అయినా, నీటిమీదవాలిన అనంతరం కాప్సూల్ తలుపులు తెరుచుకోగానే ఆ శాస్త్రవేత్తల్లో వీసమెత్తు విచారం కానీ, బాధలూ భావోద్వేగాలు కానీ కనబడలేదు. చెరగని ఆ చిరునవ్వులు, విజయ చిహ్నాలు, కళ్ళలో కాంతులు, చక్కని పలకరింపులు చరిత్రలో నిలిచిపోతాయి. సురక్షితంగా భువికి దిగివచ్చిన శాస్త్రవేత్తలు సంపూర్ణ ఆరోగ్యంతో, పరిపూర్ణమైన ఆయుష్షుతో ఆనందంగా ఉండాలని కోరుకుందాం.

ఇరవై రెండు భాషలకూ అధికార హోదా

భారత గణతంత్ర రాజ్య అధికార భాషగా హిందీ! ఇంకెంతకాలం ఈ ప్రహసనం? జరూరుగా ముగించేద్దాం. ఈ పరిత్యజనం వల్ల హిందీ ప్రాభవానికి ఎటువంటి హాని సంభవించదు. నిరంతరం బాల రాజు హోదాలో ఉండడం వల్ల హిందీకి మేలు జరగదు; దేశ శ్రేయస్సుకూ తోడ్పడదు. ఈ హోదా తగ్గింపు హిందీని వివిధ భారతీయ భాషలతో సమస్థాయిలో కలుపుతుంది. నష్టమేమిటి? దానివల్ల అసలు భాషా వివక్షకు కారణమైన ఆంగ్ల భాషా సామ్రాజ్యవాదంపై తీవ్ర చర్చను నిరోధిస్తున్న 'హిందీ విధింపు' అన్న భావావేశాల దారి మళ్లింపు వ్యవహారం అన్న అడ్డు తొలగిపోతుంది. ఇది, భావాలలో స్వరాజ్యం దిశగా ఒక గొప్ప ముందడుగు అవుతుందేమో!

హిందీ భాష విషయమై గత 75 సంవత్సరాలుగా అనుసరిస్తున్న విధానం ఆశించిన లక్ష్యాలను నెరవేర్చకపోగా ప్రతికూల ఫలితాలను మాత్రమే ఇస్తోంది. మాట్లాడే ప్రజల సంఖ్య అత్యధికంగా ఉన్న కారణంగా భారతీయ భాషా ప్రపంచ వైవిధ్యంలో హిందీకి ఒక ప్రత్యేక స్థానమున్నది. జనాభా గణన ప్రక్రియలో హిందీ భాష మాట్లాడే వారుగా వర్గీకృతమైన జనుల సంఖ్య 60 కోట్లకు (దేశ జనాభాలో 42 శాతంకు) పైగా ఉన్నది. ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాషలలో హిందీ నాల్గవ స్థానంలో ఉన్నది. మరే ఇతర భారతీయ భాషకు ఇటువంటి ప్రాధాన్యం లేదు, పొందలేదు కూడా. బహు భాషామయమైన మన జాతి జీవితంలో హిందీ ఒక వారధిగా ఉపయోగపడగలదు. అయితే తనలో అంతర్గతం చేసుకున్న బహు భాషల మూలాలను, ఇతర భారతీయ భాషలకు విస్తరించిన తన ప్రభావాన్ని నిలుపుకుని అభివృద్ధిపరచుకోగలిగితే హిందీ ఒక వారధి భాషగా తప్పకుండా వెలుగొందుతుంది. భారతీయ భాషా జగత్తులో అత్యున్నత హోదాను ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరి నుంచి గౌరవాదరాలను అపేక్షించే 'శుద్ధ' హిందీ అంతిమంగా మతతత్వానికి ఆలంబన అవుతుంది. సాంస్కృతిక విభేదాలను పెంచి, జాతీయ సమైక్యతను బలహీనపరుస్తుంది.

హిందీకి అధికార భాష హోదా దానికి మేలు చేయకపోగా హాని మాత్రమే చేసింది. తనలో అంతర్గతం చేసుకున్న భాషలకు సవతి తల్లిగాను, ఇతర భారతీయ భాషలకు అత్తగారుగాను పరిణమించింది. అటూ ఇటూ ఎవరి నుంచి గౌరవాన్ని పొందలేకపోతోంది. దీనికి తోడు ఇప్పుడు హిందీని దేశవ్యాప్తంగా అధికార భాషగా చేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలతో పరిస్థితులు మరింతగా విషమించాయి. ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడు రఘువీర్ సహాయ్ తన 'హమారి హిందీ' అన్న కవితలో భార్యను కోల్పోయిన సంపన్న వృద్ధుడి కొత్త, పడుచు భార్యగా పోల్చాడు! ఆయన ఆ పద్యం ఆరు దశాబ్దాల క్రితం రాశారు. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. ఏమైనా మార్పు ఉంటే అది ఆంగ్ల భాష తన స్థానాన్ని మరింతగా బలోపేతం చేసుకోవడమే. హిందీ భాష మాట్లాడే ప్రజలు అందరూ తమ బిడ్డలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో చేర్పించేందుకే ఆరాటపడుతున్నారు. హిందీ రాష్ట్రాలలోని మధ్యతరగతి' విద్యావంతులలో ఎంతమంది హిందీ దినపత్రికను చదువుతున్నారు? ఇంట వారు మాట్లాడే భాష అటు హిందీనా కాదు, ఇటు ఆంగ్లమూ కాదు. రెండింటి మిశ్రమం. అదొక సంకర భాష. ఆంగ్లంతో సరిచూసినప్పుడు హిందీ ఎంత అప్రధానంగా ఉంటుందో నిత్య సామాజిక జీవితంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సులకు హిందీ దినపత్రికల నిండా వాణిజ్య ప్రకటనలే. తల్లిదండ్రులు తమ బిడ్డలను అతిథులకు వచ్చీరాని ఆంగ్లంలో పరిచయం చేస్తుంటారు. యువజనులు తమ స్నేహితుడు లేదా స్నేహితురాలును ఆకట్టుకునేందుకు వచ్చీరాని ఆంగ్లంలో వింతగా మాట్లాడుతుంటారు! ఆంగ్లానికి విలువ పెరుగుతోంది. హిందీకి ఆదరణ తగ్గుతోంది.



హిందీ వ్యాప్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాల కంటే– బాంబే సినిమా, క్రికెట్ కామెంటరీ, టీవీ న్యూస్, టీవీ సీరియల్స్– ఎక్కువ సత్ఫలితాలు సాధించాయి. హిందీని ప్రమోట్ చేయడానికి బదులు భారతీయ భాషలను ప్రోత్సహించడం, అభివృద్ధిపరచడమే జాతీయ లక్ష్యం కావాలి. ప్రతి ఒక్కరికీ మాతృభాషలో విద్య సమకూర్చాలనే విద్యాహక్కు నిర్దేశాన్ని అమలుపరచేందుకు చిత్తశుద్ధితో పూనుకోవాలి. హిందీ ప్రజల భాష. అది అలా ఉండిపోవడమే దానికి అన్ని విధాల మేలు.



■ యోగేంద్ర యాదవ్

ప్రపంచపు నాల్గవ అతి పెద్ద భాషను దానిని మాట్లాడే రాష్ట్రాలలోనే బోధించడం సాధ్యం కావడం లేదు. ఇక హిందీని నేర్చుకోవాలని ఇతరులను ఎలా బలవంతపెట్టడం? హిందీ మాతృభాషగా ఉన్న ఐదవ తరగతి గ్రామీణ విద్యార్థులలో రెండవ తరగతి హిందీ పాఠ్యగ్రంథంలోని పాఠాలను ఒక పేరా కూడా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారని అసర్ సర్వే వెల్లడించింది. హిందీ మాధ్యమంలో కళాశాల విద్యను అభ్యసించిన పట్టభద్రులు వ్యాకరణ యుక్త హిందీని రాయలేకపోతున్నారు. వారి హిందీ పదాల అక్షర క్రమం కూడా సరిగ్గా ఉండదు. మరీ ముఖ్యంగా హిందీ భాష ఒక మేధో సంస్కృతిని సృష్టించనేలేదు. ప్రపంచ స్థాయి ఉత్తమ సాహిత్యాన్ని హిందీ రచయితలు సృజిస్తున్నారు. అయితే హిందీ రాష్ట్రాల ప్రజానీకంలో ఎంత మంది సమకాలీన మహా రచయిత వినోద్ కుమార్ శుక్లా పేరును గుర్తుపట్టగలరు? అసాధారణ పాత్రికేయులు ఉన్నారు. అయితే ఉత్తమ, ఉత్కృష్ట పాత్రికేయానికి ఆలంబనగా ఉన్న వార్తా పత్రిక ఒక్కటీ లేదు కదా. అధునాతన వైజ్ఞానిక, సాంకేతిక, సామాజిక శాస్త్రాల విషయం అటుంచండి, ఏ విద్యా విభాగంలోను లక్షలాది విద్యార్థుల అవసరాలను తీర్చే పాఠ్య గ్రంథాలు లేనే లేవు. మరి హిందీ మాధ్యమంలో ఉన్నత విద్యాభ్యాసం వల్ల ప్రయోజనమేముంది? నవీన భావాల వ్యాప్తికి దోహదం చేసిన చివరి హిందీ మ్యాగజైన్ దిన్ మాన్ (కాకతాళీయంగా దీనికి ఎడిటర్ రఘువీర్ సహాయ్) యాభై సంవత్సరాల క్రితమే మూతపడింది.

పాఠశాలలో హిందీలో మాట్లాడితే బాలలకు జరిమానా విధించే పరిస్థితులు ఉన్న దేశం మనది. మరి హిందీ ఆధిపత్యం గురించి మాట్లాడడం ఒక క్రూర పరిహాసమే సుమా! ఆధిపత్యంలో ప్రభావశీల నియంత్రణ, సాంస్కృతిక న్యాయబద్ధత అంతర్గతంగా ఉంటాయి. హిందీకి ఇవేవీ లేవు. భారతీయ పాలకవర్గాల భాష ఇంగ్లీష్. దానికి సాంస్కృతిక ప్రాబల్యమున్నది. ఆర్థిక వనరులు ఉన్నాయి. శక్తిమంతమైన విద్యా సంబంధిత పరిశ్రమ మద్దతు ఉన్నది. ఆ భాష ఎవరి మీదైతే పెత్తనం చేస్తుందో వారు దానిని రక్తగతం చేసుకున్నారు. సాంస్కృతిక ఆధిపత్యమంటే ఇదే కదా?


హిందీ భాషా దురభిమానులు ఎంతగా అహంకారాన్ని ప్రదర్శిస్తున్నా హిందీని హిందీయేతర భాషల వారిపై రష్యన్ భాషను, సోవియట్ యూనియన్‌లో రష్యన్ భాషను, రష్యనేతర ప్రజలపై రుద్దినట్టు రుద్దలేదు. భారతీయ భాషా వైవిధ్యాన్ని గౌరవించడం వల్లే భారత గణతంత్ర రాజ్యం సమైక్యంగా మనగలుగుతోంది. అయితే హిందీ విధింపు అన్న ఆరోపణలో నిజం లేకపోలేదు అధికార భాషగా హిందీని ప్రోత్సహించడం దాని సాధికారతకు చేసిన మేలు ఏమీ లేదు. బిల్ బోర్డులు, నేమ్ బోర్డులు హిందీలోనే ఉండాలనడం హిందీయేతర భాషల వారికి ఆగ్రహం కలిగిస్తోంది. భారత ప్రభుత్వం కొత్త పథకాలకు, కార్యక్రమాలకు, చట్టాలకు కూడా హిందీ లేదా సంస్కృతంలో పేర్లు పెట్టడం హిందీయేతర భాషల వారికి చిరాకు కలిగిస్తోంది. దీనికి తోడు హిందీ భాషీయులు తమది 'జాతీయ భాష' అని ఎల్లవేళలా ఘోషించడం ఆ భాష పట్ల వ్యతిరేకతను మాత్రమే పెంచుతోంది. హిందీ 'జాతీయ భాష' అనేందుకు ఎలాంటి చట్టబద్ధత గానీ, రాజ్యాంగ బద్ధత గానీ లేదు కదా. కేవలం ప్రభుత్వ కార్యాలయాలలో మాత్రమే అది అధికార భాషగా పరిగణింపబడుతోంది. దీని పర్యవసానాలు పూర్తిగా ప్రతికూలంగా ఉంటున్నాయి.

ఈ వాస్తవాల దృష్ట్యా నేను ఒక ప్రతిపాదన చేస్తున్నాను. రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలులోని 22 భాషలకు అధికార భాష హోదా కల్పించాలి. మనకు ఒక జాతీయ అధికారిక, లేదా అనుసంధాన భాష అవసరం లేదు. సెప్టెంబర్ 14ను హిందీ దినోత్సవంగా కాకుండా భారతీయ భాషలు అన్నిటినీ గౌరవించేందుకు భాషా దినోత్సవంగా నిర్వహించాలి. హిందీని ప్రోత్సహించేందుకు శత విధాల చేస్తున్న ప్రయత్నాలు అన్నిటినీ భారత ప్రభుత్వం నిలిపివేయాలి. అనుసంధాన భాష అవసరమైనవారు దానిని తమకు తామే ఎంపిక చేసుకోవాలి. అనుసంధాన భాషగా గౌరవం పొందాలని హిందీ ఆశిస్తుంటే ఇతర భాషలతో సంకరమయ్యేందుకు సిద్ధమవ్వాలి. 'సరైన' హిందీని నిర్ణయించి నమోదు చేసేందుకు ఒకటి గాక బహుళ సంస్థలను అనుమతించాలి.

హిందీని ప్రమోట్ చేయడానికి బదులు భారతీయ భాషలను ప్రోత్సహించడం, అభివృద్ధిపరచడమమే జాతీయ లక్ష్యంగా ఔదలదాల్చాలి. 'ఇంగ్లీష్‌ను బహిష్కరించాలి' అన్న ఒకనాటి లోహియా నినాదం ఇంకెంత మాత్రం పనిచేయదు. 'భాషలను అభివృద్ధిపరచడమే' మన ఉద్ఘోష కావాలి. ఉద్యమ ఉద్వేగంతో, సంకల్ప శుద్ధితో ఈ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. మొత్తం 22 భాషలలోను ఉన్నత విద్యకు అవసరమైన పుస్తకాలు అన్నిటినీ అనువాదం చేసుకోవాలి. బాలసాహిత్యాన్ని పునః సృజించుకోవాలి. ఇందుకు అవసరమైన ఆర్థిక వనరులు ప్రభుత్వం సమకూర్చాలి. దీనితో పాటు 'మాండలికాలు'గా మాత్రమే పరిగణన పొందుతూ, ఎనిమిదో షెడ్యూలులో లేని కనీసం 100 భాషలను కాపాడేందుకు అవసరమైన సంస్థలను ఏర్పాటు చేసి వాటికి అన్ని విధాల మద్దతునివ్వాలి. ప్రతి ఒక్కరికీ మాతృభాషలో విద్య సమకూర్చాలనే విద్యాహక్కు నిర్దేశాన్ని అమలుపరిచేందుకు చిత్తశుద్ధితో పూనుకోవాలి. హిందీ ప్రజల భాష. అది అలా ఉండిపోవడమే దానికి అన్ని విధాల మేలు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఒక పెద్ద ఆటలో జెలెన్స్కీ ఒక చిన్న బుడంకాయ. ఈ బుడంకాయకు భవిష్యత్తు లేదు. అతడు అమెరికా, యూరపు నాయకుల రాజకీయ క్రీడలో ఒక పావు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటినుంచీ, ఈ బంటుని యూరప్, అమెరికాలు బాగా మేపుతూ వచ్చాయి. ఈ గారాబం జెలెన్స్కీ తలకెక్కింది. ట్రంప్ వచ్చాక అదంతా మారిపోతోంది.



జెలెన్స్కీ హీరో కాదు, జీరో

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకీ మధ్య వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో జరిగిన వాగ్యుద్ధం ఒక ప్రపంచ సంచలనం అయింది. యూరపునైతే అది కుదిపేసింది.

ఇటీవల అమెరికా పాలకుల స్వభావం మారలేదు కాని వారి ఎత్తుగడలలో చీలిక వచ్చింది. అమెరికా తన లక్ష్యాలను తిరిగి వేరుగా నిర్వచించుకోవాలి అన్న ధోరణికి ప్రతినిధి డొనాల్డ్ ట్రంప్. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మాటల్లో చెప్పాలంటే, "నగరానికి కొత్త షెరీఫ్ వచ్చాడు." అంటే రంగంలోకి ట్రంప్ వచ్చాడు. ట్రంప్ వచ్చీ రాగానే అమెరికా పాత ఏర్పాటుని మార్చే పనిని హడావుడిగా మొదలుబెట్టేసాడు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక రంగాలలో ఈ డబడబలూ పెను కంపాలు అందుకే.

రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుంచీ ప్రపంచంలో తిరుగులేని ఆర్థిక శక్తిగానూ సైనిక శక్తిగానూ ఏపుగా ఎదుగుతూ వచ్చిన అమెరికా ప్రపంచానికి పెద్దన్న అయింది. ఇప్పుడు అమెరికా ఆటలకి అడ్డుకట్ట వేసే శక్తులు క్రమంగా రంగంలోకి వచ్చాయి. చైనా ఒక కొత్త సామ్రాజ్య శక్తిగా, ఆర్థిక శక్తిగా సవాలు విసురుతోంది. రష్యా కొంత కోలుకొని నిలబడింది. మరోవైపు అమెరికా ఆర్థిక పతనం పుంజుకొంటోంది. అమెరికా జాతీయ రుణం 36 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెరిగింది. ఈ సందర్భంలో తమ పాత ఏర్పాటుకి కాలం చెల్లిందనీ, మరో కొత్త "ఏర్పాటు" అవసరమనీ ట్రంపు వర్గం భావిస్తోంది.

ఓవల్ ఆఫీసు డ్రామా తర్వాత, జెలెన్స్కీని హీరోగా చూపించే కథనాలు వచ్చాయి. నిజానికి, ఒక పెద్ద ఆటలో జెలెన్స్కీ ఒక చిన్న బుడంకాయ. ఈ బుడంకాయకు భవిష్యత్తు లేదు. అతడు అమెరికా, యూరపు నాయకుల రాజకీయ క్రీడలో ఒక పావు మాత్రమే. అతనికి ఒక స్వతంత్ర పాత్ర ఏదీ లేదు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటి నుంచీ, ఈ బంటుని యూరపు అమెరికాలు బాగానే మేపుతూ వచ్చాయి. నాటో దేశాల్లో ఎక్కడికెళ్లినా అతడికి డబ్బూ ఆయుధాలూ ఇచ్చి బుజ్జగించారు. ఈ గారాబం జెలెన్స్కీ తలకెక్కింది. ట్రంప్ వచ్చాక అదంతా మారిపోతోంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కావడానికంటే ముందే రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ కుదేలయిపోయింది. ఉక్రెయిన్ వాస్తవ పరిస్థితి తెలిసిన నిపుణుల మాట ఇది. ఆ సంగతి జెలెన్స్కీకి తెలుసు. అయితే తన కుక్క చావుని, ప్రపంచానికి ఒక వీర మరణంగా చూపించాలన్న కోరిక కూడా ట్రంప్ ముందు అతని కుప్పిగంతులకు మరో కారణం.

మరో విశేషం: సమావేశాన్ని రద్దు చేద్దామని ట్రంప్ ముందు జెలెన్స్కీకి కబురుచేశాడు. కాని జెలెన్స్కీ మాత్రం వస్తానని పట్టుబట్టాడు. అప్పుడు, జెలెన్స్కీ వచ్చేది, కేవలం తమ ఉమ్మడి ఒప్పందం మీద సంతకం చేయడానికి మాత్రమే అని ట్రంపు బహిరంగ ప్రకటన చేశాడు. అంతవరకూ ఉక్రెయిన్‌కి అందించిన భారీ "సాయా"నికి గాను, ఉక్రెయిన్ తన ఖనిజ సంపదపైన వందేళ్ల పాటు అమెరికాకు హక్కులు కల్పించాలి అన్నదే ఒప్పందం. తామిచ్చిన సాయం 350 బిలియన్ డాలర్లని ట్రంప్ చెప్పాడు. సామ్రాజ్యవాదుల "సాయం" మరి అలాగే ఉంటుంది. ఈ ఘోరమైన ఒప్పందం గురించి సమావేశానికి ముందే జెలెన్స్కీకి తెలుసు. ఓవల్ ఆఫీసులో కెమేరాల ముందు అతడు ఒక క్షతగాత్రుడిలా డ్రామా ఆడాడు. అక్కడ ఒక దేశ భక్తునిగా, తన దేశం కోసం ట్రంపునయినా ఎదుర్కోగల వీరునిగా అవతారం ఎత్తాడు. ఇప్పుడు ట్రంపుని మంచి చేసుకోడానికి నానా తంటాలు పడుతున్నాడు. ఖనిజ సంపదపై అమెరికాకు హక్కులు రాసివ్వడానికి, దేశాన్ని తాకట్టు పెట్టడానికి అతడు సిద్ధమే. అయితే, యుద్ధం ఆగకూడదు, తన పదవి ఊడగూడదు. ఎంతకాలం? రష్యాని ఓడించే దాకా. అది సాధ్యమా? ఈ ప్రశ్న ఒక రిటైరైన అమెరికా కల్నల్‌ని అడిగితే, ఆయన నవ్వకుండా చెప్పిందిది: రష్యన్లందరూ ఓ ఉదయం లేవగానే నడవడం ఎట్లాగో మర్చిపోతే, అది సాధ్యం.

యుద్ధం కొనసాగితే జనం అన్యాయంగా చచ్చిపోతూనే ఉంటారు. ముఖ్యంగా ఉక్రెయిన్ జనం. యుద్ధం ఆగిపోతే నాశనమయ్యేది, జెలెన్స్కీ, అతని ముఠా మాత్రమే. ఉక్రెయిన్‌లో మార్షల్ లా కొనసాగుతోంది. ఎన్నికలు సక్రమంగా జరిగితే జెలెన్స్కీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం. అందుకే అతడు ఎన్నికలకు వెళ్లడు. మార్షల్ లా పొడిగిస్తాడు. ఎన్నికలు జరపక తప్పని పరిస్థితి ఎదురైతే వాటిని సక్రమంగా జరగనీయడు.

ప్రపంచాన్నంతా అదుపు చెయ్యాలన్న తన పాత ధోరణిని వదులుకోక తప్పదని ట్రంప్ దళం గ్రహించింది. ఇకముందు సమ ఉజ్జీలతో దీర్ఘ కాలంపాటు సాగే యుద్ధాల్లో అది ఇరుక్కోకపోవచ్చు. తాను కొడితే తిరిగి కొట్టలేని అర్భకుల మీద దాడులకే అది పరిమితం కావచ్చు. ఈ క్రమంలో జెలెన్స్కీ లాంటి పెంపుడు కుక్కల్ని తగ్గించుకొని వాటిపై గతంలో పెట్టిన మదుపుని వడ్డీతో సహా వెనక్కి తీసుకోవాలనుకోవచ్చు. యూరపుని కూడా అది తన ప్రాధమ్యాల నుంచి తొలగించవచ్చు.

జెలెన్స్కీ ట్రంపుని కలవడానికంటే ముందే ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్, బ్రిటిషు ప్రధాన మంత్రి స్టార్మర్ ఒకరి తరవాత ఒకరు ట్రంపుని కలిశారు. వారి లక్ష్యం: యూరపు భద్రతకి, వారి శాంతి దళాల భద్రతకీ అమెరికా హామీ ఇవ్వాలి; రష్యా కొమ్ములు విరగ్గొట్టాలి. ఈ నాయకులకు కావల్సింది శాంతి కాదు; యుద్ధం. అందుకు అమెరికా నడుం బిగించాలి. రష్యాతో పోరాటంలో తమల్ని ముందుండి నడపాలని వారు కోరినప్పుడు, ట్రంపు వారి సైనిక శక్తిని పొగిడి వారికి అమెరికా అవసరం లేదనీ, వారే స్వయంగా రష్యాని ఎదుర్కోగలరని చెప్పి చేతులు దులుపుకొన్నాడు. ఒక బ్రిటిషు విలేఖరి వ్యాఖ్యానించినట్టుగా అంత వరకూ "రాజుగారి విదూషకుల్లాగా" ప్రవర్తించిన ఆ ఇద్దరు యూరపు నాయకులూ ట్రంపు మాటలకి ఏడవలేక నవ్వారు. అమెరికాకి ఇప్పుడు చైనాని నిరోధించడమే ప్రధానం. అమెరికా తన సొంత సహజ సరిహద్దుల్లో, సుస్థిరం కావాలనుకొంటోంది. సహజ సరిహద్దులు అంటే, కెనడా, మెక్సికో, గ్రీన్ లాండు, పనామా కెనాల్ తదితరాలు.

ఇక, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మాటకొస్తే, ఇప్పటికే రష్యా దాదాపు జయించింది అన్నది నిపుణుల అంచనా. ఉక్రెయిన్ భూభాగాలను రష్యా ఎంత ఆక్రమించింది అన్నది ఇక్కడ గీటురాయి కాదు. అది ఉక్రెయిన్ సైనికశక్తిని ఎంత నిర్వీర్యం చేసింది అన్నదే ప్రధానం. ఇప్పుడు ఉక్రెయిన్‌కి రిజర్వు దళాలు అంతమైపోయాయి. రిజర్వు ఆయుధాలూ లేవు. సైనికుల ఆత్మస్థయిర్యం అత్యంత దిగువ స్థాయిలో ఉంది. ప్రజల్లో యుద్ధ విముఖత భారీగా పెరిగింది. జెలెన్స్కీ ఓ రాజకీయ జూదరి. తాజా కుర్స్క్ యుద్ధంలో అతడి నడ్డి విరిగింది. యుద్ధ రంగం వదిలిపోతున్న ఉక్రెయిన్ సైనికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పుడు, అమెరికా కూడా తన కాడి కింద పడేసింది. యూరపు దేశాలు మాత్రం మాటల్లో సంఘీభావం ప్రకటించాయి. పాత వార్సా దేశాలైన పోలెండు, మూడు బాల్టిక్ దేశాలతో పాటు స్కాండినేవియన్ దేశాలు కూడా ఉక్రెయిన్‌కి సంఘీభావం తెలిపాయి. ఈ "సంఘీభావాల"న్నీ కలిసినా అంతిమ ఫలితాన్ని మార్చలేవు. ట్రంపుతో చర్చల్లో నెల రోజుల యుద్ధ విరమణకి అంగీకరిస్తూనే, యుద్ధానికి గల మూలకారణాలను తొలగించమంటున్నాడు పుతిన్. అంటే, నాటో సంగతి తేల్చమంటున్నాడు. అంతే కాదు. ఉక్రెయిన్‌కి, విదేశీ సహాయం – ఆయుధాలు, డబ్బు, గుప్త సమాచారం వగైరాలు– ఆగిపోవాలి, అంటున్నాడు.

పక్క నుంచి జెలెన్స్కీ గుండెలు బాదుకుంటూ ఏదో అరుస్తూనే ఉన్నాడు. వినేవాడే లేడు.

• ఎ. గాంధి
(సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్)


ఉస్మానియా ప్రతిష్ఠకూ, ఏడో హామీకీ విరుద్ధం!

విద్యార్థులలో, ప్రజాస్వామిక ఆలోచనాపరులలో, ప్రతిపక్ష పార్టీలలో, మొత్తంగా తెలంగాణ పౌరసమాజంలో ఆందోళనకు దారి తీసిన ఉస్మానియా విశ్వవిద్యాలయ తాజా సర్క్యులర్ ఇటు వందేళ్ళు పైబడిన చారిత్రక వారసత్వానికీ, ప్రతిష్ఠకూ భంగకరం. అంతేగాక, ప్రస్తుత అధికార పక్షం, ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఏడో హామీకీ పూర్తిగా వ్యతిరేకం. ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సంతకంతో మార్చి 13 తేదీతో వెలువడిన ఈ సర్క్యులర్ విశ్వవిద్యాలయ స్వతంత్ర ప్రతిపత్తినీ, రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామిక ప్రవర్తననూ, నిరసన తెలిపే ప్రాథమిక హక్కునూ కాలరాస్తున్నది.

విద్యార్థులు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి విశ్వవిద్యాలయ నిర్వహణకు ఆటంకం కలిగిస్తున్నారంటూ విశ్వవిద్యాలయ అధికారులు ఐదు రకాల చర్యలను నిషేధిస్తూ ఆ సర్క్యులర్ విడుదల చేశారు: 1) ట్రెస్‌పాసింగ్ (అనుమతి లేకుండా చొరబడడం). 2) ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడం. 3) నినాదాలు ఇవ్వడం. 4) పాలనాధికారులు, సిబ్బంది తమ విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం. 5) విశ్వవిద్యాలయ సిబ్బందికీ, అధికారులకూ వ్యతిరేకంగా అసభ్యకరమైన, బూతుల భాష మాట్లాడడం. "ఎవరైనా వ్యక్తి ఈ చర్యలకు పాల్పడినట్టుగా తేలితే, ఆ వ్యక్తి మీద చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకోబడతాయి" అనే హెచ్చరిక కూడా చేశారు. విశ్వవిద్యాలయ పద్ధతులతో నిజమైన సమస్య తలెత్తినప్పుడు విద్యార్థులు మొదట తమ సంస్థ స్థాయిలో సంబంధిత అధికారిని సంప్రదించాలని, ఆ తర్వాతనే రిజిస్ట్రార్‌కు, ఇతర అధికారులకు, "ముందస్తు అనుమతితో" తమ ప్రాతినిధ్యం ఇచ్చుకోవాలని కూడా సలహా ఇచ్చారు.

విశ్వవిద్యాలయంలో అన్ని విద్యార్థి సంఘాలూ ఈ సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టాయి. అధికారపక్షపు అనుబంధ విద్యార్థి సంఘ నాయకులతో సహా విద్యార్థి సంఘాల నాయకులందరూ ఈ అప్రజాస్వామిక సర్క్యులర్‌ను నిరసిస్తూ బంద్ పాటించారు. పోలీసులు ఆర్ట్స్ కాలేజీ భవనంలోకి ప్రవేశించి విద్యార్థుల మీద బలప్రయోగం సాగించడం, విద్యార్థినీ విద్యార్థులను అక్రమంగా ఎత్తుకుపోయి పోలీసు వాహనాల్లో విసరడం వంటి చర్యలను లైవ్ టెలివిజన్ సాక్షిగా సమాజమంతా చూసింది. ఒకవైపు ఇలా విద్యార్థుల అక్రమ నిర్బంధం, తరలింపు జరుగుతుండగానే ఎందరో విద్యార్థి నాయకులు ఈ నిర్బంధ సర్క్యులర్ పట్ల నిరసనను ప్రకటించారు. సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కూడా ఈ సర్క్యులర్‌ను ఖండించి వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రతిపక్షాలూ రంగంలోకి దిగాయి. రాష్ట్ర శాసనసభలో అధికారపక్షపు మిత్రపక్ష శాసనసభ్యులు కూడా సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సర్క్యులర్ గురించీ, వెల్లువెత్తుతున్న నిరసన గురించీ, ప్రభుత్వ మౌనం గురించీ చర్చించవలసిన విషయాలెన్నో ఉన్నాయి.

ఇంకా విచిత్రం– నినాదాలు ఇవ్వడాన్ని నిషేధిస్తున్నారట! నినాదం అంటే ఏమిటి, బిగ్గరగా మాట్లాడడం. భగత్ సింగ్ అన్నట్టు "చెవిటివాళ్లకు వినిపించేలా చేయడం". మరి, మాట్లాడడాన్ని కూడా నిషేధిస్తున్నారా? ఇంత అమానవీయమైన, అనాగరికమైన నిషేధం విధించే అధికారం ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులకు ఎంత మాత్రమూ లేదు.



ఈ సర్క్యులర్ ఒక విద్యా సంస్థకు, విద్యా సంబంధమైన స్వతంత్ర, ప్రజాస్వామిక, చర్చా, మేధా వాతావరణానికి తగిన భాషలో ఎంతమాత్రమూ లేదు. ప్రతి సామాజిక సమస్యనూ శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూసే పోలీసు పరిభాషలో ఉంది. "సంస్కృతి అన్నమాట వినబడగానే నా చెయ్యి రివాల్వర్ మీదికి పోతుంది" అని హిట్లర్ దగ్గర పోలీసు మంత్రి గోరింగ్ అన్నట్టు, విద్యార్థి ఆందోళన అనగానే పోలీసు పరిభాష వచ్చినట్టుంది. ఈ పరిభాషలో సమస్యలను అర్థం చేసుకోవడం, వాటికి సామరస్యపూర్వక చర్చలో పరిష్కారాలు వెతకడం ఉండదు. ఉక్కుపాదంతో అణచివేస్తే సమస్యలు లేకుండా పోతాయనే ధూర్త వైఖరి అది.

"ట్రెస్‌పాసింగ్" అనే న్యాయశాస్త్ర పారిభాషిక పదం ఒకరి సొంత ఆస్తిలోకి మరొకరు అనుమతి లేకుండా చొరబడటానికి సంబంధించినది. కాని విద్యా సంస్థలు కొద్ది కాలం అధికారంలో ఉండే వైస్ ఛాన్సలర్‌కో, ఇతర అధికారులకో సొంత ఆస్తులు కావు. అధ్యాపకుల, విద్యార్థుల ఆస్తులు కూడా కావు. అవి సామాజిక ఆస్తులు. సమాజం తన భవిష్యత్తరాలను తయారు చేసుకోవడానికి నెలకొల్పుకున్న కేంద్రాలు విద్యాలయాలు. అవి బహిరంగ సామాజిక స్థలాలు. ఒక విద్యాలయం గురించి "ట్రెస్‌పాసింగ్" అనే మాట వాడడమే పూర్తిగా అర్థరహితం, అనుచితం. నిజానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం మధ్య నుంచి రెండు ప్రధాన రహదారులతో "ట్రెస్‌పాసింగ్" అనే మాటకే అర్థం చెరిపేసింది.

ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడం మీద గంపగుత్తగా నిషేధం విధించడం రాజ్యాంగ వ్యతిరేకం. తమ నిరసన ప్రకటించడానికి ప్రజలకు ధర్నా, ఆందోళన, ప్రదర్శన, ఊరేగింపు, సభ, సమావేశం జరుపుకోవడం వంటి అనేక హక్కులు ఉన్నాయని గుర్తించి, రాజ్యాంగ అధికరణం 19 ఆ హక్కుకు హామీ ఇచ్చింది. అందులో భాగమే విద్యార్థుల ధర్నాల, ఆందోళనల హక్కు కూడా. ఆ హక్కును నియంత్రించడానికి ప్రత్యేక సందర్భాల్లో రాజ్యానికి అధికారం ఉందని చెపుతూ కూడా, రాజ్యాంగం స్పష్టంగా ఆ అధికారాన్ని "సహేతుకమైన ఆంక్షలు విధించడానికి" మాత్రమే పరిమితం చేసింది. మొత్తంగా ఆ హక్కును రద్దు చేసే, ఆందోళనలను నిషేధించే అధికారం రాజ్యానికి కూడా ఇవ్వలేదు. రాజ్యానికే లేని ఆ అధికారం ఒక విద్యా సంస్థలో తాత్కాలికంగా అధికార పీఠాల మీద కూర్చున్నవాళ్లకు అసలే ఉండదు.


ఇంకా విచిత్రం– నినాదాలు ఇవ్వడాన్ని నిషేధిస్తున్నారట! నినాదం అంటే ఏమిటి, బిగ్గరగా మాట్లాడడం. భగత్‌సింగ్ అన్నట్టు "చెవిటివాళ్లకు వినిపించేలా చేయడం". మరి, మాట్లాడడాన్ని కూడా నిషేధిస్తున్నారా? ఇంత అమానవీయమైన, అనాగరికమైన నిషేధం విధించే అధికారం ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులకు ఎంత మాత్రమూ లేదు. అంతే కాదు, ఇది ఎంతటి నియంతలు కూడా అక్షరాల్లో పెట్టడానికి సాహసించని నిరంకుశమైన, హాస్యాస్పదమైన నిషేధం.

సర్క్యులర్ ప్రస్తావించిన నాలుగో, ఐదో చర్యలు నిజానికి ఇప్పుడున్న చట్టాల ప్రకారమే నేరాలు. అవి ఎవరైనా చేస్తే చట్ట ప్రకారం దర్యాప్తు చేయవచ్చు, న్యాయస్థానం ముందుకు తీసుకుపోయి విచారణ జరిపించవచ్చు, శిక్షలు పడేలా వాదించవచ్చు. కాని, వాటిని నిషేధిస్తున్నాము అని ఒక సర్క్యులర్ జారీ చేసినంత మాత్రాన ఆ చర్యలు ఆగిపోవు. ఆగిపోతాయనుకోవడం భ్రమ. ఎంతటి శిక్షాభయం చూపినా కొన్ని పనులు జరపకుండా ఆపలేము. ఎందువల్లనంటే అటువంటి పనులు అయితే తక్షణ, తాత్కాలిక ఆవేశం మీదనైనా జరుగుతాయి, లేకపోతే పథకం ప్రకారమైనా జరుగుతాయి. తాత్కాలికావేశంలో అయితే ఆ సమయానికి శిక్షా భయం గుర్తు కూడా రాదు. ఉద్దేశపూర్వకంగా, ప్రణాళిక ప్రకారం చేసేవారికైతే శిక్ష గురించి తెలిసే పథకం రచిస్తారు గనుక వారిని కూడా శిక్షా భయం ఆపజాలదు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నూటా ఏడు సంవత్సరాల చరిత్రలో విద్యార్థి ఆందోళనలు, ప్రదర్శనలు, నినాదాలు లేకుండా ఉన్న కాలం అతి స్వల్పం. తెలంగాణ సమాజంలోని అనేక కీలక పరిణామాలకు ఉస్మానియా విశ్వవిద్యార్థుల చైతన్యమే కారణం. నిజాం ప్రభుత్వం, జె.ఎన్. చౌధురి సైనిక ప్రభుత్వం, కె.ఎ. వెల్లోడి పౌర ప్రభుత్వం, హైదారాబాద్ రాష్ట్రపు బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం, ఆ తర్వాత యాభై ఎనిమిదేళ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు, తర్వాత పదేళ్ళ ప్రత్యేక తెలంగాణ తొలి ప్రభుత్వం – ఏ ఒక్క ప్రభుత్వాన్నీ ఉస్మానియా విద్యార్థులు నిలదీయకుండా లేరు. విద్యార్థుల బహిష్కరణ, రస్టికేషన్, విద్యాసంవత్సరం రద్దు, ఆంక్షలు, ముళ్లకంచెలు, గేట్లు మూసివేయడాలు చేసి, ఆ అపకీర్తి మూటకట్టుకున్న ప్రభుత్వాలున్నాయి గాని, ఇప్పటి సర్క్యులర్ లాంటి నిరంకుశ చర్యలు ప్రకటించడానికి ఎవరూ సాహసించలేదు.

ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు తెలిసి చేసినా, తెలియక చేసినా, ప్రభుత్వ జోక్యంతో చేసినా, సొంతంగానే చేసినా, మొత్తానికి ఈ సర్క్యులర్ అత్యంత అనుచితమైన నిర్ణయం. ఇప్పటికైనా గౌరవప్రదంగా ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం ఉస్మానియా ప్రతిష్ఠకూ, ప్రజాస్వామిక పునరుద్ధరణకూ, ఏడో హామీ అని కాంగ్రెస్ పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానానికీ అత్యవసరం.

■ ఎన్. వేణుగోపాల్
సీనియర్ జర్నలిస్ట్



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:57 (శనివారం ఉదయం)



అభివృద్ధిలో అసమానతలు

- వివిధ రంగాల ప్రగతిలో వ్యత్యాసాలు
- తలసరి ఆదాయంలో జయశంకర్ మెరుగు.. హనుమకొండ అథమం
- జీడీపీపీలో హనుమకొండ ముందంజ.. జనగామ వెనుకబాటు
- పరిశ్రమల్లో ములుగు లాస్ట్.. పెట్టుబడుల్లో వరంగల్ ఫస్ట్
- ఆరు జిల్లాల అభివృద్ధిలో అసమతుల్యత
- ప్రజల జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావాలు
- స్పష్టం చేస్తున్న సామాజిక, ఆర్థిక గణాంకాలు

హనుమకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి అన్ని రంగాల్లో సమానంగా జరగడం లేదు. తలసరి ఆదాయం (పీసీఐ), స్థూల జిల్లా స్థాయి ఉత్పత్తి (జీడీడీపీ), పరిశ్రమల ఏర్పాటు, పంటల సాగు, భూకమతాలు తదితర అంశాల్లో తీవ్రమైన అసమాతలు కనిపిస్తున్నాయి. తలసరి ఆదాయంలో భూపాలపల్లి జయశంకర్ జిల్లా మెరుగైన స్థానం (12)లో ఉండగా, హనుమకొండ ఆఖరు స్థానం (32)లో ఉంది. స్థూల జిల్లా స్థాయి ఉత్పత్తి (జీడీపీపీ) విషయంలో హనుమకొండ జిల్లా కాస్త మెరుగైన స్థానం (16)లో ఉండగా, ములుగు జిల్లా మరీ అట్టడుగున 33వ స్థానంలో ఉంది. జిల్లాలో వ్యవసాయ రంగానికి అద్దంపట్టే భూకమతాల్లోనూ వ్యత్యాసాలు ఉన్నాయి. జనగామ జిల్లాలో సగటు భూకమతం 0.95 హెక్టార్లు ఉండగా, వరంగల్ జిల్లాలో మరీ తక్కువగా 0.74 హెక్టార్లు ఉంది. భూ వినియోగాన్ని ఎత్తిచూపే క్రాపింగ్ ఇంటెన్సిటీలోనూ తీవ్రమైన వ్యత్యాసం కనిపిస్తోంది. పరిశ్రమల ఏర్పాటులో కూడా తేడా మరీ ఎక్కువగా ఉంది. దీనిని బట్టి హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వివిధ రంగాల్లో అభివృద్ధిలో సారుప్యత లోపించి దాని ప్రభావం ప్రజల జీవన ప్రమాణాలపై పడుతోంది. ఇందుకు కారణం పాలకుల నిర్లక్ష్యం, అభివృద్ధి గురించి ప్రజాప్రతినిధులకు పట్టింపు లేకపోవడం, సమగ్రాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికల లేకపోవడం ప్రధాన కారణంగా ఆర్థికరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తలసరి ఆదాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తలసరి ఆదాయంలో రాణించలేకపోతోంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో సరైన తోడ్పాటు లేకపోవడం ప్రజల బతుకుతెరువుపై ప్రభావం చూపుతోంది. తలసరి ఆదాయం అనేది ఆర్థిక శాస్త్రంలో ప్రాథమిక కొలమానంలాంటిది. ఇది జనాభా జీవన ప్రమాణాలతో పాటు ఆర్థికాభివృద్ధి, సంపద పంపిణీ ఎలా జరుగుతుందనే అంశాలను వెల్లడిస్తుంది. సహజ సిద్ధమైన అటవీ, ఖనిజ సంపద, వ్యవసాయానికి అవసరమైన నల్లరేగడి, ఎర్రనేలలు, గోదావరి లాంటి జీవనోపాధులు ఉన్నప్పటికీ పాలకుల తోడ్పాటు కరువై ఫలితం లేకుండా పోతోంది.

మనది ఏ స్థానమంటే..

రాష్ట్ర ప్రభుత్వం ఏటా శాసనసభ బడ్జెట్ సమావేశాలకంటే ముందు రాష్ట్ర సామాజిక ఆర్థిక ముఖ చిత్రం వివరాలను క్రోడీకరిస్తుంది. దీని ఆధారంగా రాష్ట్రంలోని ఆర్థిక, సామాజికాభివృద్ధి, అత్యవసర సేవలు, కీలక ఆర్థిక నిర్ణయాలు తీసుకునేలా చర్యలకు ఉపక్రమించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ లెక్కన జాతీయ స్థాయిలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79751 ఉన్నట్టు తేలింది. రాష్ట్రంలో తలసరి ఆదాయంలో భూపాలపల్లి జయశంకర్ జిల్లా రూ.2,57851లతో 12వ స్థానంలో ఉన్నట్లు తేల్చింది. ములుగు జిల్లా రూ.2,49,338తో 15 స్థానంలో వరంగల్ జిల్లా రూ.2,44,278తో 17వ స్థానంలో జనగామ జిల్లా రూ.2,33,215తో 19వ స్థానంలో మహబూబాబాద్ జిల్లా రూ. 2,12,232తో 29వ స్థానంలో ఉండగా, హనుమకొండ జిల్లా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా రూ.1,99,490తో 31వ స్థానంలో ఉన్నది.

తగ్గిన వృద్ధి రేటు

అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా లభించే ఉపాధి అవకాశాలు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో కలిగే మౌలిక వృద్ధి రేటుకు అనుగుణంగా వ్యక్తుల తలసరి ఆదాయాన్ని లెక్కించటమనేది ఆర్థికాంశాల్లోని ప్రధాన పాత్ర. 2021-22, 2023-24 మధ్య ఆయా అంశాలను పరిగణలోకి తీసుకొని లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ (ఎల్ఎఫ్‌పీఆర్), వర్కర్ పాపులేషన్ రేషియో (డబ్ల్యుపీఆర్) చేసిన సర్వే ప్రకారం రాష్ట్ర వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వృద్ధి రేటు 2022-23 కంటే 2023-24లో 5.71 శాతం తగ్గినట్టు తేలింది.

భూ కమతాలు

ఉమ్మడి జిల్లాలో సగటు భూ కమతాల పరిమాణం మారుతూ వస్తోంది. ఆరు జిల్లాల్లో ఒక్కలాగా లేదు. జనగామ జిల్లాలో సగటు భూకమతం ఎక్కువగా ఉంటే వరంగల్ జిల్లాలో మరీ తక్కువగా ఉంది. దీనికి స్థానిక వ్యవసాయ పరిస్థితులు, పద్ధతులే

మిగతా 7వ పేజీలో...

పరిగణించాల్సినవి ఇవీ..

ఉమ్మడి జిల్లాలో సాగు భూముల విస్తీర్ణం దాదాపు 16 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. సింహభాగం వర్షాధార పంటలే పండిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ ప్రధానంగా వరి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో పత్తి, ములుగు, జయశంకర్ జిల్లాల్లో మిర్చి ఎక్కువగా సాగవుతుంది. దేవాదుల, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా నిర్ణీత గడువులో వానాకాలం చివరి దశకే నీళ్లు ఇవ్వటానికి సరిపోవడం లేదు. రూ.లక్ష కోట్ల వ్యయంతో కట్టిన కాళేశ్వరం ద్వారా ఆశించిన మేరకు అన్నదాతలకు సాగునీరు అందడం లేదు. పారిశ్రామికీకరణలో నిరాధారణ, ఉమ్మడి జిల్లా తలసరి ఆదాయం పెరగకపోవడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.


జిల్లా స్థాయిలో స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)

స్థూల జిల్లా స్థాయి ఉత్పత్తి (జీడీడీపీ) రాష్ట్రం లోని వివిధ జిల్లాల సాపేక్ష ఆర్థిక పరిమాణాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగించే ముఖ్యమైన కొలమానం. జీడీపీపీ విషయంలో ములుగు జిల్లా విగతా అన్ని రాష్ట్రాల కన్నా అథమ స్థానంలో ఉంది. హనుమకొండ జిల్లా కాస్త మెరుగ్గా 16వ స్థానంలో ఉంది. జీడీపీపీలో హనుమకొండ జిల్లా రూ.25,667 కోట్లతో 16వ స్థానంలో, వరంగల్ జిల్లా రూ.20,785కోట్లతో 22వ స్థానంలో మహబూబాబాద్ జిల్లా రూ.19,774 కోట్లతో 24వ స్థానంలో జనగామ జిల్లా రూ.14,669 కోట్లతో 28వ స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూ. 12,932 కోట్లతో 32వ స్థానంలో ఉండగా, ములుగు జిల్లా అన్ని జిల్లాల కన్న తక్కువగా రూ.8,873 కోట్లతో ఆఖరు స్థానంలో ఉంది.

‘పది’లముగా..

నేటి నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వరంగల్‌లో 9,392, హనుమకొండలో 12,061 మంది విద్యార్థులు



వరంగల్ ఎడుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. వరంగల్ జిల్లాలో 287 పాఠశాలల నుంచి మొత్తం 9,392 మంది హాజరవుతుండగా, హనుమకొండ జిల్లాలో 318 పాఠశాలల నుంచి 12,061 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షలకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా, వరంగల్ జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 600 మంది ఉపాధ్యాయులు పరీక్షల విధులు నిర్వర్తించనున్నారు. ఇక హనుమకొండ జిల్లాలో 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా పరీక్షల విధుల్లో 800 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని, ఎండల తీవ్రత అధికంగా ఉంటుండటంతో ప్రతీ పరీక్ష కేంద్రంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరుకావాలని పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు డీఈవోలు ఎం.జ్ఞానేశ్వర్, డి.వాసంతి తెలిపారు.

కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట
- రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- దేశాయిపేటలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యే నాగరాజు, మేయర్

పోచమ్మమైదాన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు చేయూతనందించి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ దేశాయిపేటలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా నిర్మించిన మహిళా ఉద్యోగుల వసతి గృహం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సత్యశారద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తోందని తెలిపారు. 33శాతం మహిళలు అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నారని, అందుకు మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా వారు ప్రజల్లో తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ జిల్లాను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, స్థానిక కార్పొరేటర్లు కావటి కవితయాదవ్, సురేష్‌జోషి తదితరులు పాల్గొన్నారు. కాగా, వరంగల్ దేశాయిపేటలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు నాలుగుకోట్ల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంత్రి సురేఖ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

బల్దియా బడ్జెట్ రూ.1,071,48 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కలెక్టర్, కమిషనర్

- అమోదించిన మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం
- సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధి చేస్తాం
- మేయర్ గుండు సుధారాణి వెల్లడి

6

దేవాదుల మోటార్ ఆన్ చేయాలి

- లేకపోతే ‘చలో పంప్‌హౌస్’ చేపడతాం..
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఐరన్ లెగ్
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేస్ -3 మోటార్‌ను 48 గంటల్లో ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ‘చలో పంప్ హౌస్’ కార్యక్రమాన్ని చేపడతామని మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. మండలంలోని ఉనికిచర్ల, దేవన్నపేట గ్రామాల మధ్య పంప్‌హౌస్‌ను ఆయన గురువారం సందర్శించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20న ఫేస్ త్రీ పైప్‌లైన్ ప్రారంభోత్సవానికి పంప్‌హౌస్ వద్దకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభాసుపాలయ్యారని ఎద్దేవా చేశారు. సాగునీటి విడుదల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, వెంటనే పంప్‌హౌస్‌లో మోటార్లు ఆన్ చేసి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫేస్ వన్ ద్వారా 5.18 టీఎంసీ, ఫేస్ టూ ద్వారా 7.25 టీఎంసీ, ఫేస్ త్రీ ద్వారా 25.07 టీఎంసీ నీరు రావాల్సి ఉందని, ఇప్పటి వరకు నీరు రాలేదన్నారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎక్కడ అడుగుపెడితే ఎక్కడ ఐరన్‌లెగ్గేనని రాజయ్య అన్నారు. డిప్యూటీ సీఎం కావడంతో టెక్స్‌టైల్ పార్కు పోయిందని, 2008లో ధర్మసాగర్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సౌత్ కెనాల్ ద్వారా అప్పటి ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేస్తుంటే గేట్లకు సంబంధించిన కీని నీటిలో పారేశారని అన్నారు. అలాగే లింగంపల్లి ప్రాజెక్టు మంజూరైతే కేసీఆర్‌తో మాట్లాడి ప్రాజెక్టును కడియం రద్దు చేయించారని రాజయ్య ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పదేళ్లు కాపాడిన సింగపురం ఇందిర నోటి కాడి బుక్కను కడియం శ్రీహరి ఎత్తుకుపోయారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న అసలు సిసలైన నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా కడియం తన అనుచరులకు పదవులను కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి ఎన్నికల్లో గెలిపిస్తే బీఆర్ఎస్‌ను వీడి పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్‌ను సైతం శ్రీహరి మోసం చేస్తున్నాడని విమర్శించారు. ఎంతో అపారమైన అనుభవం ఉన్న కడియం తప్పుల మీద తప్పులు చేసుకుంటూ పోతున్నారని, ఆ తడబాటు ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదని రాజయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, ప్రతాప్, రవీందర్, రత్నం, భూపాతిరాజు, శ్రీనివాస్, మహేందర్, మధుకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

మొదటి రోజు ఇద్దరు డీబార్ మినహా పరీక్షలు ప్రశాంతం



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. గత నెల 5 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియెట్ సాధారణ పరీక్షలు నేటితో ముగిశాయి. పరీక్షల ప్రారంభం రోజున వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఒక్కొక్కరిని డీబార్ చేయడం మినహా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు ముగియడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం కనిపించింది. తల్లిదండ్రులు హాస్టల్‌లో ఉంటున్న వారి పిల్లలను ఇండ్లకు తీసుకువెళ్లారు. దీంతో హనుమకొండ బస్టాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కిక్కిరిసింది. పరీక్ష కేంద్రాల వద్దనే విద్యార్థులు వారి స్నేహితులకు వీడ్కోలు పలుకుతూ ఇండ్లకు తరలివెళ్లారు. కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలను పరీక్ష కేంద్రాల నుంచే వారి ఊర్లకు తీసుకెళ్లడం కనిపించింది.

బల్దియా బడ్జెట్ రూ.1,071,48 కోట్లు

- అమోదించిన మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం
- సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధి చేస్తాం : మేయర్ గుండు సుధారాణి వెల్లడి


నాణ్యతలోపంతో రోడ్లు నిర్మించారని చిత్రాలను చూపిస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ మహా నగర పాలక సంస్థకు సంబంధించిన 2025-26 సంవత్సరాలకు ముసాయిదా బడ్జెట్ రూ.1,071,48 కోట్లను పాలకమండలి ఆమోదించింది. గురువారం బల్దియా కార్యాలయంలో బల్దియా బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 1/3 కోరం సభ్యులు హాజరైన తర్వాత బల్దియా అకౌంట్స్ పర్యవేక్షణాధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. రూ.1,071,48కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు మెజారిటీ సభ్యులు చేతులెత్తి అంగీకారం తెలిపారు. ఇందులో రూ.337.38కోట్లు సాధారణ పన్నుల ద్వారా, రూ.728.10 కోట్లు వివిధ గ్రాంట్ల ద్వారా ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. ఇంకా రూ.609 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్స్‌ల ద్వారా ఆదాయం సమకూరుతుందని బడ్జెట్‌లో వెల్లడించారు.

ఈ యేడు ప్రకటించిన బడ్జెట్‌లో వరంగల్ నగర ప్రజలపై పాలకవర్గం అధిక పన్నుల భారం మోపింది. గత యేడాది బల్దియాకు పన్నులు పెంచి రూ.2477.02 కోట్లు అధిక టాక్స్‌లు వసూలు చేయగా.. ఈ బడ్జెట్‌లో మరో వంద కోట్లు పెంచి అంచనాలను తయారు చేయడంతో ప్రజలపై అదనపు భారం పడనుంది. నగరంలోని వ్యాపారులు, కమర్షియల్ కాంప్లెక్స్ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి బల్దియా అధికారులు సరిగా పన్నులు

ప్రజలపై అధిక పన్నుల భారం

వసూలు చేయలేకపోవడం వల్ల ప్రజలపై పన్నుల భారంగా పడుతోందని కొందరు కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశంలో మండిపడ్డారు. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇండ్లు, షాపింగ్ మాల్స్ నుంచి సరిగా పన్నులు వసూలు చేయక పోవడం వల్లనే పన్నుల భారం అధికం చేయాల్సి వచ్చిందని అంటున్నారు. ఇంకా శానిటేషన్ విభాగం సిబ్బంది చేయాల్సిన ట్రేడ్ లైసెన్స్ కమర్షియల్ యూజర్ చార్జీలు వసూలుపై పట్టింపు లేకపోవడం, ఆస్తి పన్నులు సరి గా లేక బల్దియా రాబడికి గండిపడుతోందనే విమర్శలున్నాయి.

నిరసనల నడుమ..

గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం ఉదయం 11.30 గంటలకు జరిగిన బడ్జెట్ సమావేశానికి ముందుగా బీజేపీ, తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్పొరేటర్లు చేరుకున్నారు. మేయర్ గుండు సుధారాణి తన చాంబర్‌లో ముందుగా మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో చర్చలు జరిపి కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ కార్పొరేటర్లు నగరంలో రోడ్లు, డ్రైనేజీలు అధ్వాన్నంగా ఉన్నాయని నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కలుగజేసుకుని వారిని వారించే ప్రయత్నం చేశారు. అనంతరం ఇటీవల అకాల మరణం చెందిన 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములుకు రెండు నిమిషాలు సంతాపం ప్రకటించారు. తర్వాత ఒక్కో పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేటర్‌ను మాట్లాడించారు.

ముందుగా కాంగ్రెస్ నుంచి వేముల శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో వరంగల్ నగరం హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. తర్వాత బీఆర్ఎస్ నుంచి ఇండ్ల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. బల్దియా బడ్జెట్ తప్పుల తడక, అప్పుల గారడీగా ఉందన్నారు. ఇది ప్రజలకు ఆమోదమైన బడ్జెట్ కాదని అన్నారు. బీజేపీ కార్పొరేటర్ చాడ స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. కిందటేడు కంటే ఈ యేడు ప్రజలపై పన్నుల భారం పెంచారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో తప్ప రాష్ట్ర ప్రభుత్వం, బల్దియా రాబడి నుంచి నగరం ఏ మాత్రం బాగుపడదని అన్నారు.


రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న మేయర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఆధారం

యేటా బడ్జెట్‌లో బల్దియా సొంత ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రత్యేక గ్రాంట్లపై ఆధారపడవలసిన పరిస్థితి ఉంది. ఈ యేడాది నగర ప్రజలను బలవంతంగా పన్నులు వసూలు చేయడంతో పాటు ట్రేడ్, ఎల్ఆర్ఎస్ ఫీజులు ప్రభుత్వం బలవంతంగా వసూలు చేస్తు న్నట్టు ప్రజలను నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నా అధికారులు ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. కాగా, ఈ బడ్జెట్‌లో ప్లాన్ గ్రాంట్స్ పట్టణ ప్రగతి, 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.7,500కోట్లు, ఎస్‌సీఎస్‌పీ, టీఎస్‌పీ, ఎస్‌బీఎం, సీఎంఏ, మైనారిటీ రూ.14,300కోట్లు, అదర్ గ్రాంట్స్ సీడీపీ, ఎస్‌డీఎఫ్, ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.51,010 కోట్లు మొత్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి బల్దియాకు వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.72,810కోట్లు వస్తాయని అంచనాలు సిద్ధం చేశారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో పాటు బల్దియాకు వచ్చే ఆదాయం కలుపుకుని రూ.1,071,48కోట్ల బడ్జెట్‌ను రూపొం దించి ప్రకటించారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్

మేయర్ గుండు సుధారాణి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మున్సిపల్, పట్టణాభివృద్ధి, దేవాదాయ శాఖ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యేడు బడ్జెట్ రూపొందించాం. ఈ యేడు బడ్జెట్‌లో ప్రజలపై ఎక్కువ పన్నుల భారం మోపలేదు. ఈ బడ్జెట్ గ్రేటర్ 66 డివిజన్‌ల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుంది. ప్రధానంగా విలీన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. రూ.1,071,48 కోట్ల బడ్జెట్ నిధుల నుంచి వరంగల్ నగరాన్ని సర్వాంగ సుందరంగా దీర్చిదిద్దవచ్చు. వరంగల్ ప్రజల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సాధిస్తే మరిన్ని నిధులు సమకూరుతాయి.

పోలీసుల పహారా

వరంగల్ బల్దియా బడ్జెట్ సమావేశం నేపథ్యంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలతో మున్సిపల్ కార్యాలయం, బల్దియా ప్రధాన గేటు నుంచి కౌన్సిల్ హాల్ వరకు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. కౌన్సిల్‌లో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగ కుండా ఉండేందుకు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ పోలీ సు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కౌన్సిల్‌హాల్‌లో కార్పొరేటర్ల మధ్య సివిల్ దుస్తువులలో పోలీసులను ఉంచారు. ఈ బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల రేవూరి ప్రకాశ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్లు, పరిపాలనా విభాగం సిబ్బంది, వివిధ పార్టీల కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొన్నారు.

నగరంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి



దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ నగరాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే వరంగల్‌కు రూ.5 వేల కోట్లు ప్రకటించారు. ప్రత్యేకంగా అండర్‌గ్రౌం డ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ. 4,170కోట్ల నిధులు కేటా యించారు. ఈ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి పం పించి నిధులు త్వరగా విడుదల చేసేందుకు తప్పకుండా కృషి చేస్తాను. వరంగల్ నగర చరిత్రను నలు దిశలా చాటాలంటే అభివృద్ధి అవసరం. అందుకే బడ్జెట్‌ను పెంచి ప్రకటించాం.

మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం..



వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఇంతకు ముందు ప్రభుత్వాలు నగరంలో ప్రతీ గడపకు మంచినీరు అందిస్తామని చెప్పి కోట్లు కొల్లగొట్టాయి. అలాంటి ప్రభుత్వాల మాదిరిగా తాము వ్యవహరించడం లేదు. పక్కాగా ప్రజల కోసం పని చేస్తున్నాం. ఎండా కాలం రాకముందే బల్దియా ప్రత్యేక బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి మంచి నీటి సమస్య రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ముఖాముఖి


దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి

త్వరలో దేవాలయాలను సందర్శిస్తా..

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ప్రముఖ ఆలయాల నిర్వహణ సమీక్ష ఎప్పుడు ?

డిప్యూటీ కమిషనర్: ఉమ్మడి జిల్లాలోని దేవాలయలను త్వరలోనే సందర్శించి నిర్వహణను పర్యవేక్షించి సమీక్ష సమావేశం నిర్వహిస్తాను.

ఆంధ్రజ్యోతి : ఆలయాల ఆడిటింగ్ ఎప్పుడు ప్రారంభం ?

డిప్యూటీ కమిషర్ : దేవాలయాలకు సంబంధించిన ఆడిటింగ్ ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తుండగా ఏప్రిల్ మాసం నుంచి ఆడిటింగ్ ప్రారంభమవుతుంది.

ఆంధ్రజ్యోతి : సరస్వతి పుష్కరాలపై శాఖాపరమైన నిర్ణయాలు ఏవీ ?

డిప్యూటీ కమిషనర్: మే మాసంలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ హైదరాబాద్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయి.

ఆంధ్రజ్యోతి : ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణపై శాఖాపరమైన ఆదేశాలు ఏమైనా ఉన్నాయా?

డిప్యూటీ కమిషనర్: యేటా ఉగాది పర్వదినం వేడుకల సందర్భంగా పూజా కార్యక్రమాలు, పంచాంగ శ్రవణాలు, శ్రీరామనవమి సందర్భంగా కల్యాణోత్సవాలు యథావిధిగా జరుగుతాయి. ఇందుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ఏదీ శాఖా పరంగా ఆదేశాలు ఏమీ లేవు.

ఆంధ్రజ్యోతి : దేవాదాయ శాఖలో ఉన్న సిబ్బంది కొరతను ఎలా తీరుస్తారు ?

డిప్యూటీ కమిషనర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదాయ శాఖకు సంబంధించి పలువురు సిబ్బంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇప్పటికే కొరత ఉండగా మరి కొంత మంది సిబ్బంది విరమణతో సిబ్బంది కొరత మరింతగా ఏర్పడే అవకాశం ఉంది. వీటి వివరాలు సేకరించి కమిషనర్‌కు తెలియజేయడం జరుగుతుంది.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్


మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

మహదేవపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో మే 15 నుంచి 26వరకు జరిగే సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. గురువారం పనుల పరిశీలన, సమీక్ష నిర్వహించేందుకు కాళేశ్వరం వచ్చిన ఆమె దేవదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపు, వీఐటీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు రహదారి నిర్మాణం, శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. గోదావరి హారతికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర సమాచారం భక్తులకు తెలిసేలా ప్రత్యేక యాప్ రూపొందించాలని, ప్రచారానికి అంబాసిడర్‌ను నియమించాలని సూచించారు. పుష్కరాలు జరిగే 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈవో మహేష్‌ను ఆదేశించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గోదావ రి వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు చేయాలని చేయాలన్నారు. గోదావ రిలో నీటి నిల్వలను పరిశీలించాలని, సత్రం పనులను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని, అన్నదాన కార్యక్రమాలు ఏర్పా టు చేయాలని సూచించారు. అలాగే ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు రక్షిత తాగునీరు అందుబాటులో ఉంచాలని, గోదావరిలోకి భక్తులు వెళ్లకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ఆర్‌జేసీ రామకృష్ణరావు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖలు, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

ఆల్‌ఇండియా ఖో-ఖో పోటీలకు పీడీ ఎంపిక


గోగు నారాయణ

శంభునిపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ ఖోఖో పోటీలకు నగరంలోని రంగశాయిపేటకు చెందిన గోగు నారాయణ ఎంపికయ్యారు. రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న గోగు నారాయణ జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో ఫైనల్ సెలక్షన్స్‌లో వరంగల్ జిల్లా తరపున పాల్గొని ప్రతిభ కనబరిచారు. నారాయణ ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఆల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 21 నుంచి న్యూఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ పోటీల్లో పాల్గొనేందుకు గురువారం నారాయణ వరంగల్ నుంచి న్యూఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా నారాయణను పాఠశాల సిబ్బంది, పలువురు క్రీడాకారులు, ప్రముఖులు అభినందించారు.

రైతుల పట్ల చిత్తశుద్ధి లేని సీఎం

- రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ
- ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

దేవరుప్పుల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో ఉన్న దొంగ సీఎం రేవంత్‌రెడ్డికి రైతులపై చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. గురువారం జనగామ జిల్లా దేవరుప్పులలో మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఒక్క పథకం కూడా అమలు చేయలేదని విమర్శించారు. రుణమాఫీ ఇంత వరకు పూర్తి స్థాయిలో రైతులెవరికీ చేయలేదని, రైతుబంధు మూడెకరాల రైతులకు ఇంకా పడలేద న్నారు. ఓటుకు నోటు కేసులో ఉన్న దొంగను నమ్మి సీఎంను చేస్తే రైతాంగానికి సాగునీరందించలేక పోయారన్నారు. చంద్రబాబు హయాంలో డాక్టర్ సుధాకర్‌రావు చెన్నూరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గోదావరి జలాల కోసం కాలువలకు నిధులు మంజూరు చేయించి తవ్వించామన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు గోదావరి జలాలతో చెరువులు కుంటలు, చెక్ డ్యాంలు నింపి మత్తడి పోయించామన్నారు. పంటను సర్వే చేయించి ఎకరాకు రూ.25వేల నష్ట పరిహా రం అందించాలని డిమాండ్ చేశారు.

పాలకుర్తి ఎమ్మెల్యే ఎక్కడ రిజర్వాయర్లు, చెక్‌డ్యాంలు, కాలువలు కట్టారో తెలుపాలని ప్రశ్నించారు. అనంతరం మండల కార్యాలయాల వద్దకు వెళ్లి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్ర మంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయ కులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్, వీరారెడ్డి దామోద ర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, ప్రధాన కార్యదర్శి చింత రవి, నాయకులు కొల్లూరు సోమయ్య, కోతి ప్రవీణ్, ఏల సుందర్, జోగు సోమనర్సయ్య, కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, హన్మంతు, మహే ష్, సోమనర్సయ్య, రామ్‌సింగ్, కృష్ణమూర్తి, యాకయ్య, అర్జున్, నర్సింహారెడ్డి, పాలకుర్తి, కొడకండ్ల రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో డిగ్రీ ఇయర్‌వైజ్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏ లాంగ్వేజీ కోర్సుల సప్లిమెంటరీ పరీక్షలు మార్చి 21 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్యలు గురువారం తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో డిగ్రీ కోర్సుల్లో ఇయర్ వైజ్ సబ్జెక్టులు మిగిలిన అభ్యర్థులకు పరీక్షల నిర్వహించనున్నారు. వరంగల్ పరిధిలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మం పరిధిలో ఖమ్మంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, (ఆర్ట్స్ కామర్స్)లను ఎంపిక చేశారు. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇయర్‌వైజ్ అభ్యర్థులందరికీ హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లోనే పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరికీ ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశారు. పరీక్షల కోసం ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ మొద టి, రెండో ఏడాది పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే ఫైనల్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7010	5800
మక్కలు	2121	2100
కందులు	6909	5540
పెసళ్లు	7622	4645
పల్లికాయ (సూక)	7220	6500
పల్లికాయ (పచ్చిది)	3800	3400
పసుపు (కాడి)	5004	4575
పసుపు (గోల)	4508	4370
తేజ మిర్చి	12700	9000
వండర్ హాట్	15500	11500
యూఎస్ 341	13000	9500
దీపిక	15800	15245
దేశీ	28000	25500
సింగిల్ పటి	29000	28000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు రూ.20 వేల లంచం

ఏసీబీకి పట్టుబడిన స్టేషన్‌ఘన్‌పూర్ సబ్‌రిజిస్ట్రార్, ఆఫీస్ అసిస్టెంట్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తండ్రి పేరిట ఉన్న ఇంటి స్థలాన్ని అన్నదమ్ములకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు గాను లంచం డిమాండ్ చేసిన జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ పర్వతం రామకృష్ణ, రోజువారీ వేతనం తీసుకుంటూ ప్రైవేట్ ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎదునూరి రమేష్ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. జనగామ జిల్లా చిలుపూరు మండలంలోని వెంకటేశ్వరపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బట్టమేకల శివరాజ్ వద్ద రూ.20వేల లంచం తీసుకుంటూ వారు దొరికారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం. వెంకటేశ్వరపల్లెకు చెందిన బట్టమేకల శివరాజ్, ధర్మరాజు అన్నదమ్ములు. వారి తండ్రి యాదగిరి పేరిట ఉన్న 585గజాల ఇంటి స్థలాన్ని తమ ఇద్దరి పేరుపై గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ తమ తండ్రిని తీసుకుని ఈనెల 17న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరి పేరుతో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని సబ్ రిజిస్ట్రార్ మెలికపెట్టారు. దాంతో ఆఫీస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్.. ఇద్దరి పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలంటే ఒక్కొక్కరు రూ.11వేల చొప్పున ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని బేరం పెట్టాడు. బాధితుడు శివరాజ్ తమ వద్ద అంతమొత్తంలో డబ్బులు లేవని ఎంతో కొంత ఇస్తామని చెప్పాడు. అలాగైతే రిజిస్ట్రేషన్ చేయలేమని అతడు తేల్చిచెప్పాడు. దాంతో శివరాజ్ ఈనెల 18న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు రూ.20వేల ఇస్తానని సబ్‌రిజిస్ట్రార్‌కు తెలుపడంతో రిజిస్ట్రేషన్ చేసేందుకు అంగీకరించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం గురువారం సాయంత్రం శివరాజ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి ఆఫీస్ అసిస్టెంట్ రమేష్‌కు రూ.20వేల నగదును ఇవ్వగా ఆయన ద్వారా సబ్‌రిజిస్ట్రార్ తీసుకుంటున్న క్రమం అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకున్నారు. ఆ ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీతో పాటు సీఐలు సట్ల రాజుగౌడ్, ఎల్ రాజు, ఏసీబీ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.


ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ, ప్రైవేట్ అసిస్టెంట్ రమేష్

22 నుంచి కాజీపేట - డోర్నకల్

పుష్‌పుల్ రైళ్ల పునరుద్ధరణ

గిర్మాజీపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు కాజీపేట నుంచి వరంగల్ మీదుగా డోర్నకల్ అక్కడి నుంచి విజయవాడకు వెళ్లి తిరిగి వరంగల్‌కు చేరుకునే పుష్‌పుల్ రైళ్లను ఈనెల 22 శనివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ గురువారం సాయంత్రం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మూడోలైన్ పనుల కారణంగా గతంలో రద్దు చేసిన కాజీపేట-డోర్నకల్ (67765), డోర్నకల్- కాజీపేట (67766), డోర్నకల్- విజయవాడ (67767), విజయవాడ- డోర్నకల్ (67768) పుష్‌పుల్ రైళ్లను ఈనెల 22 నుంచి యథావిధిగా నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

సామాజిక చైతన్య ప్రేరణ.. కవిత

➡ ఓరుగల్లులో గుబాళిస్తున్న వచన కవిత్వం ➡ కాళోజీ మొదలు అక్షరమాలలు అందించిన వారెందరో..

నేడు ప్రపంచ కవితా దినోత్సవం

హనుమకొండ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యానికి ప్రేరణ.. గాయపడిన గుండె నుంచి ఉప్పొంగే తరంగం.. ప్రేమికుల మది నుంచి జాలువారే సెలయేరు.. ఆనందాన్ని పదిలపరిచే ఓ మధుర జ్ఞాపకం.. హక్కుల కోసం ఆక్రోశించే సముద్రఘోష.. సమస్త దేవతలను స్తుతించే మంత్రం.. ప్రకృతి ఆరాధకులకు కనువిందు కవిత.. అంటూ తెల్లకాగితాలు అక్షర బరువుతో కొత్త అందాలు సంతరించుకుంటున్నాయి. యావత్ ఓరుగల్లులో అనాది కాలం నుంచి వందలాది మంది కవులు తమ సాహిత్య సృజనతో చైతన్యాన్ని గుబాళింపజేస్తున్నారు. ఏటా మార్చి 21న ఐక్యరాజ్య సమితి సార్వత్రిక కవితాదినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని సాహితీ ప్రియులు వైభవంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా నగరంలో పలు కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.

కాళోజీ స్ఫూర్తితో..

ఆధునిక తెలంగాణ కవిత్రయంలో ఒకరిగా పేరొందిన కాళోజీ నారాయణరావు మొదలు వరవరరావు, పేర్వారం జగన్నాథం, మాదిరాజు రంగా రావు, ఆచార్య బన్న ఐలయ్య, వీఆర్.విద్యార్థి, రామా చంద్రమౌళి, డాక్టర్ ఎల్ఎస్ఆర్‌కే ప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాసరావు, సిరాజొద్దీన్, అనిశెట్టి రజిత, దేవులపల్లి వాణి, నెల్లుట్ల రమాదేవి, బాలబోయిన రమాదేవి ఇలా ఎందరో కవుల ప్రస్థానం ఓరుగల్లు నేలపై అప్రతిహతంగా కొనసాగుతోంది. కాళోజీ స్ఫూర్తితో మొదలైన వచన కవితా ప్రస్థానం పేర్వారం తెలుగు సాహిత్యంలో అధిక్షేప కవిత్వాన్ని సమర్థవంతంగా రాసిన కవిగా ప్రసిద్ధుడు. విప్లవ కవిగా పేరొందిన వరవరరావు 1968లోనే చలినెగళ్లు గొప్ప వచన సంపుటిని వెలువరించారు. ఆ తర్వాత ఆయన కలం నుంచి అనేక వచన కవిత సంపుటాలు వెలువడ్డాయి. కేయూ ఆచార్యులుగా ప్రసిద్ధి చెందిన బన్న ఐలయ్య మొదట మానవీయ కోణంలో 1988లో రాసిన రహస్య చిత్రం వచన కవిత సంపుటి మొదలు అనేక కావ్యాలు ఆవిష్కృతమయ్యాయి. వీఆర్. విద్యార్థి ఆధునిక తెలుగు కవితా ప్రపంచంలో సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన ఆయన 1987లో అలలు పేరిట తొలి వచన కవిత సంపుటిని వెలువరించారు. అనంతర కాలంలో ఆయన కలం నుంచి మరో 9 కవిత సంపుటాలు వెలువడ్డాయి. హనుమకొండ బ్రాహ్మణ వాడకు చెందిన అడ్వొకేట్ నమిలికొండ బాలకిషన్‌రావు జాతీయత , దేశ భక్తి కవిత వస్తువులుగా 1981లోనే యువ స్వరం పేరిట, 1987లో అక్షర చిట్ ఫండ్ కవిత సంపుటాలు వెలువడ్డాయి. పొట్లపల్లి శ్రీనివాసరావు 1981లో చైతన్య గులాబీలను గుబాళింపజేశారు. అనిశెట్టి రజిత సాహిత్యమే ఊపిరిగా ఉంటూ 1977లో నేనొక నల్ల మబ్బునవుతా కవిత సంపుటిని, 2000 సంవత్సరంలో ఓ లచ్చవ్వ దీర్ఘ కవితను వెలువరించి సాహితీ లోకంలో తనదైన ముద్ర వేసుకున్నారు. తక్కెళ్ల బాలరాజు వృత్తి రీత్యా డీటీవోగా విధులు నిర్వహించిన ఆయన 1974లో వెలుగురేఖలు వచన కవితను ప్రకటించారు. డాక్టర్ టి. శ్రీరంగ స్వామి మధుర వచన సంపుటితో 1984లో సాహితీ లోకానికి పరిచమై శ్రీలేఖ సాహితీ సంస్థ ద్వారా అనేకానేక సంపుటాలను వెలువరించి యువ రచయితలను ప్రోత్సహించారు. డాక్టర్ పల్లేరు వీరస్వామి 1982లో ఉషోదయం శీర్షికతో కవిత సంపుటిని వెలువరించారు.

బ్రహ్మ చారి నిధి కలంతో అభ్యుదయ దృక్పథంతో 1982లో స్పందన పేరిట వచన కవిత సంపుటిని వెలువరించారు. న్యాయవాది టి.జితేందర్‌రావు అలారం, అపరాజిత సామాజిక స్పృహతో వచన కవిత సంపుటి, ప్రొఫెసర్ వాసురెడ్డి భాస్కర్‌రావు, డాక్టర్ పెద్ది వెంకటయ్య, శీలం రాజేషం, వరిగొండ కాంతారావు, కె. రామ్మోహన్‌రాజు, వరంగల్ కేంద్రంగా ఆచార్య రామా చంద్రమౌళి, ఎల్ఎస్ఆర్‌కే ప్రసాద్, డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు, తదితర అనేక మంది ప్రముఖులు పలు కవిత సంపుటిలతో ఓరుగల్లు సాహితీ లోకాన్ని పునీతం చేశారు.

నామాని సృజనాదేవి 2009లో హృదయ నేత్రంతో, బిల్లా మహేందర్ 2011లో పోరుగానంతో, మల్యాల మనోహర్‌రావు 1993లో వాస్తవంలోకి, కాంచనపల్లి రాజేందర్‌రాజు 1995లో మౌన జ్ఞాపకంతో, వనపర్తి పద్మావతి 2002లో అనురాగ వీచికలతో, వెలపాటి రామారెడ్డి కోటి గాయాల మౌనమంటూ 2010లో.. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు వడ్డెబోయిన శ్రీనివాస్ 2004లో పడావు దీర్ఘ కవితతో, షేక్ హాజీనూరాని 2011లో సైరన్ కవిత సంపుటితో, మహేశ్వర నరేందర్‌రెడ్డి 2002లో ఉషస్సుతో, గుండెబోయిన శ్రీనివాస్ 2013లో గురితో, మాదారపు వాణిశ్రీ 2019లో మనసు పలికే, వకుల వాసు 2020లో వాసంత సమీరాలు, డాక్టర్ దేవులపల్లి వాణి 2016లో జ్ఞాపకాల చేదు బొక్కెన, కొమ్రరాజు రామలక్ష్మి 1970లో స్నేహగానం, గట్టు రాధిక 2019లో ఆమె తప్పిపోయింది, మేకిరి దామోదర్ పహారా లాంటి వచన కవితలతో ఓరుగల్లు నగరంలో సాహిత్య గుబాళింపులను పదిలపర్చారు. ఇంకా వీరితో పాటు అనేక మంది డాక్టర్ ఎన్వీఎన్ చారి, శంకేసి శంకర్‌రావు, రామా రత్నమాల, మెరుగు అనురాధ, శనిగరపు రాజమోహన్, డాక్టర్ జరినా బేగం, దండ్రె రాజమొగిళి, సొన్నాయిల కృష్ణ వేణి, ఏరుగొండ నర్సింహులు, కామిడి సతీష్‌రెడ్డి, బండారు సుజాత, నల్లెల్ల రాజయ్య, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు లాంటి కవులెందరో కవిత్వం రాస్తూ కాకతీయులు నడయాడిన ఓరుగల్లు గడ్డను సాహితీ క్షేత్రంగా సుసంపన్నం చేస్తున్నారు. ఇప్పటికి ప్రతీ ఏటా వివిధ సంస్థలు నిర్వహించే కవి సమ్మేళనాలు, ఉగాది కవి సమ్మేళనాల్లో కవులంతా ఉత్సాహంగా పాల్గొంటూ సాహిత్య సృజనతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్నారు.





ఆకాశవాణి కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు (ఫైల్)

ఆకాశవాణి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి వరంగల్ కేంద్రం కవితా ఓ కవితా శీర్షికన 9 మంది కవులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనాన్ని శుక్రవారం ఉదయం 9గంటలకు తమ ఆకాశవాణిలో ప్రసారం చేస్తున్నట్లు వరంగల్ ప్రోగ్రాం హెడ్ ఇల్లందుల రవికుమార్ తెలిపారు. పద్య, వచన, గేయ, నాని కవితలతో ఎండి సిరాజొద్దీన్, ఎం.బ్రహ్మచారి, ఎన్వీఎన్‌చారి, తాళ్లపల్లి యాకమ్మ, తిరునగరి నరేందర్, ఐతా శ్రీనివాస్, డాక్టర్ జయవీర్ రాజ్, వకుళ, షేక్ హాజీనురానీ కవి సమ్మేళనంలో పాల్గొంటారని చెప్పారు. అడవి రాజబాబు, అనిల్ ప్రసాద్ కార్యక్రమ సంయోజకులుగా వ్యవహరించినట్లు ఆయన చెప్పారు.

పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో..

ప్రపంచ కవిత దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని అశోక కాన్ఫరెన్స్ హాల్‌లో పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ జగదీష్‌బాబు, సిరాజొద్దీన్ తెలిపారు. ప్రొఫెసర్ సురేష్‌లాల్‌తో పాటు డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, రవికుమార్, అంపశయ్య నవీన్, సైబర్ క్రైం ఏసీపీ కె. విజయ్‌కుమార్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని వంద మంది కవులు సమ్మేళనంలో పాల్గొంటారన్నారు.

ఈ-పాస్‌లో నమోదవ్వని నీట్ పీజీ ప్రవేశాల డాటా

- స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్న విద్యార్థులు
- పీజీ అడ్మిషన్లు పూర్తయి రెండు నెలలు
- దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 31 చివరి తేదీ
- కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం
- ఇప్పటికైనా ఈ-పాస్‌కు డాటా అందజేయాలని విద్యార్థుల విజ్ఞప్తి



హనుమకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నీట్ పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి రెండు నెలలవుతున్నా ఈ-పాస్‌కు సంబంధించిన డాటాను అందజేయకపోవడమే ఇందుకు ఉదాహరణ. దీనితో పీజీ వైద్య విద్యార్థులు స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారు. ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోలేకపోతే వారు స్కాలర్‌షిప్పులను కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా వారు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉంది. వివరాల్లోకి వెళితే...

ప్రవేశాలు పూర్తయి రెండు నెలలైనా..

కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ (కేఎన్ఆర్‌హెచ్)లో నీట్ పీజీకి సంబంధించిన వివిధ వైద్య కోర్సుల్లో తెలంగాణ వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ రెండు నెలల క్రితమే పూర్తయింది. రాష్ట్రంలోని వివిధ మెడికల్ కాలేజీల్లో చేరిన విద్యార్థుల ప్రవేశాల వివరాలను కేఎన్ఆర్‌హెచ్ యూనివర్సిటీ ఈ-పాస్‌కు అందచేయాలి. వివరాలను ఈ-పాస్‌లో పొందుపరిస్తేనే విద్యార్థులు స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దరఖాస్తుల దాఖలుకు ఈనెల 31 చివరి తేదీ. వాస్తవానికి డిసెంబర్ 31 చివరి తేదీ అయినప్పటికీ, ప్రవేశాల ప్రక్రియ పూర్తికానందు వల్ల మార్చి 31 వరకు పొడిగించారు. అయితే హెల్త్ యూనివర్సిటీ అధికారులు ఈ పాటికే ప్రవేశాల వివరాలను సెంటర్ ఫర్ గుడ్ వర్నెన్స్ ఆధ్వర్యంలోని ఈ-పాస్‌కు అందచేయాలి. కానీ ఇప్పటి వరకు వారు దీని గురించి పట్టించుకోనేలేదు. దీనితో వివిధ ఎండీ, ఎంఎస్, క్లినికల్, నాన్ క్లినికల్ పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులు స్కాలర్‌షిపుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది.

ఆర్థికంగా నష్టం

స్కాలర్‌షిప్పులు ఒక్కో కోర్సును బట్టి ఏడాదికి రూ. 2 లక్షలు, రూ. 3 లక్షల వరకు వస్తుంది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ప్రతీ నెల స్టయిపండ్ కింద రూ. 3 వేల వరకు వస్తుంది. పేద విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్పులపై ఆధారపడే చదువుకుంటారు. స్కాలర్‌షిపును కోల్పోతే ఆర్థికంగా వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. కేఎన్ఆర్‌హెచ్ అధికారులు బీఎస్సీ నర్సింగ్ వంటి అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల ప్రవేశాల వివరాల వరకే ఇచ్చారు. పీజీకి సంబంధించి నిర్లక్ష్యం వహించారు. దీనితో పీజీ వైద్య విద్యార్థులు స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. విశ్వవిద్యాలయం అధికారులు తక్షణమే స్పందించి నీట్ పీజీ ప్రవేశాల వివరాలను ఈ -పాస్‌కు అందచేయాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనితో మార్చి 31వ తేదీలోగా తమకు స్కాలర్‌షిప్పు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకుంటే సాధారణంగా ఫీజు సంబంధిత మెడికల్ కాలేజీలకు నేరుగా చెల్లింపు జరుగుతుంది. స్టయిఫండ్ విద్యార్థుల ఖాతాలో జమ అవుతుంది. గడువులోగా దరఖాస్తు చేసుకోని పక్షంలో ఫీజు చెల్లించమని ప్రైవేటు మెడికల్ కాలేజీ యాజమాన్యాలు తమపై ఒత్తిడి చేసే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కెఎన్ఆర్‌హెచ్ యూనివర్సిటీ అధికారులు స్పందించాలని, ఈ పాస్‌కు నీట్ పీజీ అడ్మిషన్ల డాటాను అందచేయాలని అభ్యర్థిస్తున్నారు.

అభివృద్ధిలో అసమానతలు

(5వ పేజీ తరువాయి)

ప్రధాన కారణం. జనగామ జిల్లాలో నగటు భూకమతాల పరిమాణం సాపేక్షంగా 0.95 హెక్టార్లు ఉండగా, ములుగు జిల్లాలో 0.92 హెక్టార్లు, మహబూబాబాద్ జిల్లాలో 0.87 హెక్టార్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 0.85 హెక్టార్లు హనుమకొండ జిల్లాలో 0.75 హెక్టార్లు, వరంగల్ జిల్లాలో మరీ తక్కువగా 0.74 హెక్టార్లుగా కలిగి ఉంది. ఈ ధోరణి ఉమ్మడి జిల్లాలో తరహా వ్యవసాయం లేదా విభిన్న భూవినియోగ పద్ధతులను సూచిస్తోంది.

పంట విస్తృతి

పంటల సాగు విస్తృతి (క్రాపింగ్ ఇంటెన్సిటీ) విషయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కన్నా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఈ జిల్లాలో ఏడాడిలో మూడు సార్లు భూమిని వినియోగంలోకి తెస్తున్నారు. ములుగు జిల్లాలో పంటల సాగు విస్తృతి 293 శాతంతో ప్రథమ స్థానంలో, మహబూబాబాద్ జిల్లా 183 శాతంతో 6వ స్థానంలో హనుమకొండ 182 శాతంతో 7వ స్థానంలో వరంగల్ జిల్లా 176 శాతంతో 10వ స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 153 శాతంతో 18వ స్థానంలో జనగామ 145 శాతంతో 21వ స్థానంలో ఉంది.

పారిశ్రామీకరణ

ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా బాగా వెనుకబడింది. 70 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారంగా ఉంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుపడడంలో దోహదపడేది వ్యవసాయం తర్వాత పరిశ్రమలే. ఆరు జిల్లాలో పారిశ్రమల ఏర్పాటు సమాన స్థాయిలో జరగలేదు. యూనిట్లు, పెట్టుబడులు, ఉపాధి కల్పన విషయంలో తీవ్రమైన అసమానత స్పష్టంగా కనిపిస్తోంది. పారిశ్రామిక యూనిట్ల సంఖ్యలో హనుమకొండ జిల్లా ముందున్నప్పటికీ పెట్టుబడులల్లో వెనుకబాటు కనిపిస్తోంది. కాగా, వరంగల్ జిల్లాలో పారిశ్రమ యూనిట్లు తక్కువగా ఉన్నా పెట్టుబడులు ఎక్కువగా ఉండి ఉపాధి అవకాశాల కల్పన కూడా ఆ స్థాయిలో ఉండడం ఇందులో ప్రత్యక్ష ఉదాహరణ. హనుమకొండ జిల్లాలో రూ.445 కోట్ల పెట్టుబడులతో 831 యూనిట్లు ఏర్పాటు కాగా, 9,472 మంది ఉపాధి పొందుతున్నారు. వరంగల్ జిల్లాలో రూ.1,555కోట్ల పెట్టుబడులతో 494 యూనిట్ల స్థాపన జరగ్గా 16,683 మంది ఉపాధి పొందుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో రూ.561కోట్ల పెట్టుబడులతో 457 యూనిట్లు ఏర్పడగా కేవలం 4,367 మందికి ఉపాధి లభిస్తోంది. జనగామ జిల్లాలో రూ 552 కోట్ల పెట్టుబడులతో 396 యూనిట్లు ఏర్పాటు కాగా, 4,894 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేవలం రూ 82 కోట్ల పెట్టుబడులతో 162 యూనిట్లు ఏర్పడగా 2,227 మంది, ములుగు జిల్లాలో అతితక్కువగా రూ.37 కోట్ల పెట్టుబడులతో 93 పరిశ్రమలు ఏర్పాటు కాగా 818కి పని లభిస్తోంది.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

» కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం » ఘనంగా రూబిజెస్ట్ వేడుకలు



రూబీజెస్ట్ వేడుకల్లో రిజిస్ట్రార్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థినులు సమర్థవంతంగా రాణించి ఉజ్వల భవిష్యత్ పొందాలని కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం పిలుపునిచ్చారు. గురువారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల రూబీజెస్ట్-25 వేడుకలను పురస్కరించుకుని వర్సిటీ ఆడిటోరియంలో విద్యార్థినుల సదస్సు జరిగింది. కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో రిజిస్ట్రార్ రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సమస్యలచ్చినప్పుడు కుంగిపోవద్దని ఉద్బోధించారు. వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. రూబీజెస్టు కన్వీనర్ సాయి తరుణ్ మాట్లాడుతూ.. రూబీజెస్టు ఉత్సవాల్లో భాగంగా టెక్నికల్, కల్చరల్ ఈవెంట్లు నిర్వహిస్తామని చెప్పారు. క్లాస్‌రూమ్ టీచింగ్‌లో నేర్చుకున్న వివిధ సాంకేతిక అంశాలను టెక్నికల్ ఎగ్జిబిట్ల ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు. రూబీజెస్టు ఈవెంట్లకు కంప్యూటర్ సైన్స్ విభాగం ఫైనల్ ఇయర్ స్టూడెంట్ సాత్విక కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. విద్యార్థులు పలు ఆసక్తికరమైన ఈవెంట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తూర్పాటి వెంకటేశ్, సూపరింటెండెంట్ బానోత్ వీరన్ననాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

23న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వడ్డెపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఈ నెల 23న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా సెక్రటరి సారంపల్లి వాసుదేవరెడ్డి తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు, అభ్యుదయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుంకరి వీరయ్య హాజరవుతారని తెలిపారు. 1970 నుంచి 2025 వరకు ఎస్ఎఫ్ఐలో క్రియాశీలకంగా పనిచేసిన విద్యార్థి నాయకులు, ప్రజాతంత్ర వాదులు తదితరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శులు తేలూరి ఉప్పలయ్య, రాగుల రమేష్, మేరుగు అశోక్, గానుపాటి గంగాధర్‌రెడ్డి, బీరెడ్డి సాంబశివ, దొగ్గెల తిరుపతి, గడ్డం రవి, మరిగిద్దె హరికిషన్ పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వాసుదేవ రెడ్డి

ఆవిష్కరణలకు పరిశోధనలే మూలం

» వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి
» నిట్‌లో అసెంట్ అంతర్జాతీయ సదస్సు షురూ



పరాగ్ గొగాటేకు జ్ఞాపికను అందిస్తున్న బిద్యాధర్ సుబుధి

హనుమకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలకు నిరంతరం జరిగే పరిశోధనలే మూలం అని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. గురువారం వరంగల్ నిట్‌లో అసెంట్-2025 అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ప్రొఫెసర్ సుబుధి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ స్థాయిలో నిబద్ధతతో పరిశోధనలు జరిగినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. భారత దేశం 20270 నాటికి నెట్ జీరో లక్ష్యాన్ని సాధించడానికి పరిశోధకుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఐఐసీహెచ్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ పరాగ్ గొగాటే మాట్లాడుతూ.. బయోఫ్యూయెల్ ఉత్పత్తిలో ప్రాసెస్ ఇంటెన్సిఫికేషన్, స్థిరమైన ముడిపదార్థాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పరిశోధనల్లో పరిశ్రమ - అకడమిక్ భాగస్వామ్యాన్ని మెరుగుపర్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఇంధన నిల్వ పదార్థాలు, నానో సాంకేతికత, అధిక సామర్థ్యం గల పదార్థాలు అనే అంశంపై ప్రసంగించారు. పరిశోధనలు, సాంకేతికతల భవిష్యత్తు స్థిరమైన అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తాయో వివరించారు. అసెంట్-2025 కార్యనిర్వాహక కన్వీనర్ డాక్టర్ కేఎస్ రాజమోహన్ తన స్వాగతోపన్యాసంలో విభిన్న రంగాల్లో పరిశోధన, సహకారంతో స్థిరమైన పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ప్రొఫెసర్ ఎస్.విద్యాసాగర్ పరిశ్రమల పురోగతికి నిట్‌లోని రసాయన శాస్త్ర విభాగం చేస్తున్న కృషిని వివరించారు. సదస్సు కన్వీనర్లు డాక్టర్ కెఎస్ రాజమోహన్, డాక్టర్ ఏ లీలా మనోహర్, డాక్టర్ రమ్య ఆరగా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంట్-2025 పరిశోధనా సావనీర్‌ను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 200 మంది పరిశోధకులు ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్నారు.

దండికారణ్యం


- 64 శాతం అడవులతో రాష్ట్రంలోనే ములుగు జిల్లా మొదటి స్థానం
- ఎకో టూరిజంతో ఆకట్టుకుంటున్న వనాలు
- అడుగడుగునా అరుదైన జంతు, వృక్ష జాతులు, మూలికలు

నేడు ప్రపంచ అటవీ దినోత్సవం

ములుగు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పచ్చని వనాలు 'దండి'గా ఉన్న ములుగును దండకారణ్యానికి ముఖద్వారంగా పిలుస్తారు. మొత్తం జిల్లా భూభాగంలో 64శాతం అడవులతో అలరారుతోంది ఈ ప్రాంతం. ఆకుపచ్చని వనం పర్యాటక అందాలను పులుముకొని ప్రకృతి ప్రేమికులను మైమరిపింపజేస్తోంది. తీరొక్క జంతు, వృక్షజాతులు, అమూల్యమైన మూలికలకు చిరునామాగా మారింది. అత్యధిక అటవీ విస్తీర్ణంతో రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. ములుగు జిల్లా భౌగోళిక విస్తీర్ణం 3,881 చదరపు కిలోమీటర్లు కాగా అందులో 2,945 చ.కిలోమీటర్లు అడవే. అంటే.. సుమారు 64 శాతానికి పైగా అరణ్యం విస్తరించి ఉంది. పది మండలాలు ఉంటే ఏడు మండలాలు, 112 గ్రామపంచాయతీలు ఏజెన్సీ ప్రాంతంలోనే ఉండటం గమనార్హం. జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు సరిహద్దులుగా ఉన్న ఈ ప్రాంతం అడవుల జిల్లాగా ఖ్యాతి పొందింది. విస్తారమైన అడవులు ఉండటంతో అధిక వర్షపాతమూ ఇక్కడే నమోదవుతోంది. పూర్వం నిత్యం మేఘాలు (మొగులు) కమ్ముకుని ఉండటం వల్ల ఈప్రాంతం 'ములుగు'గా పిలవబడుతోంది.

అపారమైన వృక్ష సంపద

ములుగు అడవుల్లో అపారమైన వృక్ష సంపద దాగి ఉంది. కలపకు ఉపయోగించే టేకు, పెద్దేగి, జిట్రేగి, మద్ది లాంటి అనేక రకాల వృక్షజాతులు ఇక్కడ ఉన్నాయి. కాలక్రమంలో పోడు వ్యవసాయం, కలప స్మగ్లింగ్ ప్రభావంతో భారీ చెట్లు నరికివేతకు గుర య్యాయి. అయినా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటు న్న అడవి కొత్తగా చిగురిస్తోంది. మేడారం, మల్లూ రు, వాజేడు అడవుల్లో కంక వనాలు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. కర్బన ఉద్గారాల తో కలుషితమవుతున్న పర్యావరణాన్ని ఎప్పటిక ప్పుడు శుద్ధిచేయడంలో ఈ అడవి ముఖ్యపాత్ర పోషిస్తోంది. గతేడాది ఆగస్టులో ప్రకృతి వైపరీ త్యానికి మేడారం అడవుల్లో పుట్టిన రాకాసి గాలు లకు లక్షన్నరకుపైగా చెట్లు నేలకొరిగాయి. టోర్నడో తరహా ఈదురుగాలులు విరుచుకుపడి పెను విధ్వం సాన్ని సృష్టించాయి. అడవులే లేకుండా ఉంటే సుడిగా లులకు ఎన్ని గ్రామాలు నేలమట్టమయ్యేవోనన్న ఆందోళన, ఆవేదన కనిపించింది. అయితే ఒక్క ప్రాణికి కూడా హాని కలగలేదు. తల్లిగర్భాన్ని చీల్చుకున్న వనమాత జనావాసాలు దెబ్బతినకుండా కాపాడింది. అందుకే చరిత్రలో వీరవనితులుగా కీర్తించబడుతున్న మేడారం సమ్మక్క, సారలమ్మల ప్రతిరూపంగా కంకవనాన్ని కొలుచుకుంటున్నారిక్కడి జనం. దైవంలా భావిస్తూ సంరక్షించుకుంటున్నారు. వేసవిలో పుట్ల కొద్దీ పువ్వులనిస్తున్న ఇప్పచెట్లు అడవిబిడ్డల ఆకలి తీరుస్తూ అన్నపూర్ణగా కొలవడుతున్నాయి. వెంకటా పూర్ మండలం రామప్పలో అరుదైన కేన్ మొక్కలు కనిపిస్తాయి. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో ఈజాతి మొక్కలు ఇక్కడే ఉన్నాయి. అయితే 51ఎకరాల ఈ సంరక్షణ ప్రాంతం అన్యాక్రాంతమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.





అడవిలో ఆహ్లాదం

పర్యావరణ సహిత పర్యాటక ప్రాంతంగా ములుగు అరణ్యం ప్రగతి సాధిస్తోంది. ఇప్పటికే లక్నవరం చెరువు, బొగత జలపాతాలు ప్రకృతి ప్రేమికులను అలరిస్తుండగా తాడ్వాయి మండలంలోని బ్లూబెర్రీ ఐలాండ్ కొత్తగా వెలుగులోకి వచ్చింది. ఎకో టూరిజం ప్రాజెక్టులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు.

మల్లూరు వనంలో మూలికలు

మంగపేట మండలం మల్లూరు గుట్టలపై విలువైన మూలికలున్నాయి. ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగించే 474 జాతుల మొక్కలను వృక్షశాస్త్ర నిపుణులు గుర్తించారు. అతుకుడు తీగ, నరమామిడి, ఫిరంగి, తెల్లమద్ది, అడవి మామిడి, పెడేరియా, డైసోలోబియం వంటి అనేక జాతులు ఇక్కడ విరివిగా లభిస్తున్నాయి. ఈ ఔషధ మొక్కల ప్రభావంతో సహజసిద్ధంగా ప్రవహించే చింతామణి జలధార శుద్ధజలంగా మారింది. ఇటీవల సైంటిస్టులు జరిపిన పరిశోధనలో ఇది స్పష్టమైంది. అత్యాధునిక ప్లాంట్లలో వడబోసిన నీళ్లకంటే మల్లూరు హేమాచల క్షేత్రంలో ప్రవహించే ఈ చింతామణి జలధార నీళ్ల స్వచ్ఛంగా ఉన్నాయని ప్రకటించారు.

అడవి దున్నల పుట్టినిల్లు..

పాకాల వన్యప్రాణి సంరక్షణ ప్రాంతం సరిహద్దుగా ఉన్న ములుగు జిల్లాలోని ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ ప్రాంతం అరుదైన అడవి దున్నలకు స్థావరంగా మారింది. దట్టమైన నల్లమల అడవులను కాదని ఈ వన్యప్రాణి ఇక్కడ మనుగడ సాగిస్తోంది. మందలు మందలుగా పెరిగిపోయి తమ సంతతిని పెంచుకుంటున్నాయి. కొమ్ముల దుప్పులు, కనుజు, జింకలు, అడవిపందులు, కుందేళ్లు, కొండ గొర్రెలు లాంటి పలు జాతుల జంతువుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే అడవి సరిహద్దులోని పంటపొలాలకు కరెంటు తీగల కంచెలు వాటికి ప్రాణ సంకటంగా మారాయి.

అడవులను కాపాడుకోవాలి

డాక్టర్ సుతారి సతీష్, వృక్షశాస్త్ర పరిశోధకుడు

మానవ మనుగడకు అటవీ సంపద ప్రధానమైంది. వాటిని కాపాడుకుంటేనే మనం మనుగడ సాగించగలం. ములుగు ప్రాంతంలో అపారమైన సహజవనరుల దోపిడీకి గురవుతున్నాయి. దీనిని అరికట్టాల్సిన అవసరం ఉంది. మొత్తం భూభాగంలో 33శాతం అడవులుండాలి. రాష్ట్రంలో 18 శాతమే ఉండటం ఆందోళనకరం.

డంపింగ్ యార్డును తరలించాలి

మడికొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మడికొండ, రాంపూర్ గ్రామాల ప్రజలకు గుదిబండగా మారిన డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కోరారు. ఈ మేరకు గురువారం కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాధికారెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డులో ఏర్పడే పొగతో శ్వాస తీసుకోవడానికి ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని అన్నారు. భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డంపింగ్ యార్డును తరలించాలని విజ్ఞప్తి చేశారు.

పీఏసీఎస్ డైరెక్టర్ రాజీనామా

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ వంగపహాడ్ గ్రామ పీఏసీఎస్ డైరెక్టర్ మెరగుత్తి కళ్యాణి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం గ్రామ పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంతో పాటు గతంలో జరిగిన ప్రతీ సమావేశంలో చైర్మన్ రాజేశ్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని చైర్మన్‌తోపాటు సీఈవో, డీసీవోలకు పంపించారు.

పూడికతీత పనుల్లో వేగం పెంచండి

- రాష్ట్ర పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- భద్రకాళి చెరువు పూడికతీత పనుల పరిశీలన



భద్రకాళి చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్లు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం సీజన్ రాకముందే భద్రకాళి చెరువు పూడికతీత పనులు పూర్తి చేయాలని రాష్ట్ర పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గురువారం భద్రకాళి చెరువు పూడికతీత పనులను వరంగల్, హనుమకొండ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కుడా చైర్మన్ వెంకట్‌రాంరెడ్డిలతో కలిసి పరిశీలించారు. చెరువు పూడికతీత పనుల గురించి మంత్రికి కలెక్టర్ ప్రావీణ్య వివరించారు. వచ్చే సోమవారం నుంచి చెరువు ప్రాంతంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి పూడికతీత పనులను చేయిస్తామని మంత్రికి వివరించారు. చెరువులోకి వాహనాల రాకపోకలకు రెండు వైపులా రోడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. చెరువు పూడికతీత పనులు, అందుకు సంబంధించిన ఏర్పాట్లను నీటిపారుదల శాఖ ఈఈ శంకర్ మంత్రికి వివరించారు. జూపార్క్ నుంచి వచ్చే మురుగు నీరు చెరువులో చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. చెరువులో డ్రైనేజీల నుంచి వచ్చే నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ఆదేశించారు. చెరువు పూడికతీత పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా అన్ని శాఖల అధికారులు దృష్టి సారించాలని అన్నారు. చెరువులో పూడిక తీయడం వల్ల నీటి సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజీత్‌రెడ్డితో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పూడిక మట్టిని తరలించేందుకు రహదారులు పూర్తి చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్: భద్రకాళి చెరువు పూడికతీత పనులు మరింత వేగవంతం చేసి మట్టిని తరలించేందుకు వీలైనన్ని అంతర్గత రోడ్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ప్రావీణ్య.. మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి భద్రకాళి చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రకాళి చెరువు పూడికతీత పనులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పూడికతీత మట్టిని తరలించేందుకు అంతర్గత రహదారులను ఒక్కరోజులోనే పూర్తి చేయాలన్నారు. సిబ్బంది పర్యవేక్షణ కోసం రెండు రోజుల్లో పెద్ద కంటైనర్ ఏర్పాటు చేసి, తాగునీరు, కుర్చీలు సమకూర్చాలన్నారు. విడతల వారీగా విధులు నిర్వర్తించేందుకు అక్కడ తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. కౌంటర్లను ఏర్పాటుచేసి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. రాత్రివేళ విధులు నిర్వర్తించేందుకు అదనపు సిబ్బందిని నియమించాలని, రెండు నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలన్నారు. వీలైనన్ని విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మట్టి తరలింపును ఒకే వైపు కాకుండా మరోమార్గం ద్వారా తరలించేందుకు ప్రత్యామ్నాయ రోడ్డును సిద్ధం చేయాలన్నారు. వచ్చే సోమవారం నుంచి రాత్రివేళ్లలో మట్టి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెండర్‌దారులు ఎంత త్వరగా మట్టిని తరలిస్తే అంత మంచిదని, అధికారులు, టెండర్‌దారులు సమన్వయంతో త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా పీవో అజిత్‌రెడ్డి, భద్రకాళి చెరువు పూడికతీత టెండర్ దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీల ఏర్పాటుకు తక్షణమే స్థలం కేటాయించండి

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అండర్ గ్రౌండ్ డ్రైయినేజీల్లో భాగంగా ఎస్‌టీపీలు ఏర్పాటు చేసేందుకు తక్షణమే స్థలం కేటాయించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కుడా చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఆర్‌లపురోగతి, సమ్మర్‌లో నీటిఎద్దడి నివారణ, భద్రకాళి పూడికతీత పనులపై సమీక్ష సమావేశం నిర్వహించిన దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. వరంగల్ నగర ప్రజల చిరకాల వాంఛ అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. వచ్చే జూన్ మాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌లో పర్యటించనున్నారని, అప్పటిలోగా డీపీఆర్‌లు సిద్ధం చేయాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం గత నవంబరు మాసంలో రూ.4,500కోట్ల నిధులు మంజూరు అయ్యాయని, డీపీఆర్ సర్వే, డిజైనింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్‌లలో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర ప్రజలకు ప్రతీ రోజు నీరు అందేలా చూడాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని అన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ప్రతీరోజు నగర ప్రజలకు మూడు ఫిల్టర్‌బెడ్ల ద్వారా 205 ఎంఎల్‌డీ నీటిని అందిస్తున్నామన్నారు. వరంగల్, హనుమకొండ కలెక్టర్లు మాట్లాడుతూ.. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో వేసవిలో తాగునీటి సమస్యల లేకుండా చూస్తామన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. విలీన గ్రామాలలో నీటి సమస్య ఉన్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా ఇంజనీరింగ్, కుడా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి రాజనర్సింహను కలిసిన హెల్త్ యూనివర్సిటీ వీసీ

వరంగల్ మెడికల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నూతన వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.వి.నందకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన వైస్ చాన్స్‌లర్‌గా ఇటీవల నియామకమైన డాక్టర్ పి.వి.నందకుమార్‌రెడ్డి గురువారం మంత్రి రాజనర్సింహను కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎస్సార్‌యూ వార్షికోత్సవం

హసన్‌పర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో గురువారం 23వ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఐఐటీ హైదరాబాద్ క్రీడా అధికారి డాక్టర్ బాబా ఆదిత్యవర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల ద్వారానే విద్యార్థులకు మానసిక ఒత్తిడి తగ్గి మానసికోల్లాసం కలిగి ఉత్తేజవంతులుగా తయారవుతున్నారన్నారు. ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. క్రీడలు జీవనంలో కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం ఒక కళ అని, జయాపజయాలను సమానంగా స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఏవీవీ.సుధాకర్ మాట్లాడుతూ.. క్రీడలతోనే విద్యార్థులకు క్రమశిక్షణ, నైపుణ్యాల మెరుగుదల సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సీఎస్ఈ విభాగం సామూహిక విజేతగా నిలిచి రోలింగ్ ట్రోఫీని డీన్ ప్రొఫెసర్ ఇంద్రజిత్‌గుప్తా చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో అసోసియేటర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.రవిందర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం కోచ్‌లు ఆర్‌కె.సతీష్, కె.సమ్మయ్య, డి.రవి, బి.జానకిరాములు, కె.అమూల్య, పి.మాధవి, పి.శంకర్, యూనివర్సిటీ డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెక్‌ఫెస్ట్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్ నిర్వహించగా అందులో వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ టెక్ ఫెస్ట్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు, గైడ్ అధ్యాపకులను అభినందించారు. కృత్రిమ మేధస్సు ఆధారంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని సమగ్రంగా పర్యవేక్షించే పరికరం 'స్మార్ట్ ప్రెగ్నెన్సీ హెల్త్ మానిటరింగ్ సిస్టం విత్ ఏఐ' అనే నమూనాను రూపొందించారు. గైడ్ అనంతోజు స్రవంతి పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు జి.విశాల్, ఎ.రేవంత్, టి.శ్రీచరణ్, బి.రఘు వీర్‌ప్రసాద్, ఎం.డి. షాహ్బాజ్, జి.వర్షిత్‌రాజు ఈ పరికర నమూనాను రూపొందించారు. విద్యార్థులతోపాటు గైడ్ అధ్యాపకురాలు స్రవంతి, అధ్యాపకులు శాంతరాజు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ ఎస్.రవీందర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ అభినందించారు.

కేయూ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి గురువారం ఏబీవీపీ కేయూ యూనిట్ నేతలు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నేతలు మాట్లాడుతూ.. వర్సిటీ మెస్‌లో నాణ్యమైన భోజనం అందడం లేదని, ఫ్యాన్లు సక్రమంగా లేవన్నారు. అలాగే వాటర్ లీకేజీ జరుగుతోందని, బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్ నిర్వహణ సరిగా లేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ అధ్యక్షుడు మెరుగు సాయికుమార్, చింతకాయల శివ, పసుపులేటి పూజ, ఉబ్బటి హరికృష్ణ, సంయుక్త, అభినయ్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

హోరాహోరీగా కేయూ క్యాంపస్ క్రీడా పోటీలు

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల పీజీ విద్యార్థుల టోర్నమెంట్ గురువారం రెండో రోజు హోరాహోరీగా సాగింది. కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నేతృత్వంలో క్యాంపస్ కళాశాల క్రీడా మైదానంలో పోటీలను వర్సిటీ పీజీ స్టూడెంట్స్‌కు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల పీడీ డాక్టర్ కేషాల. కుమార్‌ల నేతృత్వంలో జరిగిన క్యాంపస్ కళాశాల క్రీడల టోర్నమెంట్‌కు ఓఎస్‌డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, పీడీ కుమారస్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మహిళల కబడ్డీలో మ్యాథ్స్ విభాగం జట్టు విన్నర్‌గా నిలువగా రన్నర్‌గా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ జట్టు నిలిచిలింది. పురుషుల కబడ్డీలో 5 ఏళ్ల ఇంటిగ్రేటెడ్ విభాగం జట్టు విన్నర్‌గా నిలువగా రన్నర్‌గా అర్థశాస్త్ర విభాగం జట్టు నిలిచిలింది. టేబుల్ టెన్నిస్‌లో 5 ఏళ్ల బయో టెక్నాలజీ విభాగం జట్టు విన్నర్‌గా నిలువగా రన్నర్‌గా కెమిస్ట్రీ జట్టు నిలిచిలింది. చెస్‌లో కబడ్డీలో మ్యాథ్స్ విభాగం జట్టు వీన్నర్‌గా నిలువగా రన్నర్‌గా అర్థశాస్త్ర విభాగం రన్నర్‌గా నిలిచిలింది. మహిళల టేబుల్ టెన్నిస్‌లో మైక్రోబయోలజీ విభాగం జట్టు విన్నర్‌గా, రన్నర్‌గా 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ జట్టు నిలిచిలింది. క్రికెట్‌లో ఎంటీఎం విభాగం జట్టు ఎంఎస్సీ కెమిస్ట్రీ జట్టుపై గెలిచి సెమీ ఫైనల్‌కు చేరింది.

ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు

హసన్‌పర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను గురువారం హసన్‌పర్తి పెద్దమ్మ దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్లు దాసరి రాజు, మేకల హరిశంకర్, తాళ్ల శ్యాం, బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్, సీనియర్ నాయకులు మధు, చికలం రాజేశ్వర్‌రావు, పెద్దమ్మ శ్రీనివాస్, భిక్షపతి, అశోక్, కుమార్, రాజు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు లేకుండా చదువు సాగేదెలా..?

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు తరగతులు ఎలా జరుగుతాయని కేయూ పార్టుటైమ్ ఆశావహులు వర్సిటీ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. గురువారం కేయూ పరిపాలన భవనం ఎదుట కేయూ పార్టుటైమ్ ఆశావహులు ప్లకార్డులతో బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ నిరసనలో డాక్టర్ వడ్డెపల్లి మధు, అరూరి రంజిత్‌కుమార్, చందర్‌రావు, మల్లేశ్‌గౌడ్, సురేశ్, మోహన్‌రెడ్డి, హుసేన్‌నాయక్, రాజేందర్ పాల్గొన్నారు.

రాంపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

మడికొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాంపూర్‌లో వికాస తరంగిణి ట్రస్టు పశు సంవర్ధక శాఖ హనుమకొండ జిల్లా వారి సౌజన్యంతో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి యజమానులకు ఉచితంగా మందులను అందజేశారు. జిల్లా డీవీ అండ్ ఏహెచ్‌వో డాక్టర్ విజయభాస్కర్, డీవీ అండ్ ఏహెచ్‌వో శ్రీనివాసరావు, చాడా సుభాష్‌రెడ్డి, పశువైద్యాధికారులు, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే రాములోరి తలంబ్రాలు

హనుమకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో వచ్చే ఏప్రిల్ 6న జరిగే శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలను ఉమ్మడి జిల్లా ప్రజలకు అందించేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈక్రమంలో రూ.151 ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ముందస్తు చేసుకున్న భక్తులకు తలంబ్రాలు నేరుగా ఇళ్లకు చేరుకుంటాయి. వివరాలకు హనుమకొండ, జనగామ, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, భూపాలపల్లి డిపోలలో ఆర్టీసీ అధికారులను సంప్రదించవచ్చని వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను తెలిపారు.

మాజీ మంత్రి తక్కళ్ళపల్లి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి పురుషోత్తమరావు

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తక్కళ్ళపల్లి పురుషోత్తమరావు 89వ జన్మదిన వేడుకలను గురువారం హనుమకొండ హంటర్‌రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నివాసంలో కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టె భాస్కర్, పురుషోత్తమరావు సతీమణి సువర్ణ, కూతురు రమ, మనుమడు మనీష్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ దాని రామ్‌దేవ్, వరంగల్ వెస్ట్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఈసంపెల్లి క్రాంతికుమార్, కాంగ్రెస్ సీనియర్ లీడర్ చేరాల అశోక్, నాగపూరి వేణు, తక్కళ్ళపల్లి రాంభూపాల్‌రావు, బజార్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, అసోసియేషన్ల బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి రూ.465కోట్ల బడ్జెట్‌ను కేటాయించిన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జేఎన్ క్రీడా మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పింగిలి రమేష్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్యామ్, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. అబ్దుల్లాఖాన్, జిల్లా అధ్యక్షుడు ఆకుల సారంగపాణి, నెట్‌బాల్ అసోసియేషన్ బాధ్యుడు సృజన్, డీఎస్‌ఏ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

- కేయూ క్యాంపస్: రాష్ట్రంలో బీసీ బిల్లును అసెంబ్లీ ఉభయ సభల్లో ఆమోదించి కేంద్రానికి పంపడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం కేయూ మొదటి గేటు వద్ద బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజుగౌడ్ నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్ పాల్గొని మాట్లాడారు.
- కాజీపేట: బీసీలకు 42శాతం, ఎస్సీల వర్గీకరణ, రాజీవ్ యువ వికాసం లాంటి చారిత్రక నిర్ణయాలు తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం కాజీపేట డీజిల్ కాలనీలో కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసునూరి మనోహర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు సీఎం రేవంత్ న్యాయం చేస్తున్నారన్నారు. నిరుద్యోగ సమస్యల్ని తీరుస్తూ జాబ్ క్యాలండర్ విడుదల చేసి ఉద్యోగ అవకాశాలు భర్తీ చేస్తున్న సీఎం రేవంత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సాంకేతిక ఉద్యోగుల సంఘం ఏకగ్రీవంగా ఎంపికైంది. ఈ మేరకు గురువారం ఎన్నికల అధికారి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ ఎన్నికల ఫలితాలను వెల్లడించారు. కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎస్.రాము, ఉపాధ్యక్షులుగా మెట్టు రవి, ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీగా వై.రవి కుమార్, రిక్రియేషన్ జాయింట్ సెక్రటరీగా వై.బాబు, కోశాధికారిగా వి. ప్రేమ్‌సాగర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. కాగా, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ వరుసగా మూడో దఫా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపికగా హ్యాట్రిక్ సాధించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ స్కీం కింద రెండు డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులను ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. మొత్తం 100 మార్కులకు గాను అభ్యర్థి బీడీఎస్‌లో నాలుగు సంవత్సరాలు సాధించిన మార్కులకు 70 శాతం, పాసైన సంవత్సరం నుంచి వెయిటేజ్ 10 మార్కులు గరిష్టంగా, మరో20శాతం మార్కులను వెయిటేజ్‌కి కేటాయించారు.

నిట్ డైరెక్టర్‌ను కలిసిన సీపీ



నిట్ డైరెక్టర్‌తో సమావేశమైన సీపీ

వరంగల్ క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధిని సీపీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం కళాశాల చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి విద్య కోసం ఇక్కడికి వచ్చే విద్యార్థుల కోసం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ర్యాగింగ్ నియంత్రణ కోసం కళాశాల పరంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై చర్చించారు. పోలీసుపరంగా కళాశాలకు అందిస్తున్న సహకారాన్ని సీపీకి డైరెక్టర్ వివరించారు. సీపీ వెంట ఎస్సీ ఏసీపీ మూల జితేందర్‌రెడ్డి, కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఎస్సై లవణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన జిల్లా సంక్షేమ అధికారి

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సన్‌ప్రీత్ సింగ్‌ను హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సఖి సెంటర్ కౌన్సిలర్‌లు హైమావతి, కళ్యాణిలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి సీపీ అడిగి తెలుసుకున్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి సరైన నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని కేయూ బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం కేయూ మొదటి గేటు వద్ద బీఆర్‌ఎస్వీ నేతృత్వంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, రాష్ట్ర నేతలు కలకోట సుమన్, గొల్లపల్లి వీరాస్వామి, రాసూరి రాజేశ్, చిర్ర ప్రకాశ్‌గౌడ్, అన్వర్, తిరుమల్, అవినాశ్, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యత్వాలను వేగవంతం చేయాలని సంఘం అడహక్ కమిటీ కన్వీనర్ ఈవి.శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం కళాశాల ప్రాంగణంలోని అలూమిని హాల్‌లో ఏర్పాటు చేసిన అడహక్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 23 ఆదివారం నాడు జరిగే సర్వసభ్య సమావేశానికి అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొనేలా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారు టీఎన్. స్వామి, సభ్యులు మేకల అక్షయ్ కుమార్, బి.సతీష్‌రెడ్డి, ఉమేందర్, కుమార్, రాజు, రజిత, భిక్షపతి, వసంత్, ఆరిఫ్, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తి

హసన్‌పర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేయూ పోలీసుస్టేషన్ పరిధి భీమారంలో ఓ వ్యక్తి అన్ని కాలనీలు తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు గుర్తించారు. ఆ అనుమానిత వ్యక్తిపై పోలీసులకు సమాచారం అందించగా మూడున్నర గంటల తరువాత పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు భయాందోళనకు గురవడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులు చర్చించుకోవడం కనిపించింది. ఈ ఘటనపై ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మాణిక్‌ఘర్-బల్లార్షా సెక్షన్‌లో ట్రాఫిక్ బ్లాక్

- నేడు బలార్షా - భద్రాచలం మార్గంలో నడిచే 2 రైళ్లు పాక్షికంగా రద్దు

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని మాణిక్‌ఘర్ - బల్లార్షా సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్నందున బల్లార్షా - భద్రాచలం మార్గంలో నడిచే రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 21న భద్రాచలం నుంచి బల్లార్షా వెళ్లే రైలు (17033)ని సిర్పూర్ టౌన్ - బల్లార్షా మధ్య, బల్లార్షా నుంచి కాజీపేట వెళ్లే (17004) రైలును బల్లార్షా - సిర్పూర్ టౌన్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడండి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ ఎల్లాపూర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని, ఆక్రమణదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్లాపూర్ గ్రామస్తులు రాష్ట్ర మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం సమర్పించారు. గురువారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశానికి హాజరై వెళుతున్న మంత్రి సురేఖను వారు కలిసి సమస్యను విన్నవించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సర్వే నెంబర్ 316లో 4ఎకరాల 15గుంటల ప్రభుత్వ భూమి ఉండేది. ఈ భూమిలో 2ఎకరాల 20గుంటల భూమిని అంగడి కోసం కేటాయించగా ప్రస్తుతం పశువుల ఆస్పత్రి నడుస్తోంది. మిగతా భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించి కట్టడాలు జరుగుతున్నారని, వీరికి స్థానిక తహసీల్దార్ సహకరిస్తున్నారని వారు మంత్రికి విన్నవించారు. ఎల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. బల్దియా కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలిసిన వారిలో ప్రవీణ్, రవీందర్, కుమారస్వామి, నాగరాజు, ఎమ్డీ.షేక్‌బాబు, దివ్యరాజు, అమర్‌నాథ్, మోతె లింగారెడ్డి, బుచ్చిరాములు ఉన్నారు.

వినియోగదారుల చట్టాలపై శిక్షణా తరగతులు

హనుమకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీలో లీగల్ మెట్రాలజీ చట్టాలు, రూల్స్-2011పై జరుగుతున్న రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ నుంచి వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ హాజరయ్యారు. శిక్షణ అనంతరం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వర్‌కుమార్, కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ అనంతశర్మ వీరికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తున్న లీగల్ మెట్రాలజీ చట్టాలను సద్వినియోగం చేసుకోవడం, రూల్స్‌ను మరింత పటిష్టం చేయడంతో పాటు వినియోగదారుల కమిషన్‌లలో ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే అంశాలపై ఇందులో శిక్షణ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా 38 మంది హాజరయ్యారు.

సందేశం

వరాల వసంతం... రంజాన్

రంజాన్ నెల ప్రధానంగా ఆత్మప్రక్షాళన మాసం. విశ్వాసులు తమ జీవితాలను ఆధ్యాత్మికతకు పునరంకితం చేసే మాసం. వ్యక్తి జీవన విధానంలో చైతన్యాన్ని ప్రేరేపించే మాసం. క్రమశిక్షణను నేర్పి, దైవ సేవలో నిమగ్నమయ్యేలా చేసే మాసం. దైవం కరుణా కటాక్షాలను, ప్రసన్నతను పొందే మాసం. సౌభ్రాతృత్వానికి అద్దం పట్టే మాసం. పరస్పర ఆత్మీయతా భావాన్ని అనుసంధానించే ఈ మాసం ఒక సత్కార్యానికి పదిరెట్లు పుణ్య ఫలాలను అందిస్తుంది.

ఈ నెలలో స్వర్గద్వారాలు పూర్తిగా తెరిచి ఉంటాయి, నరక ద్వారాలు మూతపడతాయి. వయసుతో నిమిత్తం లేకుండా విశ్వాసులు ఇంటిల్లిపాదీ రాత్రింబవళ్ళు ఆధ్యాత్మికతలో మునిగి తేలుతారు. దైవం పట్ల విశ్వాసాన్ని పటిష్టపరచుకుంటారు. పుణ్యకార్యాలపట్ల ఆకాంక్షను, పాపకార్యాల పట్ల విముఖతను పెంచుకుంటారు. అల్లాహ్ తన బోధనామృతాన్ని ప్రజలకు అందజేసిన మాసం ఇది. ఆయన తన అపార అనుగ్రహాన్ని వర్షిస్తాడు. ధనవంతులకు పేదల హక్కును గుర్తు చేసి, జకాత్ ఫిత్రా లాంటి ధర్మాలను నిర్వర్తించడాన్ని విధిగా నిర్దేశించిన రంజాన్ నెల... ఉపవాసాల ద్వారా... ఆర్తుల ఆకలిదప్పులను సంపన్నులకు అనుభవపూర్వకంగా తెలియజేస్తుంది.

ఖుర్ఆన్ అవతరించిన మాసం

ఈ మాసం పేరిట ఉన్న పర్వదినాన్ని 'ఈద్-ఉల్-ఫితర్' అని కూడా వ్యవహరిస్తారు. రంజాన్ మాసం... ఖుర్ఆన్ అవతరించిన నెల. "ఈ దివ్య గ్రంథం మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన నిదర్శనాలు ఇందులో ఉన్నాయి. ఈ నెలను ఎవరు చూస్తారో వారు ఉపవాసాలు ఉండాలి" అని దివ్య ఖుర్ఆన్ చెబుతోంది. "వెయ్యి నెలలకన్నా శ్రేష్ఠమైన రాత్రి ఒకటి ఈ మాసంలోనే ఉంది. దాని శుభాలను కోల్పోయినవారు దౌర్భాగ్యులు. స్వర్గానికి ఎనిమిది ద్వారాలు ఉన్నాయి. వాటిలో ఒక ద్వారాన్ని కేవలం ఉపవాసులకే ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది" అని పేర్కొంది.

రంజాన్ మాసంలోనే ఇబ్రహీమ్ ప్రవక్త 'సహీఫాల'ను, మూసా ప్రవక్త 'తౌరాత్' గ్రంథాన్ని, దావూద్ ప్రవక్త 'జబూర్' గ్రంథాన్ని, ఈసా ప్రవక్త 'ఇంజీల్' గ్రంథాన్ని దైవ కృపతో అందుకున్నారు. ఈ నెలలో ప్రపంచవ్యాప్తంగా మసీదులు కళకళలాడతాయి. దానధర్మాలకు సంబంధించిన కార్యాలు ముమ్మరం అవుతాయి. సోదర భావం పరస్పరం బలపడుతుంది. శాంతియుత వాతావరణంలో... విశ్వాసులు భక్తి ప్రపత్తులతో ప్రార్థనలు చేస్తారు. యంత్రాలు ఎడతెరిపి లేకుండా కొంతకాలం పని చేసిన తరువాత... వాటికి విశ్రాంతి కావాలి. వాటి భాగాలను ఊడదీసి శుభ్రం చేయాలి. అప్పుడే మలినాలన్నీ పోతాయి. మళ్ళీ సమర్థమైన విధి నిర్వహణకు సిద్ధమవుతుంది. అలాగే మన జీర్ణ వ్యవస్థకు విశ్రాంతిని ఇచ్చి, దానికి క్రమబద్ధతను చేకూర్చే ఆరాధనే... రోజా (ఉపవాసం).

• మహమ్మద్ వహీదుద్దీన్

తెలుసుకుందాం

పురాణ గ్రంథాల ప్రకారం... అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళ లోకాలను 'అధోలోకాలు' అంటారు. ఈ లోకాలలో విలాసవంతమైన పట్టణాలను, భవనాలను దానవరాజు, మహా శిల్పి అయిన మయుడు నిర్మించాడు. వీటిలో భూమి తెల్లగా, నల్లగా, ఎర్రగా, పసుపు పచ్చగా... ఇలా అనేక రంగుల్లో ఉంటుంది.

ఏ లోకంలో ఎవరుంటారు?

అతలం
అతల లోకంలో మయుడి కుమారుడు బలాసురుడు ఉంటాడు. అతను ఎదుటివారి మీద మాయలను ప్రయోగించి వినోదిస్తూ ఉంటాడు. అతనికి 96 రకాల మాయలు తెలుసు.

వితలం
వితల లోకానికి హాటకేశ్వరుడనే పేరున్న శివుడు అధిపతి. అక్కడ భవానీదేవితో కలిసి ఉంటాడు. ఈ లోకంలో హాటకీ అనే నది ఉంది. ఆ జలంతో బంగారం తయారవుతుంది.

సుతలం
వితలలోకం కింద ఉన్నది సుతల లోకం. బలి చక్రవర్తి అక్కడే ఉంటాడు. శ్రీ మహావిష్ణువు... త్రివిక్రమరూపం ధరించి, ముల్లోకాలను తన పాదాలతో ఆక్రమించాడు. బలి చక్రవర్తిని భూమి కిందికి పంపినప్పుడు... అతనికి సుతలలోకంలో ఇంద్రత్వాన్ని ఆ శ్రీహరి అనుగ్రహించాడు.

తలాతలం
ఈ లోకానికి మయుడు ప్రభువు. రాక్షసుల పట్టణాలను నిర్మించినది అతనే. శివుడు త్రిపురాసుర సంహారం చేసినప్పుడు... మహావిష్ణువును మయుడు శరణు కోరాడు. ఆయన మయుణ్ణి కరుణించి తలాతలానికి రాజును చేశాడు.

మహాతలం
తలాతలానికి దిగువన ఉండే మహాతలంలో... కద్రువ సంతానమైన సర్పరాజులు ఉంటాయి. ఒక్కొక్కదానికి అనేక పడగలు ఉంటాయి. నారాయణుడి వాహనమైన గరుత్మంతుడంటే భయంతో అనుక్షణం కలవరపడుతూ జీవిస్తాయి.

రసాతలం
మహాతలానికి కింద ఉండే రసాతలం... దైత్యులు, దానవులు అయిన నివాతకవచులు, కాలకేయులకు నిలయం. వారికి దేవతలతో సరిపడదు. కానీ శ్రీహరికి లొంగి ఉంటారు.

పాతాళం
అన్నిటికన్నా దిగువన ఉండేది పాతాళ లోకం. శంఖుడు, మహాశంఖుడు, ధనుంజయుడు మొదలైన మహానాగులు అక్కడ ఉంటాయి. వాటిలో కొన్నిటికి అయిదు, మరికొన్నిటికి పది, ఇంకొన్నిటికి వంద తలలు ఉంటాయి. వాటి పడగలమీద మణులు మెరుస్తూ ఉంటాయి. వాటి మెరుపులు పాతాళంలోని చీకట్లను తొలగిస్తూ ఉంటాయి. పాతాళ లోకం అడుగున ఆదిశేషుడు ఉంటాడు. అనంతుడు, సంకర్షణుడు అని పేర్లు ఉన్న ఆయన తల మీద ఆవగింజలా ఈ భూమండలం ఉంది.



• ప్రయాగ రామకృష్ణ


చింతన

ఏది అసలైన ధ్యానం?

'ధ్యానం' అంటే రోజూ ఒక భంగిమలో కాసేపు కళ్ళు మూసుకొని, శ్వాస లాంటి ఏదో ఒక విషయం మీద దృష్టి నిలపడం అనే అభిప్రాయం చాలా బలంగా ఉంది. ఈ ప్రక్రియ వల్ల తాత్కాలికమైన ప్రశాంతత కలుగుతుందేమో కానీ... మనసులోని సంఘర్షణలు, జీవితంలో దుఃఖం మాత్రం తొలగిపోవడం లేదు. ఈ వాస్తవం మనందరికీ తెలుస్తూనే ఉంది. మరి ఏది అసలైన ధ్యానం? మనం ఏ విషయాన్నైనా మనసుతోనే గ్రహిస్తాం. అందుకే జీవితం గురించి స్పష్టత రావాలంటే... మనసు గురించి లోతుగా తెలియాలి. శరీరాన్ని అద్దంలో చూసుకోవడం మనకు అలవాటే. ఆ సమయంలో మన ఆకార వికారాలు మన అవగాహనలోకి వస్తాయి. అలాగే, మన మనసును మనమే అద్దంలో చూసుకోగలమా? దాని తీరుతెన్నులను సాక్షిలా గమనించగలమా? అవును. అటువంటి నిశితమైన, నిరంతరమైన పరిశీలనే ధ్యానం. మనసు మాయలు కనిపెట్టడమే ధ్యానం

అరువు తెచ్చుకున్న జ్ఞానం

దేవుడు, మత విశ్వాసాలు, జీవితం పట్ల దృక్పథం... ఇలా మన జీవితాన్ని నడిపే ముఖ్యమైన విషయాల పట్ల మనకున్న అభిప్రాయాల్లో ఎక్కువ శాతం మన అనుభవంలోంచి వచ్చినవి కావు. ఇది ఇతరుల నుంచి వచ్చిన 'సెకెండ్ హ్యాండ్' జ్ఞానం. అలా అనేకానేక ప్రభావాలు, నమ్మకాలు, అరువు తెచ్చుకున్న జ్ఞానంతో మన మనసు కండిషన్ (నిబద్ధీకరణ) అయిపోయింది. అలాంటి మనసు... దుమ్ము పట్టిన కళ్ళద్దాలలాంటిది. కళ్ళద్దాల మీద మురికి పేరుకుపోతే వాటి ద్వారా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని సరిగ్గా చూడలేం. అలాగే, రకరకాల నిబద్ధీకరణలతో నిండిన మనసు వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా చూడలేదు. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో మనకు సహకరించలేదు. అలాంటి మనసు ఉన్నంతవరకూ... దుఃఖం, సంఘర్షణల నుంచి మనకు విముక్తి లేదు. సత్యం వైపు మనం ప్రయాణించే అవకాశమే లేదు. శరీరం మీద ఆచ్ఛాదనలు తొలగినప్పుడు అసలు రూపం బయటపడినట్టే... మనసు మీద ఏర్పడిన ప్రభావాల గురించి, నిబద్ధీకరణ పొరల గురించి స్పృహ కలిగినట్టైతే... అవి వాటంతట అవే తొలగిపోతాయి. అలాంటి అవగాహనతో మానసికంగా అనాచ్ఛాదితం కావడమే నిజమైన ధ్యాన సాధన. జీవితం అంటే వర్తమాన క్షణాల దొంతర అని మనకు తెలుసు. అయితే గతం తాలూకు జ్ఞాపకాలు-గాయాలు, భవిష్యత్తు గురించిన ఊహలు-భయాలు నిరంతరం వర్తమాన క్షణంలోకి చొచ్చుకువస్తూ ఉంటాయి. అంటే గడచిపోయిన కాలం, ఇంకా రాని భవిష్యత్తు అనేవి అత్యంత విలువైన, తాజాది అయిన ప్రస్తుత క్షణాన్ని కలుషితం చేస్తున్నాయన్న మాట. ఈ అవగాహనతో... ప్రతిక్షణంపై నిత్యం ఎరుక (అవేర్‌నెస్‌తో) కలిగి ఉండడం కూడా ధ్యానంలో భాగమే.



స్వీయాన్వేషణ... సత్యాన్వేషణ

"మనసు వేసే మోసపు వేషాలను కనిపెట్టడం, దాని తాలూకు కపటాన్ని కడిగి వేయడమే ధ్యానం" అంటారు ప్రఖ్యాత తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి. ప్రతి విషయాన్నీ ప్రశ్నించి, లోతుగా ఆలోచించి, సత్యాసత్యాలను బేరీజు వేసి తేల్చుకొనే సమయం, ఓపిక మనలో చాలామందికి ఉండవు. అందుకే ఎవరో ఇతరులు చెప్పిన జవాబులను ఇట్టే నమ్మేసి సమాధానపడమంటూ మనసు మభ్యపెడుతుంది. ఈ మాయకు లొంగకుండా అప్రమత్తంగా ఉండడం, దేనినైనా సొంత అన్వేషణ, స్వీయ అనుభవం ద్వారా తెలుసుకోవడం, తేల్చుకోవడం... ఇవన్నీ ధ్యానంలో భాగమే. నిజమైన ధ్యానం అంటే స్వీయాన్వేషణ... సత్యాన్వేషణ. తనను తాను తెలుసుకొనే ప్రయాణంలో భాగంగా మనసును నిశితంగా పరిశీలన చేయడమే నిజమైన ధ్యాన సాధన. వాహనం నడిపేవారి కళ్ళు, కళ్ళద్దాలు సరిగ్గా పని చేస్తేనే ప్రయాణం భద్రంగా సాగుతుంది. అలాగే జీవిత ప్రయాణం సవ్యంగా సాగాలంటే... స్పష్టంగా చూడగలిగే మనసు ద్వారానే కుదురుతుంది. నమ్మకాలు, గత జ్ఞానం తాలూకు దుమ్ము వదిలించుకోవడం ద్వారా తేటపడిన మనసు... ఉన్నదాన్ని ఉన్నట్టుగా చూడగలుగుతుంది. అంతర్గత సంఘర్షణలన్నిటినీ అంతం చేస్తుంది. అసత్యమైన వాటిని గుర్తించి, తొలగించుకొనే తీక్షణతను సంతరించుకుంటుంది. అలాంటి ధ్యానాత్మకమైన మనసే సత్యానికి ద్వారాలు తెరుస్తుంది.

> **మన మనసును మనమే అద్దంలో చూసుకోగలమా? దాని తీరుతెన్నులను సాక్షిలా గమనించగలమా? అటువంటి నిశితమైన, నిరంతరమైన పరిశీలనే ధ్యానం. మనసు మాయలు కనిపెట్టడమే ధ్యానం.**

• ఈదర రవికిరణ్

గీతాసారం

చరిత్రలో ఇద్దరు జ్ఞానులు పరస్పరం సంభాషించిన సందర్భాలు చాలా తక్కువ. జనక మహారాజు, అష్టావక్ర మహర్షి మధ్య జరిగిన అలాంటి సంభాషణను 'అష్టావక్ర గీత' అని పిలుస్తారు. ఇది 'సాధకులకు ఉపయోగపడే అత్యుత్తమమైన సంభాషణ' అని పెద్దలు పేర్కొన్నారు. ఒకసారి ఒక గురువు తన శిష్యుణ్ణి చివరి పాఠం కోసం జనక మహారాజు దగ్గరకు పంపాడు. అతను కట్టుకున్న గోచీ, భిక్షాపాత్రతో జనకుడి వద్దకు వచ్చాడు. 'విలాసాల మధ్య ఉన్న రాజు దగ్గరకు తనను ఎందుకు పంపించాడా?' అని ఆ శిష్యుడు ఆశ్చర్యపోయాడు.

ఆసక్తి, విరక్తి

ఒక రోజు ఉదయం జనకుడు అతణ్ణి స్నానానికి దగ్గరలోని నది దగ్గరకు తీసుకువెళ్ళాడు. స్నానం చేస్తూ ఉండగా... రాజభవనం కాలిపోయిందనే వార్త వచ్చింది. శిష్యుడు తన గోచీ గురించి ఆందోళన చెందుతున్నాడు. కానీ జనకుడు రాజ భవనం గురించి ఏమాత్రం కలవరపడలేదు. సాధారణమైన గోచీతో కూడా అనుబంధం అనేది అనుబంధమేననీ, దాన్ని వదిలేయాల్సిన అవసరం ఉన్నదనీ ఆ క్షణంలో శిష్యుడు గ్రహించాడు.

అనాసక్తంగా... కర్తవ్య కర్మలను ఆచరించే మనిషి అత్యున్నత స్థాయికి చేరుకుంటాడని శ్రీకృష్ణుడు మనకు హామీ ఇస్తున్నాడు. అనాసక్తుడిగా... ఆసక్తి, విరక్తి... ఈ రెండిటినీ వదిలేసిన వాడు... కర్మద్వారా మాత్రమే పరిపూర్ణత పొందినవాడు అయిన జనక మహారాజు ఉదాహరణను ఇచ్చాడు. విలాసాలలో నివసించేవాడు, అనేక బాధ్యతలను కలిగి ఉన్నవాడు అయిన మహారాజు కూడా... అనాసక్తుడై చర్యలను చేయడం ద్వారా సర్వోన్నతమైన స్థితిని పొందగలడనే విషయాన్ని శ్రీకృష్ణుడు నొక్కి చెప్పాడు. పరిస్థితులతో సంబంధం లేకుండా మనం కూడా అదే విధంగా ఉన్నత స్థితికి చేరుకోగలమని ఇది సూచిస్తుంది.



అనాసక్తితో కర్మలు చేయడం అనేది భగవద్గీతలోని ప్రధాన బోధన. ఇది ఆసక్తి, విరక్తుల ప్రత్యేక సంగమం. ఒక వ్యక్తి పూర్తిగా బాధ్యత వహించి, తన వంతు సర్వోత్కృష్టమైన కృషి చేయాలి. బాధ్యతలను నిర్వహించడానికి చేసే పని తాలూకు ఫలితం ప్రయత్నాలను బట్టి ఉండవచ్చు లేదా దానికి పూర్తి విరుద్ధంగా ఉండవచ్చు. ఎలాంటి సందర్భంలోనైనా అనాసక్తుడైన వ్యక్తి ఆందోళన చెందడు, కలవరపడడు. అదే సమయంలో అతని చర్యల ఫలితం అతణ్ణి ప్రభావితం చేయడం లేదు కాబట్టి, అంతర్గతమైన కలవరం ఉండదు. ఆధునిక యుగంలో వృత్తి-జీవితం మధ్య సమతుల్యతను కాపాడుకోవడానికి ఇది కీలకమైన మార్గం.



కె. శివప్రసాద్

సహజయోగ

దేశ విముక్తి నుంచి ఆత్మ స్వాతంత్ర్యం వైపు...

"మానవులు అంతర్గత శాంతి పొందనంతవరకూ ప్రపంచ శాంతి పొందడం సాధ్యం కాదు. అంతర్గత శాంతిని పొందడానికి ఆత్మసాక్షాత్కారం ఒక్కటే మార్గం" అని చాటి చెప్పిన ఆధ్యాత్మిక గురువు శ్రీమాతాజీ నిర్మలాదేవి. శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక సమస్యలకు పరిష్కారంగా సహజ యోగాన్ని మానవాళికి అందించారు. నేడు ఆమె జయంతి.

ఏది ఆదర్శమో బోధించడమే కాదు, ఆదర్శంగా ఎలా ఉండాలో ఆచరించి చూపిన శ్రీమాతాజీ నిర్మలాదేవి... మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో... 1923లో... మార్చి 21న జన్మించారు. చిరునవ్వులొలుకుతూ, ప్రకాశవంతంగా ఉన్న ఆ శిశువును చూసిన ఆమె అమ్మమ్మ తను 'నిష్కళంక' (ఏ మచ్చా లేనిది) అని సంబరపడ్డారు. నిర్మలా దేవి తండ్రి ప్రసాదరావ్ సాల్వే అప్పట్లో నాగపూర్‌లో ప్రసిద్ధి చెందిన క్రిమినల్ లాయర్. పద్నాలుగు భాషల్లో పండితుడు. దివ్య 'ఖుర్ఆన్' గ్రంథాన్ని మరాఠీ భాషలోకి అనువదించారు. భారత రాజ్యాంగ కమిటీలో సభ్యుడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక.. మొదటి పార్లమెంట్‌లో సభ్యునిగా ఉన్నారు. ఆమె తల్లి కార్నెలియా సాల్వే మన దేశంలో గణిత శాస్త్రం ఆనర్స్‌లో పట్టభద్రురాలైన తొలి మహిళ. స్వాతంత్ర్య ఉద్యమం కోసం ఆస్తులన్నిటినీ త్యాగం చేసిన ఆ కుటుంబం పూరి గుడిసెలో నివసించాల్సి వచ్చినా, పోరాట మార్గాన్ని విడిచిపెట్టలేదు. ఉద్యమం సందర్భంగా తల్లితండ్రులు జైలుకు వెళ్ళడంతో... చిన్న వయసులోనే ఇంటి బాధ్యతలను నిర్మలాదేవి తీసుకున్నారు. ఆమె కూడా బాల్యం నించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీతో సన్నిహితంగా మెలిగారు. లాహోర్ మెడికల్ కాలేజీలో చదువుతున్నప్పుడు... క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆ కాలేజీపై భారత జెండాను నిర్మలాదేవి ఎగురవేశారు. దానితో ఆమెను కాలేజీ నుంచి బహిష్కరించారు. ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి అరెస్టయ్యారు.

> **జైలులో విద్యుత్ షాక్ ఇచ్చినా, మంచు గడ్డల మీద పడుకోబెట్టినా ఉద్యమ పంథాను నిర్మలాదేవి విడిచిపెట్టలేదు. గ్రామగ్రామానికీ తిరిగి రహస్యంగా కరపత్రాలను పంచిపెట్టి... ప్రజలను చైతన్యపరిచారు. 'మా తెరి జయహో' అనే దేశభక్తి గీతాన్ని కూడా రాశారు.**

భగవంతుడంటే...

వివాహమై, గృహిణిగా బాధ్యతలు నెరవేర్చిన తరువాత... 1970లో 'సహజయోగం' అనే ఆధ్యాత్మిక ఉద్యమాన్ని నిర్మలాదేవి ప్రారంభించారు. ఈసారి మానవుల ఆత్మ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. "భగవంతుడంటే మన లోపల ఉన్న ఆత్మే" అని స్పష్టం చేసిన ఆమె... మానవులలో నిద్రాణంగా ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేయడం ద్వారా ఆత్మసాక్షాత్కారం చాలా సులభతరమని నిరూపించారు. ప్రపంచ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో కూడా సహజ యోగ సందేశాన్ని వినిపించడం కోసం అలుపెరగకుండా ప్రయాణించారు. అనేకమంది సత్యాన్వేషకులను కలిశారు. లక్షల మందికి స్వస్థత చేకూర్చడంతో పాటు వారిలో ఆధ్యాత్మిక వికాసాన్ని కలిగించారు. నలభై ఏళ్ళ కాలంలో వందకు పైగా దేశాల్లో పర్యటించిన ఆమె... ఒక్క 1990లోనే... 26 దేశాల్లో 200కు పైగా బహిరంగ కార్యక్రమాల్లో ఉపన్యసించడం విశేషం. మానవాళిపట్ల తనకున్న కరుణను వ్యక్తపరచడం కోసం అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్మలాదేవి చేపట్టారు. ముంబాయి, గ్రేటర్ నోయిడాల్లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సహజయోగ పరిశోధన, ఆరోగ్య కేంద్రాలు, సంగీతం, కళల అభివృద్ధి కోసం ముంబాయిలో ప్రారంభించిన 'శ్రీ పి.కె.సాల్వే కళాప్రతిష్ఠాన్', నిరాశ్రయులైన మహిళలు పిల్లల కోసం నోయిడాలో స్థాపించిన 'విశ్వనిర్మల ప్రేమ ఆశ్రమం', హిమాచల్ ప్రదేశ్‌లోని అంతర్జాతీయ పబ్లిక్ స్కూల్ వీటిలో కొన్ని.



'మానవరత్నం'

తను చేసిన విశిష్టమైన సేవలకు గుర్తింపుగా వివిధ దేశాల అధ్యక్షుల నుంచి, ప్రముఖుల నుంచి అనేక ప్రశంసా పత్రాలను ఆమె అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 500కు పైగా పురస్కారాలు స్వీకరించారు. మహారాష్ట్ర ప్రభుత్వం 'మానవ రత్న' పురస్కారంతో, యుఎన్‌ఓ 'యూనిటీ ఇంటర్నేషనల్ పీస్' అవార్డుతో సత్కరించాయి. రష్యాలో 'ప్రిసీడియం ఆఫ్ పెట్రోవ్ స్కా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' లో గౌరవ సభ్యత్వం అందుకున్నారు. ప్రసిద్ధ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌తో పాటు ప్రపంచంలో కేవలం 12 మంది ప్రముఖులకు మాత్రమే ఈ గౌరవం లభించింది. అమెరికాలోని అనేక రాష్ట్రాల్లో ఆమె జన్మదినమైన మార్చి 21ని 'శ్రీమాతాజీ నిర్మలాదేవి డే'గా ప్రకటించారు. ఆమె శతజయంతి సందర్భంగా... ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం వంద రూపాయల నాణేన్ని విడుదల చేసింది. నిర్మలాదేవి నేడు భౌతికంగా మన మధ్య లేకపోయినా... ప్రపంచంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వాలు నెలకొనడానికి ఆమె చేసిన ప్రయత్నాలు... సహజయోగ మార్గంలో నడిచే ప్రతి ఒక్కరి హృదయాలను నిత్యం స్పృశిస్తూనే ఉంటాయి. నిర్మలాదేవి అడుగుజాడలు మహోన్నతమైన ఆమె ఆదర్శాలను గుర్తు చేస్తూనే ఉంటాయి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సద్బోధ

మనసు నిర్మలం కావాలంటే...


భారత దేశం నుంచి బౌద్ధ మతాన్ని చైనాలోకి తీసుకువెళ్ళిన ప్రముఖ బౌద్ధ గురువు బోధిధర్మ. ఆ కాలంలో 'వు' అనే వ్యక్తి చైనా చక్రవర్తిగా ఉండేవాడు. అతను బోధిధర్మ బోధల పట్ల చాలా ఆకర్షితుడయ్యాడు. ఒక రోజు అతను బోధిధర్మతో "నా మనసు ప్రశాంతంగా, నిర్మలంగా ఉండడానికి దయచేసి ఏదైనా చేయండి" అని కోరాడు. తప్పకుండా చేస్తాను. 'రేపు తెల్లవారుజామున రండి. వస్తూ వస్తూ మీ మనసును తీసుకురండి. రాజమందిరంలో మరచిపోయి రాకండి" అన్నాడు బోధిధర్మ. 'ఇదేమిటి? మనసును మరచిపోయి రావద్దంటున్నాడేమిటి? ఈయనకేమైనా పిచ్చి పట్టిందా?' అనుకున్నాడు. కానీ బోధిధర్మతో "సరే! వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రాజమందిరానికి వచ్చిన తరువాత... 'బోధిధర్మ దగ్గరకు రేపు వెళ్ళాలా? వద్దా?' అని చక్రవర్తి చాలాసేపు ఆలోచించాడు. బోధిధర్మ మాటలే అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 'ఆ పిచ్చివాడు ఏం చేస్తాడో? వెళ్ళకపోవడమే మంచిది' అనిపిస్తోంది. మరోవైపు 'బోధిధర్మ సామాన్యమైన గురువు కాదు. వెళ్ళినట్టయితే ఏదో శ్రేయస్సు కలుగుతుంది' అనిపించింది. బోధిధర్మ ముఖవర్చస్సు, కళ్ళలో వెలుగు, బుద్ధికుశలత చక్రవర్తికి గుర్తుకువచ్చాయి. తెల్లవారకముందే బయలుదేరి బోధిధర్మ దగ్గరకు వెళ్ళాడు. అతని రాకకోసం ఎదురుచూస్తున్నట్టు తన కుటీరం ముందే బోధిధర్మ కూర్చొని ఉన్నాడు. ..రండి మహారాజా! రండి. నా ముందు కూర్చోండి. కళ్ళు మూసుకోండి. మీ చంచలమైన మనసు ఎక్కడుందో బాగా వెతికి నాకు చెప్పండి. దాని కథ నేను చూసుకుంటాను" అంటూ తన చేతిలో ఉన్న కర్రను (దండాన్ని) చక్రవర్తి కళ్ళముందు ఊపాడు. "కళ్ళు మూసుకోండి" అన్నాడు.

చక్రవర్తి మరో మాట చెప్పలేక కళ్ళు మూసుకొని, తన మనసు తనలో ఎక్కడుందో వెతకడం ప్రారంభించాడు. క్షణాలు గడిచేకొద్దీ... నిశ్శబ్దమైన, ప్రశాంతమైన ఆ వాతావరణంలో... చక్రవర్తి ప్రశాంతత క్రమంగా వృద్ధి చెంది, స్థిరపడింది. అతనికి కళ్ళు తెరవాలనిపించలేదు. అలాగే ఉండిపోవాలనిపించింది. అలా రెండుగంటలు గడిచాయి. సూర్యోదయం అయింది. సూర్యకిరణాలు వారిపై పడుతున్నాయి.

"ఇక చాలు! కళ్ళు తెరవండి" అన్నాడు బోధిధర్మ. చక్రవర్తి మెల్లగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఉన్న బోధిధర్మ పాదాలపై తల ఉంచాడు. ప్రశాంతవదనంతో లేచి నిలబడి, చేతులు జోడించి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించాడు. ఆ తరువాత ఏమీ మాట్లాడకుండా... నడుస్తూ తన భవనం వైపు వెళ్ళిపోయాడు. సద్గురువులపట్ల నమ్మకం, జ్ఞానం పొందాలనే కోరిక, అంతరంగంలోకి వెళ్ళడానికి దోహదడే ప్రశాంతతలతో మనసు నిర్మలం కాగలదనే సూచన ఓషో చెప్పిన ఈ కథలో ఉంది. మహనీయుల సామీప్యంలో మాటలతో చెప్పలేని ప్రశాంతత లభిస్తుందని, సందేహాలు తీరుతాయనీ రమణ మహర్షిని దర్శించిన ఎందరో ప్రముఖులు పేర్కొన్నారు.

> **సద్గురువులపట్ల నమ్మకం, జ్ఞానం పొందాలనే కోరిక, అంతరంగంలోకి వెళ్ళడానికి దోహదడే ప్రశాంతతలతో మనసు నిర్మలం కాగలదనే సూచన ఓషో చెప్పిన ఈ కథలో ఉంది. మహనీయుల సామీప్యంలో మాటలతో చెప్పలేని ప్రశాంతత లభిస్తుందని, సందేహాలు తీరుతాయనీ రమణ మహర్షిని దర్శించిన ఎందరో ప్రముఖులు పేర్కొన్నారు.**





• రాచమడుగు శ్రీనివాసులు

హృదయం ఆనందంతో నిండిపోయింది

చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. బుధవారం యూకే పార్లమెంటులోని హౌస్ ఆఫ్ కామన్స్ లో ఆయనకు ఘన సన్మానం జరిగింది. బ్రిడ్జి ఇండియా సంస్థ ఆయనకు జీవిత సాఫల్య పురస్కారం అందించింది. తనకు దక్కిన ఈ సత్కారానికి హృదయమంతా ఆనందంతో నిండిపోయిందని చిరు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "యూకేలో నాకు దక్కిన ఈ గౌరవం మరిచిపోలేనిది. ఈ అనుభూతిని వర్ణించడానికి మాటలు చాలట్లేదు. హృదయమంతా ఆనందంతో ఉప్పొంగిపోతోంది. నాకు సన్మానం చేసిన యూకే పార్లమెంటు సభ్యులకు, జీవిత సాఫల్య పురస్కారం అందించిన బ్రిడ్జి ఇండియా సంస్థకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. చిరంజీవికి ఈ పురస్కారం దక్కినందుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు గర్వంగా ఉందని తెలిపారు.

అలాంటి పనులకు నేను వ్యతిరేకిని

యూకేలో తనను కలవడానికి ప్రయత్నిస్తున్న అభిమానుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారంపై చిరంజీవి స్పందిస్తూ అది అవాస్తవం అని పేర్కొన్నారు. "లండన్‌లో నన్ను కలవాలనుకుంటున్న ప్రియమైన అభిమానులారా.. నన్ను కలిసేందుకు 'ఫ్యాన్ మీటింగ్స్' పేరిట మీ నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. ఒకవేళ ఎవరి నుంచైనా ఇలా డబ్బులు వసూలు చేసి ఉంటే తిరిగివచ్చే ఏర్పాటు చేస్తాను. నేను ఇలాంటి పనులకు పూర్తి వ్యతిరేకిని. మన మధ్య ఉండే అపురూపమైన బంధానికి వెలకట్టలేం" అని పేర్కొన్నారు.

అందుకే ఆ టైటిల్ పెట్టాం



సిద్దు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ఈ మూవీ ట్యాగ్‌లైన్. వైష్ణవి చైతన్య హీరోయిన్. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'కిస్' పాటను మేకర్స్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'ప్రతి మనిషి జీవితంలో ఓ లక్ష్యం ఉంటుంది. అయితే ఏ పని చేస్తున్నామనేది కూడా చాలా ముఖ్యం. ఓ పనిని ఇలానే ఎందుకు చేయాలి.. మరోలా చేస్తానని కొందరు అంటుంటారు. అలాంటి వారిని చూస్తే మనం క్రాక్ అంటాం. అందుకే ఈ టైటిల్ పెట్టాం. ప్రేక్షకులను నవ్విస్తూనే బాధ్యతను నిర్వర్తించే పాత్రలో కనిపిస్తాను' అని తెలిపారు. హీరోయిన్ వైష్ణవి మాట్లాడుతూ 'ఈ పాట యూత్‌కి బాగా కనెక్ట్ అయ్యేలా ఉంటుంది' అని అన్నారు.

బౌలర్లకు ఊరట



బంతికి ఉమ్మిపై నిషేధం ఎత్తివేత

రెండో కొత్త బాల్‌కు అవకాశం

ఐపీఎల్‌లో నయా రూల్స్

ముంబై: ధనాధన్ బ్యాటింగ్‌కు మారుపేరుగా నిలిచే ఐపీఎల్‌లో ఇక బౌలర్లు కూడా తడాఖా చూపనున్నారు. శనివారం ఆరంభం కానున్న ఈ లీగ్‌లో బంతికి ఉమ్మి (సలైవా) రాయడంపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. ఈ నిర్ణయం ఫాస్ట్ బౌలర్లకు అద్భుతంగా మేలు చేకూర్చుతుంది. గురువారం బీసీసీఐ కార్యాలయంలో ఫ్రాంచైజీల కెప్టెన్ల సమావేశం జరిగింది. దీంట్లో భాగంగా బంతి మెరుపు కోసం ఉమ్మి రాయడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసేందుకు మెజార్టీ కెప్టెన్లు సుముఖత వ్యక్తం చేయడంతో బోర్డు ముందడుగు వేసింది. బంతి పాతబడ్డాక ఉమ్మితో దాన్ని మెరిసేలా చేసి బౌలర్లు రివర్స్ స్వింగ్‌ను రాబట్టడం పరిపాటి. కానీ కొవిడ్ సమయంలో ఆటగాళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బంతికి ఇలా ఉమ్మి పూయడాన్ని ఐసీసీ నిషేధించింది. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ అదే నిర్ణయాన్ని అమలు చేశారు. ఇన్నాళ్లూ బౌలర్లు చెమటను మాత్రం ఉపయోగిస్తూ వచ్చారు. కానీ దాంతో బంతి బరువు పెరుగుతుందని, స్వింగ్ రాబట్టడం కష్టమనే అభిప్రాయం ఉంది. అయితే కొవిడ్ ప్రభావం తగ్గడంతో సలైవాపై ఉన్న నిషేధాన్ని తొలగించాలన్న డిమాండ్ ఎక్కువైంది. ఇటీవల భారత పేసర్ మహ్మద్ షమి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. మరోవైపు బోర్డు నిర్ణయాన్ని గుజరాత్ టైటాన్స్ పేసర్ మహ్మద్ సిరాజ్ స్వాగతించాడు. 'బౌలర్లు ఇది శుభవార్తే. బంతి ఎలాంటి ప్రభావం చూపని స్థితిలో ఉమ్మితో రివర్స్ స్వింగ్‌ను రాబట్టి బ్యాటర్లను కట్టడి చేయవచ్చు' అని సిరాజ్ తెలిపాడు.

11వ ఓవర్‌నుంచి మరో బంతి..

రాత్రి జరిగే మ్యాచ్‌ల్లో కొన్నిసార్లు మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈకారణంగా బంతి తడిగా మారి బౌలర్లకు పట్టు లభించదు కాబట్టి.. సెకండ్ బ్యాటింగ్ జట్టు భారీగా పరుగులు సాధించే చాన్సుంటుంది. దీన్ని ఎదుర్కొనేందుకు రెండో ఇన్నింగ్స్‌లో 11వ ఓవర్ నుంచి మరో బంతిని తీసుకునేందుకు బీసీసీఐ అవకాశం కల్పించనుంది. అయితే ఇది రూల్ మాత్రం కాదని, కొత్త బంతిని కెప్టెన్లు కోరినప్పటికీ మంచు అధికంగా ఉందా? లేదా? అని పరిశీలించి ఫీల్డ్ అంపైర్లే తుది నిర్ణయం తీసుకుంటారని బోర్డు స్పష్టం చేసింది. ఒకవేళ అంపైర్లు బంతిని మార్చాలనుకున్నా కొత్త బంతిని మాత్రం ఇవ్వరు. ఏ బంతిని మార్చుతున్నారో.. దాదాపు అలాంటి మరో బాల్‌తో మ్యాచ్‌ను కొనసాగిస్తారు. మధాహ్నం మ్యాచ్‌కు ఈ రూల్ వర్తించదు.

హాక్‌ఐ ద్వారా వైడ్ బాల్

కెప్టెన్ల సమావేశంలో మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఇక నుంచి వైడ్ బాల్‌ను సరిగ్గా అంచనా వేసేందుకు హాక్‌ఐ, బాల్ ట్రాకింగ్ సహకారం కూడా తీసుకోనున్నారు. ఎక్కువ ఎత్తు వైడ్స్‌తో పాటు ఆఫ్ స్టంప్ ఆవలగా వెళ్లే వైడ్స్‌పై నిర్ణయం తీసుకునేందుకు వీటిని ఉపయోగించనున్నారు.

రాజస్థాన్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్

సంజూ శాంసన్ స్థానంలో తొలి మూడు మ్యాచ్‌లకు రియాన్ పరాగ్ సారథ్యం వహిస్తాడని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడంతో తొలి మూడు మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఇంపాక్ట్ ప్లేయర్ కెప్టెన్‌గా ఉండేందుకు వీల్లేదు కాబట్టి పరాగ్ నేతృత్వంలో ఆ మ్యాచ్‌లను ఆడతాడు.

ఐవోసీ బాస్‌గా కోవెంట్రీ



తొలి మహిళగా చరిత్ర

కోస్టా నవరినో (గ్రీస్): అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) అధ్యక్షపదవిని చేపట్టనున్న తొలి మహిళగా ఒలింపిక్ మాజీ స్విమ్మర్ క్రిస్టీ కోవెంట్రీ (జింబాబ్వే) చరిత్ర సృష్టించింది. 131 ఏళ్ల చరిత్ర కలిగిన ఐవోసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న తొలి మహిళగా, ఆఫ్రికా జాతీయురాలిగా కూడా కోవెంట్రీ రికార్డులకెక్కింది. గురువారం జరిగిన ఎన్నికల్లో వరల్డ్ అథ్లెటిక్స్ చీఫ్ సెబాస్టియన్ కో, మాజీ అధ్యక్షుడి కుమారుడు జువాన్ ఆంటోనియో సమరాంచ్ జూనియర్ సహా ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే, వీరిద్దరినీ ఓడించిన కోవెంట్రీ జెయింట్ కిల్లర్‌గా నిలిచింది. ఐవోసీ సభ్యత్వం కలిగిన 97 మంది ఓటింగ్‌లో పాల్గొనగా.. తొలి రౌండ్‌లోనే గెలుపునకు కావాల్సిన 49 ఓట్లు కోవెంట్రీకి లభించాయి. సమరాంచ్‌కు 28, సెబాస్టియన్‌కు 8 ఓట్లు పోలయ్యాయి.

టీమిండియాకు రూ. 58 కోట్లు

చాంపియన్స్ ట్రోఫీ గెలిచినందుకు బీసీసీఐ రివార్డు

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. టోర్నీ ఆసాంతం దుమ్ము రేపిన జట్టుకు రూ. 58 కోట్లు ఇవ్వనున్నట్టు తెలిపింది. ఆటగాళ్లు, శిక్షణ, సహాయ సిబ్బంది, జాతీయ సెలెక్షన్ కమిటీ సభ్యులకు ఈ నగదు అందజేయనున్నట్టు పేర్కొంది. ఈ రివార్డులో 15 మంది జట్టు ఆటగాళ్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌లకు రూ. మూడు కోట్ల చొప్పున లభిస్తాయి. మిగిలిన మొత్తంలో ఇతర సహాయ సిబ్బంది, సెలెక్షన్ కమిటీ సభ్యులు రూ. 50 లక్షల చొప్పున అందుకుంటారు.

చాహల్-ధనశ్రీకి విడాకులు



ముంబై: భారత వెటరన్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మకు ఇక్కడి బాంద్రా ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నందు న ఆరు నెలల కూలింగ్ పీరియడ్‌ను బాంబే హైకోర్టు రద్దుచేసిందని చాహల్ తరఫు న్యాయవాది నితీష్‌కుమార్ గుప్తా చెప్పారు. ఈనెల 20లోగా విడాకుల పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు.. ఫ్యామిలీ కోర్టును ఆదేశించిందన్నారు. కాగా రూ.4.75 కోట్ల భరణంలో భాగంగా చాహల్ ఇప్పటికే ధనశ్రీకి రూ.2.37 కోట్లు చెల్లించాడు. కోర్టు డిక్రీ అందిన అనంతరం మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తామని న్యాయవాది తెలిపారు. విడాకుల కోసం గురువారం చాహల్-ధనశ్రీ కోర్టుకు వచ్చారు.

టీ-షర్టే చెప్పేసిందా?

కోర్టుకు వచ్చినప్పుడు చాహల్ ధరించిన టీ-షర్ట్‌పై 'బీ యువర్ ఓన్ షుగర్ డాడీ' అని ఉండడం అందరి దృష్టినీ ఆకర్షించింది. 'ఎవరో ఇచ్చే డబ్బు, బహుమతులపై ఆశపడకుండా.. నీకాళ్లపై నువ్వు నిలబడు. నీ బాగోగులు నువ్వే చూసుకో' అని దీని అర్థం. ఒకరకంగా ధనశ్రీ మనస్తత్వాన్ని ఉద్దేశించి చాహల్ ఈ విధంగా రాసిన షర్ట్‌ను వేసుకొన్నాడని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

ఐపీఎల్ రేపటి నుంచే

మళ్లీ దబిడి దిబిడే!



ఫుల్ జోష్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్

వరుసగా మూడు సీజన్లలో పేలవ ప్రదర్శనతో చివరి స్థానాలకే పరిమితమవుతూ వస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. 2024 సీజన్‌లో ఒక్కసారిగా దుమ్మురేపింది. దూకుడైన ఆటకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే హైదరాబాద్.. లీగ్ చరిత్రలోనే అత్యధికంగా 287/3 స్కోరు సాధించింది. అలవోకగా భారీ స్కోర్లు సాధిస్తూ ఫైనల్‌కు చేరింది. కానీ, తుది పోరులో మాత్రం కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. అయితే, సన్‌రైజర్స్ విధ్వంసకర బ్యాటింగ్ మాత్రం అభిమానులను ఉర్రూతలూగించింది. 2016లో టైటిల్ సాధించిన హైదరాబాద్.. 2018 ఫైనల్లో ఓడి రెండో స్థానంతో సరిపెట్టుకొంది. అయితే, వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను సన్‌రైజర్స్ భారీ ధరకు కొనుగోలు చేసి అతడికే జట్టు పగ్గాలు అప్పజెప్పింది. జట్టు మళ్లీ పుంజుకోవడానికి ఈ సాహసోపేత నిర్ణయం ఓ రకంగా దోహదం చేసింది. మూడు సీజన్లలో అట్టర్‌ఫ్లాపైన హైదరాబాద్.. 2024 లీగ్‌లో తమ బ్యాటింగ్ విన్యాసాలతో ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ ప్రత్యర్థి బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. క్లాసెన్ కూడా బౌలర్లను వదిలిపెట్టలేదు. దీంతో వేలానికి ముందే కమిన్స్, హెడ్, అభిషేక్, నితీశ్ కుమార్‌లను రిటైన్ చేసుకొని కోర్ టీమ్‌ను సిద్ధం చేసుకొంది. ఈసారి ఇషాన్ కిషన్‌ను కూడా తీసుకున్నారు. ఇక, ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్ అంతర్జాతీయ క్రికెట్ అనుభవం లాభించనుంది. కమిన్స్‌తోపాటు పవర్‌ప్లేలో వికెట్లు పడగొట్టగలిగే అనుభవం ఉన్న షమిని వేలంలో కొనుగోలు చేయడంతో పేస్ విభాగం కూడా మెరుగ్గానే ఉంది. ఆడమ్ జంపా, రాహుల్ చాహర్‌లు స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. గాయం నుంచి కోలుకొన్న కమిన్స్ నేరుగా ఐపీఎల్ ఆడుతుండగా.. షమి ఫిట్‌నెస్ కొంత ఆందోళన కలిగిస్తోంది.

జట్టు

బ్యాటర్లు: ట్రావిస్ హెడ్, అథర్వ టైడే, అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ, సచిన్ బేబీ; **వికెట్ కీపర్లు:** క్లాసెన్, ఇషాన్ కిషన్; **ఆల్‌రౌండర్లు:** అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్, హర్షల్ పటేల్, కమిందు మెండిస్, వియాన్ ముల్డర్; **బౌలర్లు:** కమిన్స్ (కెప్టెన్), షమి, రాహుల్ చాహర్, జంపా, సిమ్రన్‌జీత్, జీషన్ అన్సారీ, ఉనాద్కట్, ఇషాన్ మలింగ.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

బాసెల్: గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-12, 21-8తో సెలిన్/అమీలీ (జర్మనీ) జంటని చిత్తు చేసింది. అయితే శ్రీకాంత్ 15-21, 11-21తో లీ షీఫెంగ్ (చైనా) చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. అలాగే ప్రియాన్షు రజా వత్ 10-21, 11-21తో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్ రౌండ్-16లో అనుపమా ఉపాధ్యాయ 17-21, 19-21తో పీకే వర్దని (ఇండోనేసియా) చేతిలో, ఇషారాణి బారువా 19-21, 21-18, 18-21తో హన్ (మలేసియా) చేతిలో పరాజయం చవిచూశారు.



అక్షర్ పటేల్

ఢిల్లీ దశ తిరిగేనా?

రాహుల్, అక్షర్‌పై ఆశలు

మెగా లీగ్‌లో తొలి టైటిల్ కోసం 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న జట్టు ఢిల్లీ క్యాపిటల్స్. 18వ సీజన్‌లో సరికొత్త లుక్‌తో బరిలోకి దిగుతున్న ఢిల్లీ.. ఈసారైనా కలల కప్‌ను ముద్దాడాలనుకొంటోంది. ఆ జట్టు 2020లో ఫైనల్ చేరుకున్నా..ముంబై చేతిలో ఓడి రన్నరప్‌గా సరిపెట్టుకొంది. రిషభ్ పంత్‌ను వదులుకోవాలన్న షాకింగ్ నిర్ణయం తీసుకొన్న యాజమాన్యం.. వేలంలో ఆచితూచి వ్యవహరించింది. కేఎల్ రాహుల్, డుప్లెసి, స్టార్క్‌లను కొనుగోలు చేసినా.. అనూహ్యంగా అక్షర్ పటేల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. వైస్ కెప్టెన్‌గా డుప్లెసి వ్యవహరిస్తాడు. స్టబ్స్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, రాహుల్, డుప్లెసి, కరుణ్ నాయర్‌తో బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగానే కనిపిస్తోంది. స్టార్క్‌తోపాటు నటరాజన్, ముకేశ్ కుమార్, మోహిత్ శర్మను కొనుగోలు చేసి బౌలింగ్‌ను బలోపేతం చేసింది. అక్షర్, కుల్దీప్ యాదవ్ ప్రధాన స్పిన్నర్లు. పాంటింగ్ స్థానంలో హెడ్ కోచ్‌గా హేమంగ్ బదానీని తీసుకొన్న మేనేజ్‌మెంట్.. కెవిన్ పీటర్సన్‌ను మెంటార్‌గా నియమించుకొంది. ఓవరాల్‌గా జట్టు సమతుల్యంగా కనిపిస్తున్నా.. కెప్టెన్‌గా అనుభవంలేని అక్షర్ జట్టును ఎలా నడిపిస్తాడో చూడాలి.

జట్టు

బ్యాటర్లు: ఫా డుప్లెసి, కరుణ్ నాయర్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్; **వికెట్ కీపర్లు:** రాహుల్, ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పోరెల్, డోనోవాన్ పెరీరా; **ఆల్‌రౌండర్లు:** అక్షర్ పటేల్ (కెప్టెన్), సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, దర్శన్ నల్కండే, విప్‌రాజ్ నిగమ్, అజయ్ మండల్, మన్వంత్ కుమార్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారీ; **బౌలర్లు:** మిచెల్ స్టార్క్, నటరాజన్, ముకేశ్ కుమార్, మోహిత్ శర్మ, దుష్మంత చమీర, కుల్దీప్ యాదవ్.

బిజినెస్

టెక్ నైపుణ్యాలకు అడ్డా భారత్

టెక్ ప్రభావం లేని పరిశ్రమ లేదు.. ఎవరికైనా మనమే కీలక భాగస్వాములం

- ప్రపంచ సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో 23 శాతం మనోళ్లే
- నాస్కామ్ చీఫ్ రాజేశ్ నంబియార్



న్యూఢిల్లీ: అత్యున్నత టెక్ నైపుణ్యాలకు భారత్ ప్రధాన కేంద్రం (హబ్)గా ఎదిగిందని ఐటీ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజేశ్ నంబియార్ అన్నారు. ఈ కారణంగానే టెక్నాలజీ రంగంలో మన దేశం అనేక ప్రముఖ ప్రపంచ కంపెనీలకు ప్రాధాన్యతా భాగస్వామిగా ఎదిగిందన్నారు. నాస్కామ్ నిర్వహిస్తున్న 'గ్లోబల్ కన్‌ఫ్లూయెన్స్- 2025 సదస్సులో ఆయన ఈ విషయాలు తెలిపారు. ప్రస్తుత ప్రపంచ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ (స్టెమ్) నిపుణుల్లో 28 శాతం, సాఫ్ట్‌వేర్ నిపుణుల్లో 23 శాతం మన దేశంలోనే ఉన్న విషయాన్ని నంబియార్ గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేనంత బలంగా, టెక్నాలజీ ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను మార్చివేస్తోందన్నారు. సాంకేతిక మార్పుల ప్రభావం లేని పరిశ్రమగానీ, దేశంగానీ ప్రస్తుతం లేవన్నారు. ఈ మార్పులతో ఏర్పడే సవాళ్లు, అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అత్యున్నత నైపుణ్యాలు ఉన్న ఉద్యోగుల డిమాండ్ రోజురోజుకీ పెరుగుతోందని నంబియార్ తెలిపారు.

రూ.24 లక్షల కోట్ల టర్నోవర్

గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 25,400 కోట్ల డాలర్ల టర్నోవర్ నమోదు చేసిన భారత ఐటీ పరిశ్రమ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో దాదాపు 28,300 కోట్ల డాలర్ల (సుమారు రూ.24.43 లక్షల కోట్లు) టర్నోవర్ నమోదు చేసే అవకాశం ఉందని నంబియార్ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా ఇది 30,000 కోట్ల డాలర్లు వి ంచిపోతుందన్నారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కూడా మన దేశంలో శరవేగంతో అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. 2030 నాటికి మన జీడీపీలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వాటా లక్ష కోట్ల డాలర్లు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.86.36 లక్షల కోట్లు) మించిపోనుందని నాస్కామ్ చీఫ్ తెలిపారు.

ప్రస్తుతం దాదాపు 58 లక్షల ఉద్యోగులున్న ఐటీ రంగంలో కొత్త ఉద్యోగాల కల్పన ముందు ముందూ కొనసాగుతుందన్నారు. దేశంలో పెరుగుతున్న స్టార్టప్‌లు, జీసీసీలు ఇందుకు మరింత దోహదం చేస్తాయన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్‌లోనూ మన దేశానికి మంచి భవిష్యత్ ఉందన్నారు.

బెయిన్ క్యాపిటల్‌కు మణప్పురంలో 18% వాటా

డీల్ విలువ రూ.4,385 కోట్లు

న్యూఢిల్లీ: బంగారం తాకట్టుపై రుణాలిచ్చే మణప్పురం ఫైనాన్స్‌లో 18 శాతం వాటాను రూ.4,385 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ గురువారం వెల్లడించింది. ఈ డీల్ ద్వారా బెయిన్ క్యాపిటల్.. మణప్పురం ఫైనాన్స్ ప్రమోటర్లలో ఒకటిగా మారడంతో పాటు ఉమ్మడి నియంత్రణ హక్కులు సైతం దక్కించుకోనుంది. ఈక్విటీ, వారంట్ల ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా ఈ లావాదేవీ జరగనుంది. ఇందులో భాగంగా మణప్పురం ఫైనాన్స్‌లో 18 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లను ఒక్కొక్కటీ రూ.236 చొప్పున కొనుగోలు చేయనుంది. సంస్థ షేరు 6 నెలల సగటు ట్రేడింగ్ ధరతో పోలిస్తే 30 శాతం అధికమిది. ఈ ఒప్పందం అనంతరం మణప్పురం వ్యవస్థాపక ప్రమోటర్ వీపీ నందకుమార్, ఆయన కుటుంబం కంపెనీలో 28.9 శాతం వాటా కలిగి ఉండనుంది.

మరో 26 శాతం వాటా కోసం ఓపెన్ ఆఫర్: ఈ డీల్‌తో సెబీ నిబంధనల ప్రకారం మరో 26 శాతం వాటా షేర్ల కొనుగోలుకు బెయిన్ క్యాపిటల్ తప్పనిసరి ఓపెన్ ఆఫర్‌ను సైతం ప్రకటించింది. ఓపెన్ ఆఫర్ ధరనూ ఒక్కో షేరుకు రూ.236గా నిర్ణయించారు. ఓపెన్ ఆఫర్ పూర్తయ్యాక మణప్పురంలో బెయిన్ క్యాపిటల్ వాటా 41.7 శాతానికి పెరిగే అవకాశం ఉంది. కేరళకు చెందిన మణప్పురం ఫైనాన్స్ 1949లో ప్రారంభమైంది. ప్రస్తుతం దేశంలోనే రెండో అతిపెద్ద గోల్డ్ లోన్ కంపెనీ ఇది. దేశవ్యాప్తంగా 5,357 శాఖలను నిర్వహిస్తోంది. వీటిల్లో 50,795 మంది పనిచేస్తున్నారు. 65.9 లక్షల మంది కస్టమర్లకు సేవలందిస్తోంది. మణప్పురం ఫైనాన్స్ తన వ్యాపారాన్ని బంగారం తాకట్టు రుణాల నుంచి సూక్ష్మ రుణాలు, వాహన రుణాలు, గృహ రుణాలు, ఎస్ఎంఈ రుణాల విభాగాల్లోకీ విస్తరించింది.

ఎలక్ట్రిక్ ఆటో విభాగంలోకి హీరో మోటో కార్ప్

యూలర్ మోటార్స్‌లో 32.5 శాతం వాటాల కొనుగోలు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటో కార్ప్ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల (ఆటో) విభాగంలోకి అడుగుపెడుతోంది. ఇందులో భాగంగా యూలర్ మోటార్స్‌లో 32.5% వాటాలను రూ.525 కోట్లకు కొనుగోలు చేసింది. మొబిలిటీ రంగ భవిష్యత్తుగా మారాలన్న తమ విజన్ సాకారం చేసుకునే దిశలో ఈ వ్యూహాత్మక పెట్టుబడి ఒక కీలకమైన అడుగు అని కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజాల్ వ్యాఖ్యానించారు. అలాగే సహకార భాగస్వామ్యాల శక్తిని, మార్కెట్ ధోరణులకు అనుగుణంగా మారే తమ వైఖరిని ఇది చాటుతోందన్నారు. అందుబాటులో ఉన్న వ్యాపారావకాశాలు ఉపయోగించుకుంటూ వేగంగా విస్తరిస్తున్న విద్యుత్ త్రీ వీలర్, ఫోర్ వీలర్ సెగ్మెంట్‌లోకి అడుగు పెట్టేందుకు ఈ పెట్టుబడి పునాది అవుతుందని తెలిపారు.

రెనో, బీఎండబ్ల్యూ కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ: మరో రెండు కంపెనీలు కూడా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తమ కార్ల ధరలు పెంచుతున్నట్టు ప్రకటించాయి. వాటిలో ఒకటి రెనో కాగా రెండోది లగ్జరీ కార్ల కంపెనీ బీఎండబ్ల్యూ. పెరిగిపోతున్న ముడి సరుకు వ్యయ భారాన్ని కొంతైనా తగ్గించుకునేందుకు ధరలు పెంచక తప్పలేదని రెండు కంపెనీలు ప్రకటించాయి. తమ కార్ల ధరలు ఏప్రిల్ 1 నుంచి 2 శాతం వరకు పెంచుతున్నట్టు రెనో వెల్లడించగా.. తమ కార్ల ధరలు 3 శాతం వరకు పెంచుతున్నట్టు బీఎండబ్ల్యూ ప్రకటించింది.

ఒప్పో ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్స్

రెండు వేరియంట్లలో లభ్యం.. ప్రారంభ ధర రూ.23,999



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ ఒప్పో ఇండియా.. మార్కెట్లోకి సరికొత్త మిడ్-రేంజ్ ఫోన్లను తీసుకువచ్చింది. ఒప్పో ఎఫ్29 5జీ, ఒప్పో ఎఫ్29 ప్రో 5జీ పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్స్‌ను విడుదల చేసింది. దేశంలోని అన్ని రకాలైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా ఈ ఫోన్ల ను ఐపీ66, ఐపీ68, ఐపీ69 ప్రమాణాలతో తీసుకువచ్చినట్లు ఒప్పో ఇండియా ప్రొడక్ట్ కమ్యూనికేషన్స్ హెడ్ సావియో డిసౌజా వెల్లడించారు. బెంగళూరులోని ఎస్‌జీఎస్ (సొసైటీ జనరల్ డి సర్వియలెన్స్)లో ఈ ఎఫ్29 సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ఐపీ ప్రమాణాలను పరీక్షించినట్లు పేర్కొన్నారు. దుమ్ము ధూళి, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోవటంతో పాటు వర్షంలో తడిచినా, నీటిలో పడినా రక్షణ కల్పించేలా ఈ స్టాండర్డ్స్ ఉంటాయని ఆయన తెలిపారు. ఉత్తరప్రదేశ్, గ్రేటర్ నోయిడాలోని ప్లాంట్‌లో ఈ స్మార్ట్‌ఫోన్స్ ఉత్పత్తి చేస్తున్నట్లు డిసౌజా పేర్కొన్నారు. ఒప్పో ఎఫ్27 సిరీస్ తీసుకువచ్చిన సమయంలో అమ్మకాలు 30 శాతం మేర పెరిగాయని, ఎఫ్29 సిరీస్‌కు అదే స్థాయిలో స్పందన వస్తుందని అంచనా వేస్తున్నట్లు డిసౌజా తెలిపారు. ఈ నెల 27 నుంచి ఎఫ్29 5జీ మోడల్, ప్రో మోడల్ ఏప్రిల్ 1 నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంటాయని తెలిపింది.

ఫీచర్లు: ఈ రెండు స్మార్ట్‌ఫోన్స్‌ను 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ-అమోలెడ్ స్క్రీన్‌తో ఒప్పో తీసుకువచ్చింది. ఇందులో ఎఫ్29 ప్రో 5జీ.. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ చిప్ ప్రాసెసర్‌తో తీసుకురాగా ఎఫ్29 5జీని క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 6 జెనరేషన్ 1 ప్రాసెసర్‌తో తీసుకువచ్చింది. 50ఎంపీ ప్రైమరీ కెమెరా, 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఈ ఫోన్ల ప్రత్యేకతలు.

వేరియంట్స్: ఒప్పో ఎఫ్29 5జీ.. 8జీబీ రామ్+128జీబీ స్టోరేజ్ మోడల్ ధర రూ.23,999గా ఉండగా 8జీబీ+256 జీబీతో కూడిన ఫోన్ ధర రూ.25,999గా ఉంది. కాగా ఎఫ్29 ప్రో 5జీ రూ.27,999 (8జీబీ+128జీబీ), రూ.29,999 (8జీబీ+256జీబీ), రూ.31,999 (12 జీబీ+256జీబీ)ధరతో అందుబాటులో ఉండనుంది.

జీనోమ్ వ్యాలీలో సీజీటీ కేంద్రం

రూ.650 కోట్ల పెట్టుబడి భారత్ బయోటెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో సెల్, జీన్ థెరపీ (సీజీటీ), వైరల్ వెక్టార్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (బీబీఐఎల్) ప్రకటించింది. దీంతో సరసమైన ధరల్లో వ్యాక్సిన్ల అభివృద్ధి, తయారీ నుంచి రీజెనరేటివ్, పర్సనలైజ్డ్ థెరపీల విభాగంలోకి తమ నైపుణ్యాలను విస్తరించినట్టయిందని తెలిపింది. సుమారు రూ.650 కోట్ల (7.5 కోట్ల డాలర్లు)తో ఈ ప్లాంట్‌ను నెలకొల్పినట్లు బీబీఐఎల్ వెల్లడించింది. జీన్, సెల్ థెరపీలకు శాస్త్రీయంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి క్యాన్సర్ రోగులకు రక్షణ కల్పించేందుకు ఇది సహాయకారి అవుతుందని పేర్కొంది. 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక సీజీటీ కేంద్రం బీబీఐఎల్ ప్రయాణంలో ఒక మైలురాయి అని భారత్ బయోటెక్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు. భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రేచస్ ఎల్లా ఈ కేంద్రానికి నాయకత్వం వహిస్తారు.

జియో ఫైనాన్షియల్‌తో అలియాంజ్ జట్టు?

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ఆర్థిక దిగ్గజం అలియాంజ్ గ్రూప్.. ముకేశ్ అంబానీ నాయకత్వంలోని జియో ఫైనాన్షియల్ కంపెనీతో చర్చలు జరుపుతోంది. జియో ఫైనాన్షియల్ ప్రారంభించే లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ వ్యాపారాల్లో వాటా కోసం ఈ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ రెండు వ్యాపారాల్లో కనీసం 50 శాతం వాటా అయినా కావాలని అలియాంజ్ అడుగుతోంది. అలియాంజ్ ఇటీవలే బజాజ్ ఫైనాన్స్ గ్రూప్‌తో ఉన్న ఈ రెండు వ్యాపారాల నుంచి నుంచి తప్పుకుంది. బజాజ్ గ్రూప్ నుంచి తప్పుకున్నా ఈ రంగాల్లో ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జియో ఫైనాన్స్‌తో జట్టు కట్టాలని భావిస్తోంది.

ఓలా ఎలక్ట్రిక్‌కు మరో షాక్

న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించిన విక్రయ గణాంకాలు, వాస్తవ రిజిస్ట్రేషన్లలో భారీ వ్యత్యాసంతో పాటు కంపెనీపై పెరుగుతున్న ఫిర్యాదులపై దర్యాప్తు జరిపి, 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ)ను కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కోరినట్లు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు వాహన్ పోర్టల్‌లో కేవలం 8,652 ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల రిజిస్ట్రేషన్లు నమోదు కాగా.. కంపెనీ మాత్రం ఆ నెలలో 25,000కు పైగా వాహనాలను విక్రయించినట్లు ప్రకటించింది. ఈ నెలలోనూ 20వ తేదీవరకు కంపెనీ రిజిస్ట్రేషన్లు 11,781 యూనిట్లుగా నమోదయ్యాయి. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రకటించిన ఫేమ్ రెండో విడత పథకంతో పాటు పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్ లబ్దిదారుల్లో ఓలా ఎలక్ట్రిక్ ఒకటి. భారీ పరిశ్రమల శాఖ పర్యవేక్షణ పరిధిలోని సర్టిఫికేషన్, టెస్టింగ్ ఏజెన్సీ అయిన ఏఆర్ఏఐనే ఓలా ఎలక్ట్రిక్‌కు ఈ పథకాలకు సంబంధించిన అర్హత పత్రం జారీ చేసింది. అందుకే కంపెనీపై దర్యాప్తు చేపట్టాలని కేంద్రం ఏఆర్ఏఐని నిర్దేశించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వాహనాల్లో తయారీ లోపాలు, వాహన సర్వీసింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఏజెన్సీ సీసీపీఏ ఇప్పటికే ఓలా ఎలక్ట్రిక్‌పై దర్యాప్తునకు ఆదేశించింది.

23,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ మరో 899 పాయింట్లు అప్

సూచీలకు ఫెడ్ బూస్ట్

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో వరుసగా నాలుగో రోజూ బుల్ ర్యాలీ కొనసాగింది. ఈక్విటీ మదుపరుల కొనుగోళ్ల జోరుతో గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 76,000, నిఫ్టీ 23,000 స్థాయిలను మళ్లీ అధిగమించాయి. ఇంట్రాడేలో 1,000 పాయింట్లకు పైగా వృద్ధి చెందిన సెన్సెక్స్.. చివరికి 899.01 పాయింట్ల (1.19 శాతం) లాభంతో 76,348.06 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 283.05 పాయింట్ల (1.24 శాతం) వృద్ధితో 23,190.65 వద్ద ముగిసింది. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ తాజా పరపతి సమీక్షలో ప్రామాణిక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ, ఈ ఏడాది చివరి నాటికి వడ్డీ రేట్లను మరో రెండు సార్లు తగ్గిస్తామని సంకేతాలివ్వడం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిరవధిక అమ్మకాలకు ముగింపు పలికారన్న అంచనాలు మార్కెట్ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపాయి. గడిచిన నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2,519.15 పాయింట్లు (3.41 శాతం) బలపడగా.. స్టాక్ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17.43 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.408.62 లక్షల కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96	విజయవాడ	105
వరంగల్	96	గుంటూరు	103
కరీంనగర్	96	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	84
కర్నూలు	96	నెల్లూరు	89
విశాఖపట్నం	99	అనంతపురం	89
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,660 ▲	83,100 ▲	1,14,100 ▲
విజయవాడ	91,800 ▲	87,500 ▲	1,00,700 ▼
విశాఖపట్నం	89,080 ▲	81,680 ▲	99,500 ▼
రాజమండ్రి	90,650 ▲	83,100 ▲	1,02,700 ▼
ప్రొద్దుటూరు	90,300 ▲	83,620 ▲	1,00,700 ▼
ముంబై	88,506 ▼	81,072 ▼	98,392 ▼



ప్రధాని మోదీతో రఘునందన్ కుటుంబ సభ్యులు

మీ కుటుంబంలో అందరూ డాక్టర్లేనా?

- ఎంపీ రఘునందన్‌కు ప్రధాని సరదా ప్రశ్న
- మోదీతో రఘునందన్ కుటుంబం భేటీ

న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'మీ కుటుంబంలో అందరూ డాక్టర్లేనా?' అని ప్రధాని నరేంద్ర మోదీ.. మెదక్ ఎంపీ రఘునందన్‌రావును సరదాగా ప్రశ్నించారు. గురువారం పార్లమెంటులోని ప్రధాని కార్యాలయంలో రఘునందన్‌రావు కుటుంబసభ్యులతో మోదీని కలుసుకున్నారు. రఘునందన్ సతీమణి మంజుల, కూతురు డాక్టర్ సింధు, అల్లుడు డాక్టర్ శ్రవణ్ తేజ, మనువరాళ్లు ఖనిష్క, శిశిర, చైత్ర ఆరాత్రికతో కలిసి రఘునందన్ మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్ మనుమరాళ్లకు మోదీ చాక్లెట్‌లు ఇవ్వగా, చిన్న మనుమరాలు మోదీకి చాక్లెట్ తినిపించారు. పెద్ద మనుమరాలు సున్నితం.. చిన్న మనుమరాలు నాటీ.. అని మోదీ నవ్వుతూ అన్నారు.

కేసీఆర్.. మా ఎమ్మెల్యే మీరే గుర్తుందా ?

- సిద్దిపేట టూ రాజ్‌భవన్.. యూత్ కాంగ్రెస్ పాదయాత్ర

కొండపాక/వర్గల్, మార్చి 20: గజ్వేల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేసీఆర్ అనే విషయాన్ని.. మాజీ ముఖ్యమంత్రికి గుర్తు చేసేందుకు గజ్వేల్ యూత్ కాంగ్రెస్ నేతలు రోడ్డెక్కారు. సిద్దిపేట కలెక్టరేట్ నుంచి హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర సిద్దిపేట కలెక్టరేట్ వద్ద గురువారం ప్రారంభమైంది. తొలుత యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఇతర నేతలతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఓ వినతి పత్రం అందజేశారు. గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ కనబడటం లేదని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేరని, ఆయన ప్రజా సమస్యలు పరిష్కరించేలా చేయాలని కలెక్టర్‌ను కోరారు.

రాజీవ్ యువ వికాసం ఈబీసీలకు ఇవ్వాలి

- సీఎం రేవంత్‌కు ఈబీసీ సంక్షేమ సంఘం లేఖ

హైదరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాస పథకాన్ని అగ్రవర్ణ పేద యువతకూ వర్తింప చేయాలని ఈబీసీ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సీఎం రేవంత్‌కు సంఘం నాయకులు గురువారం లేఖ రాశారు. ఆరు వేల కోట్లతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రారంభించిన రాజీవ్ యువ వికాస పథకంలో అగ్రవర్ణ పేద యువతను విస్మరించడం బాధాకరమని సంఘం జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడి పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఎస్సీ హాస్టల్‌లో ఆహార కల్తీ.. 21 మందికి అస్వస్థత

వర్ని, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఓ ఎస్సీ బాలికల వసతిగృహంలో ఫుడ్ పాయిజన్ అయ్యి 21 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండలం కోటయ్యక్యాంపులోని ఎస్సీ బాలికల వసతిగృహంలో జరిగింది. బుధవారం మధ్యాహ్నం వసతిగృహంలో విద్యార్థినులు పప్పు చారుతో భోజనం చేశారు. గంట తర్వాత ఒక్కొక్కరుగా మొత్తం 21 మంది అస్వస్థతకు గురయ్యారు. ఆ విద్యార్థినులందరినీ వర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స అనంతరం వారందరూ కోలుకున్నారు. సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, వెంకటేష్ గురువారం వసతిగృహాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. విద్యార్థినులు చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం అనంతరం విద్యార్థులంతా చికెన్ బిర్యానీ తిన్నారు. ఆ బిర్యానీ వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని వార్డెన్ శిరీష చెబుతున్నారు. అయితే ఆ పాఠశాలలో బిర్యానీ తిన్న హాస్టల్‌లో లేని విద్యార్థులకు ఎలాంటి అనారోగ్యం కలగకపోవడం గమనార్హం.

మేడిగడ్డ ఇంజనీర్ల విచారణకు ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వ్యవహారానికి సంబంధించి ఇద్దరు ఇంజనీర్ల విచారణకు ప్రభుత్వం ఉపక్రమించింది. మేడిగడ్డ బ్యారేజీ, దాని చుట్టూ గైడ్‌బండ్ వంటి నిర్మాణాలు జరుగుతుండగానే బ్యారేజీ పూర్తయినట్లు కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన అప్పటి మహాదేవ్‌పూర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)-1 తిరుపతి రావు, అప్పట్లో రామగుండం ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న బీ రమణారెడ్డి విచారణ ఎదుర్కోనున్నారు. వీరిద్దరిపై ప్రభుత్వం ఇప్పటికే అభియోగాలు(ఆర్టికల్ ఆఫ్ చార్జెస్) నమోదు చేసింది. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌లో పని చేస్తున్న చీఫ్ ఇంజనీర్(సీఈ) అంజద్‌హుస్సేన్ నేతృత్వంలో కమిటీ ఆయా అభియోగాలపై తిరుపతిరావు, రమణారెడ్డిని విచారించనుంది.

క్యాబ్‌లు లేక ఎయిర్‌పోర్ట్‌లో స్టాండ్లు వెలవెల

- శంషాబాద్‌లో 57 వేల మంది క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

శంషాబాద్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కనీస వేతన భద్రత కల్పనతోపాటు కంపెనీ చార్జీల పెంపును నియంత్రించాలని, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి కంపెనీల డ్రైవర్లకు న్యాయమైన వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్లతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పది రోజులుగా 57 వేల మంది ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. ఫలితంగా విమానాశ్రయంలో క్యాబ్‌లు లేక ఓలా, ఉబర్ క్యాబ్‌ల స్టాండ్లు వెలవెలబోతున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, జీఎంఆర్ విమానాశ్రయ అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. పది రోజులుగా తాము ఎయిర్‌పోర్ట్ ట్రిప్‌లను బహిష్కరిస్తున్నా ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎక్స్ వేదికగా జీఎంఆర్ యాజమాన్యం స్పందిస్తూ ప్రయాణికులే క్యాబ్‌లు సమకూర్చుకోవాలని వెల్లడించిందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ముున్ముందు విమానాశ్రయానికి వచ్చే క్యాబ్‌లను పూర్తిగా నిలిపేస్తామని సలావుద్దీన్ హెచ్చరించారు.

రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు

- తేలికపాటి నుంచి మోస్తరుగా కురిసే అవకాశం
- నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కురిసిన వాన

హైదరాబాద్ సిటీ, నిర్మల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. నైరుతి మధ్యప్రదేశ్ ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం నుంచి ఒక ద్రోణి ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర ఒడిశా వరకు సగటు సముద్రమట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన నేపథ్యంలో వివిధ జిల్లాల్లో వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, కుమరంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతోపాటు మరికొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ నెల 23 వరకు సాధారణ గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని, 24 నుంచి మళ్లీ పెరుగుతాయని పేర్కొన్నారు. కాగా నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో గురువారం రాత్రి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం ఎండలు దంచికొట్టగా.. రాత్రి పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నిర్మల్‌తోపాటు ముథోల్, దిలావర్‌పూర్, ఖానాపూర్ ప్రాంతాల్లో వాన పడింది. ఉరుములు, మెరుపులతో మొదలైన వాన దాదాపు 15 నిమిషాలు కొనసాగింది. ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ వర్షం పడింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు డిచ్‌పల్లి, మాధవ్‌నగర్, మాక్లూర్, బోధన్‌లోనూ వర్షం కురిసింది. కొద్దిపాటి వాన వరి పంటకు మేలు చేయగా, మొక్కజొన్న రైతులను ఆందోళనకు గురిచేసింది.

తెలంగాణలో వచ్చేసారి అధికారం మనదే



నడ్డాను కలిసిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్, ఎంపీలు డీకే అరుణ, నగేశ్, కొండా విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మణ్, ఎమ్మెల్సీలు కొమురయ్య, అంజిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

విఫలమైందని అమిత్ షా అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గెలుపొందిన మల్కా కొమురయ్య, అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, ఎన్‌వీ సుభాష్‌లతో కూడిన బీజేపీ రాష్ట్ర ప్రతినిధుల బృందం అమిత్ షాతో ఢిల్లీలో సమావేశమైంది. వారితో పాటు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలోని ఆ పార్టీ ఎంపీలు కూడా పార్లమెంటు భవనంలో అమిత్ షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీలు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను అమిత్ షాకు వివరించారు. ఎమ్మెల్సీల గెలుపుతో ఉత్తర తెలంగాణలో బీజేపీ మరింత పట్టు సాధించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సిటింగ్ సీటును కోల్పోయిన విషయాన్ని తెలుసుకొని అమిత్ షా ఆశ్చర్యపోయారు. మరోవైపు, గురువారం సాయంత్రం తెలంగాణ ఎంపీలు, నూతన ఎమ్మెల్సీలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశం అరగంట పాటు సాగింది.

ఉగాదిలోపే కొత్త అధ్యక్షుడు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామక ప్రకటన ఉగాది లోపే వెలువడే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అమిత్ షా, నడ్డాతో ఎంపీలు, రాష్ట్ర ప్రతినిధుల భేటీ అనంతరం బీజేపీ వర్గాలు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. కాగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, ఎన్.రాంచందర్‌రావు ఉన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు మార్పు కోరుకుంటున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని బీజేపీ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య అన్నారు. నడ్డాతో భేటీ అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాలు కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తితో ఉన్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పతనానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం నాంది పలికిందన్నారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడాలని అమిత్ షా, నడ్డా సూచించినట్లు ఎమ్మెల్సీ అంజిరెడ్డి చెప్పారు.

మళ్లీ కొలువుల జాతర!

త్వరలో 55,418 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- అంగన్వాడీల్లో 14,236.. జీపీవోలు 10,954
- వివిధ శాఖల్లో 30,228 ఖాళీల గుర్తింపు
- ఈ 15 నెలల్లోనే 58,868 పోస్టుల భర్తీ
- గ్రూప్ 1, 2, 3ల్లో ఎంపికైన 2,711 మందికి
- త్వరలోనే నియామక పత్రాలు



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు శుభవార్త! రాష్ట్రంలో కొలువుల జాతర జోరందుకుంది! త్వరలో మరో 55,418 పోస్టులను భర్తీ చేసేందుకు సర్కారు రంగం సిద్ధం చేస్తోంది. వీటిలో మహిళా, శిశు సంక్షేమ శాఖలోని 6,399 అంగన్వాడీ టీచర్, 7,837 హెల్పర్ పోస్టులు, రెవెన్యూ శాఖలో 10,954 గ్రామ పరిపాలన అధికారుల (జీపీవో) నియామకాల భర్తీకి కార్యాచరణ ప్రారంభమైంది. ఇవి కాకుండా వివిధ శాఖలన్నింటిలో కలిపి మరో 30,228 పోస్టులను భర్తీ చేయాలని ఆయా శాఖల అధికారులు గుర్తించారు. వీటి భర్తీ దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు వివిధ శాఖల్లో 58,868 పోస్టులను భర్తీ చేసింది. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాలు కూడా వీటిలో ఉన్నాయి. అడ్డంకులన్నిటినీ తొలగించి రాష్ట్ర ప్రభుత్వం వీటిని భర్తీ చేయడం విశేషం. అలాగే, గ్రూప్-1, 2, 3ల్లో ఎంపికైన 2,711 మందికి త్వరలోనే నియామక పత్రాలు ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియ కూడా పూర్తయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 15 నెలల కాలంలోనే 61,579 పోస్టులను భర్తీ చేసినట్లు అవుతుంది. ఇక, 55,418 పోస్టులకూ నోటిఫికేషన్లు ఇచ్చి వాటిని కూడా భర్తీ చేస్తే.. నియామకాల సంఖ్య 1.16 లక్షలను దాటనుంది. నిజానికి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ వయసును 65 ఏళ్లుగా నిర్ణయించడంతో రిటైర్ అయ్యేవారి స్థానంలో కొత్తవారిని నియమించడంతోపాటు ఖాళీ స్థానాలను కూడా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అర్హతలు కలిగిన హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి కల్పించనున్నారు. మొత్తంగా 14,236 పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైలుపై ఆ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే సంతకం చేశారు కూడా. దాంతో త్వరలోనే ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ కానున్నాయి. అలాగే, గ్రామ పరిపాలన అధికారి (జీపీవో) పేరుతో 10,954 పోస్టులను భర్తీ చేయాలని ఇటీవల నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. వీటి భర్తీ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. అయితే, గతంలో వీఆర్వోలుగా పని చేసి ప్రస్తుతం వివిధ శాఖల్లో ఉంటున్న వారిలో దాదాపు 6000 మందిని ఇప్పుడు జీపీవోలుగా నియమించనున్నారు. మిగిలిన 4 వేలకుపైగా పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయనున్నారు. ఇక, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్కిల్ యూనివర్సిటీ, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ ఇనిస్టిట్యూట్‌లను ఏర్పాటు చేయడంతోపాటు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా మార్చింది. వీటిలో అవసరమైన పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. అలాగే, ఆర్థిక, న్యాయ శాఖ, సచివాలయం, సమీకృత గురుకులాలు తదితరాలన్నిటిలో కలిపి దాదాపు 30,228 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుందని ఆయా శాఖలు ఇప్పటికే గుర్తించి, ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. వీటి భర్తీకి ఆర్థిక శాఖతో చర్చలు జరిపి ఆ తర్వాత శాఖల వారీగా నోటిఫికేషన్లు జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఇప్పటి వరకు భర్తీ చేసిన పోస్టులు

వ్యవసాయ, సహకార శాఖ	208
పశు సంవర్ధక, మత్స్య, డెయిరీశాఖ	173
బీసీ సంక్షేమ శాఖ	5,578
మైనార్టీ సంక్షేమం	1584
ఎస్సీ సంక్షేమం	2,235
ఇంధన శాఖ	850
వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ	7,517
ఉన్నత, సాంకేతిక విద్య	3,893
హోం శాఖ	15,526
నీటిపారుదల శాఖ	1,235
పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ	3,148
రెవెన్యూ శాఖ	2,696
ఆర్ అండ్ బీ	442
విద్యా శాఖ	10,209
ఎస్టీ సంక్షేమ శాఖ	1,290
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	722,
ఉపాధి కార్మిక శాఖ	128
ఇతర శాఖలు	512

నెలల సమయంలోనే నోటిఫికేషన్లు, భర్తీలు

గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 పరీక్షకు నోటిఫికేషన్లు విడుదల చేసినా.. ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయన్న కారణంగా రెండుసార్లు రద్దయ్యాయి. ఆ తర్వాత ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పోస్టుల సంఖ్యను పెంచి 563 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇక, గ్రూప్-2 పోస్టుల భర్తీకి కూడా గత ప్రభుత్వ హయంలోనే నోటిఫికేషన్ ఇచ్చినా.. వివిధ కారణాలతో రద్దయింది. వీటికి మరికొన్ని పోస్టులను జత చేసి 783 గ్రూప్-2 ఖాళీల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇక, గ్రూప్-3 కింద 1,365 పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించింది. ఫలితంగా, గ్రూప్-1, 2, 3ల్లో మొత్తం 2,711 పోస్టులకు వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయడమే కాకుండా నెలల సమయంలోనే ఫలితాలనూ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వడమే తరువాయి. మరోవైపు, వివిధ శాఖల్లో 922 పోస్టులకు సంబంధించి గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. వీటిలో 582 పోస్టులు కారుణ్య నియామకాలు కావడం గమనార్హం.

అధికారం పోయిందన్న అక్కసుతోనే బీఆర్ఎస్ విషప్రచారం

ఆ పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్



హుజూర్‌నగర్/మఠంపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయిందన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై బురదజల్లుతూ సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి క్షేత్రంలోని ఆర్యవైశ్య సత్రంలో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి ఉత్తమ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తుపైనా బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసేందుకే కొందరు నాయకులు పర్యటనలు చేస్తున్నారని కేటీఆర్‌ను పరోక్షంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అన్నివర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందని వివరించారు. ఉగాది రోజున సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్ రెడ్డిని మట్టపల్లి క్షేత్రానికి ఆహ్వానించామని చెప్పారు. సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉందన్నారు. ఉగాది సందర్భంగా ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల నాణ్యమైన బియ్యం అందిస్తామని చెప్పారు. అంతకముందు మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో మంత్రి ఉత్తమ్ పాల్గొన్నారు. అనంతరం సీఎం సభకు స్థలాన్ని పరిశీలించారు.

ఏపీలో ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్!?

మండలిలో వైసీపీ సహాయ నిరాకరణ

వ్యూహం మార్చిన పాలక పక్షం

సభ ప్రోరోగ్ కాగానే ఆర్డినెన్స్

అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణపై చట్టసభల్లో తీర్మానం చేయకుండా వైసీపీ కుయుక్తులు పన్నింది. మండలిలో తనకున్న బలాన్ని అడ్డుపెట్టుకుని వర్గీకరణ ప్రక్రియకే బ్రేకులు వేయాలని భావించింది. ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీ, మండలిలో ప్రవేశపెట్టి.. తీర్మానం ఆమోదించి కేంద్ర ఎస్సీ కమిషన్ ఆమోదం పొంది వర్గీకరణ అమలు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. మండలిలోనూ ఈ ప్రక్రియ సాఫీగా సాగడం కోసం ప్రభుత్వం తరఫున కొందరు ప్రతినిధులు బుధవారమే మండలి చైర్మన్ మోషేన్ రాజును కలిశారు. ఎస్సీ వర్గీకరణపై మండలిలో తీర్మానాన్ని ఆమోదించేందుకు ఆయన అంగీకరించలేదని తెలిసింది. దీంతోపాలక పక్షం వ్యూహం మార్చింది. శాసనసభలోనూ దీనిపై తీర్మానం ప్రవేశపెట్టలేదు. మిశ్రా కమిషన్ నివేదికను సభ ముందుంచి, దానిపై లఘు చర్చ జరుపుతున్నట్లు అజెండాలో పేర్కొన్నారు. ఈ నివేదికను హోంమంత్రి అనిత మండలిలో ప్రవేశపెట్టారు. తీర్మానం ఆమోదించాలని కోరారు. చైర్మన్ మోషేన్ రాజు 'దీనిపై చర్చ లేదు' అని తేల్చేశారు. మండలిని వాయిదా వేసి వెళ్లిపోయారు. వైసీపీ కుయుక్తిని గ్రహించిన పాలకపక్షం.. ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ అమలుకు రంగం సిద్ధం చేసింది. అసెంబ్లీ ప్రోరోగ్ కాగానే ఆర్డినెన్స్ తీసుకొచ్చి వర్గీకరణ అమలు చేయనుంది.

వచ్చే ఏడాది పాదయాత్ర!



(మొదటిపేజీ తరువాయి)

సూర్యాపేటలో జరిగిన సభలోనూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్.. కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని కోరారు. ఆ సమయంలో కార్యకర్తలు చప్పట్లు కొట్టగా కేటీఆర్ తల ఊపారు. కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘకాలం పాదయాత్ర చేపడతారని, అందుకోసం పార్టీ ఆవిర్భావ దినోత్సవం తర్వాత శారీరక దృఢత్వంపైనా దృష్టి పెట్టనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. సూర్యాపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో సాగు నీరందక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు. కేసీఆర్‌పై కోపంతో కావాలనే కాళేశ్వరాన్ని ఖాళీ చేసి పంటలు ఎండిపోయేలా చేశారన్నారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ద్వారా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని సుమారు 2.50లక్షల ఎకరాలకు రెండు పంటలకూ నీళ్లిచ్చారని గుర్తుచేశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ సూర్యాపేట జిల్లాకు చెందిన వాడైనా ఎందుకు నీళ్లివ్వడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణా జలాలను 36శాతం వాడుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి 24శాతం కూడా వాడుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను లేకుండా చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్ర పన్నుతున్నాయని అన్నారు. సీఎం రేవంత్‌ను కాపాడుతున్నది బండి సంజయ్, కిషన్‌రెడ్డి అని ఆరోపించారు. అవినీతిపై ఆధారాలతో కేంద్రానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

నాడు ఎన్టీఆర్.. నేడు కేసీఆర్

తెలుగు వారి కోసం నాడు ఎన్టీఆర్ పోరాడితే.. తెలంగాణ కోసం నేడు కేసీఆర్ పోరాడారని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ కోసం 2001లో కేసీఆర్ మంత్రి పదవులను వదులుకొని ఒక్కడే పార్టీని ఏర్పాటు చేశారన్నారు. కేసీఆర్ 14 ఏళ్ల తెలంగాణ కోసం అన్నివర్గాల ప్రజలనూ ఏకం చేశారని తెలిపారు. శూన్యం నుంచి సునామీని సృష్టించిన మొనగాడు కేసీఆర్ అని.. ఆయన ఆనవాళ్లు చెరిపివేయడం ఎవరికీ సాధ్యం కాదని చెప్పారు.భూమికి మూడు ఫీట్లు లేనోడు, కేసీఆర్ మోకాళ్ల ఎత్తు లేనోడు ఆయన్ని ఉద్దేశించి అసెంబ్లీలో ఇష్టానుసారం మాట్లాడడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ రాక ముందు ఎకరం భూమి ధర రూ.3-5లక్షల వరకు ఉంటే వచ్చాక రూ.20-50 లక్షల వరకు పెరిగిందన్నారు. దీంతో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు బాగా సంపాదించారనే అసూయ ప్రజలకు కలిగిందని.. అలాగే కేసీఆర్ కుటుంబంలోనే ఎక్కువ మందికి పదవులు వచ్చాయని, వారే బాగుపడ్డారంటూ విష ప్రచారం చేశారని చెప్పారు. చిన్న వయసులో రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడని, అతనికి అదృష్టం కలిసి వచ్చిందని అన్నారు. ఇప్పుడైనా పర్సనాలిటీ పెంచుకుంటాడనుకుంటే పర్సంటేజీలు పెంచుకుంటున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దళితుల పక్షపాతి అన్నారు. కావాలనే ఆయన్ను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని మండిపడ్డారు. మజ్లిస్ ఎమ్మెల్యే అసెంబ్లీని గాంధీభవన్ లెక్క నడిపితే బాగుండదంటే వారినేమీ అనలేదని, అంత ధైర్యం కూడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే సభను చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాలని అన్నారు. ఆ సభకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మేలో పార్టీ సభ్యత్వ నమోదు ఉంటుందన్నారు. ఆ తర్వాత పార్టీ కమిటీలను నియమిస్తామని చెప్పారు.

పాదయాత్ర చేస్తే వెంట నడుస్తాం

కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్ పాదయాత్ర చేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. అవసరమైతే పాదయాత్రను కోదాడ నుంచే ప్రారంభించాలన్నారు. పాదయాత్ర పొడవునా రామబంటు హనుమంతుడి సైన్యంలాగా తాము వెంట నడుస్తామని చెప్పారు.

బీసీ బిల్లు చట్టమయ్యేలా చూడండి

రాహుల్ గాంధీ నేతృత్వం వహించాలి

వేణుగోపాల్‌కు కాంగ్రెస్ ఎంపీల విన్నపం

న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్ట రూపం దాల్చేలా కృషి చేయాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కాంగ్రెస్ రాష్ట్ర ఎంపీలు కోరారు. ఇందుకోసం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వం వహించాలని, ఈ దిశగా చొరవ తీసుకోవాలని ఆయనకు విన్నవించారు. పార్లమెంట్‌లోని కేసీ వేణుగోపాల్ కార్యాలయంలో ఆయనను ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్. రఘురామ్ రెడ్డి, సురేష్ షెట్కర్, బలరాం నాయక్, కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ కలిశారు. ఆ తర్వాత ఎంపీలు మల్లు రవి, కిరణ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తాము, పార్టీ ఎమ్మెల్యేలు అందరం రాహుల్ గాంధీని కలవాలనుకుంటున్నామని చెప్పామని, పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీల మద్దతు కూటగట్టడంలో సహకరించాలని విన్నవించగా.. కేసీ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ అంశంపై రాహుల్ గాంధీతో చర్చిస్తానని, ఆ తర్వాత ఆయనతో ఎప్పుడు భేటీ కావాలో నిర్ణయిద్దామని కేసీ చెప్పినట్లు తెలిపారు. మరోవైపు.. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగానికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కాంగ్రెస్ ఎంపీలు కోరారు. కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు.

డప్పు కొట్టి, స్వీట్లు పంచి...

అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలపడంపై కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలో సంబరాలు నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ నేతృత్వంలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవితో పాటు కాంగ్రెస్ శ్రేణులు డప్పు కొడుతూ, స్వీట్లు పంచుతూ హర్షం వ్యక్తం చేశారు.



కేసీ వేణుగోపాల్‌ను కలిసిన ఎంపీలు చామల, మల్లు రవి, కావ్య, బలరాం నాయక్, రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, వంశీకృష్ణ

రికార్డుస్థాయిలో విద్యుత్ డిమాండ్

- 17,162 మెగావాట్లుగా నమోదు
- రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి
- కోతల్లేకుండా సరఫరా: భట్టి



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గురువారం సాయంత్రం 4.39 గంటలకు విద్యుత్ డిమాండ్ ఏకంగా 17,162 మెగావాట్లకు చేరుకుని కొత్త రికార్డును సృష్టించింది. రాష్ట్ర చరిత్రలో విద్యుత్ డిమాండ్ 17వేల మెగావాట్లు దాటడం ఇదే తొలిసారి. గతేడాది ఇదే రోజున రాష్ట్రంలో గరిష్ఠంగా 13,557 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. గతేడాది మార్చి 8న నమోదైన 15,523 మెగావాట్ల గరిష్ఠ డిమాండే ఈ ఏడాది ప్రారంభం వరకు అత్యధికం కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 5న డిమాండ్ 15,752 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు సృష్టించింది. ఆ తర్వాత డిమాండ్ రోజురోజుకూ పెరగడంతో కొత్త రికార్డులు నమోదయ్యాయి. ఈ నెలలో రోజువారీ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 16వేల మెగావాట్లకు మించి నమోదవుతోంది. ఈ నెల 18న 335.19 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో కూడా గురువారం 11,017 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. కాగా, రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 17 వేల మెగావాట్లు దాటినా రెప్పపాటు విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెచ్చిన సంస్కరణలతో ఇది సాధ్యమైందన్నారు.

కాళేశ్వరం అదనపు టీఎంసీ..
డీపీఆర్‌ను మళ్లీ పంపించండి: సీడబ్ల్యూసీ

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన అదనపు టీఎంసీ నీటి తరలింపు ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌ను పరిశీలిస్తామని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను మళ్లీ పంపించాలని లేఖ రాసింది. కాళేశ్వరంలో అదనపు టీఎంసీ ప్రాజెక్టుకు అనుమతి లేదని, ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను పరిశీలించలేమని చెప్తూ.. సీడబ్ల్యూసీ ఇటీవలే ప్రాజెక్టు డీపీఆర్‌ను వెనక్కి పంపించింది. అయితే, ఈ ప్రాజెక్టు విషయంలో సీడబ్ల్యూసీ లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి సమగ్రమైన లేఖ రాసింది. ఆ లేఖలోని అంశాలతో సంతృప్తి చెందిన సీడబ్ల్యూసీ.. ప్రాజెక్టు డీపీఆర్‌ను మళ్లీ పంపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. బెనిఫిట్ కాస్ట్ రేషియో(ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు, తిరిగి వచ్చే ఆదాయానికి మధ్య నిష్పత్తి) వివరాలను తెలియజేయాలని, ఇందుకు తగిన ఆధారాలను కూడా సమర్పించాలని సూచించింది. ఈ డీపీఆర్‌కు ఆమోదం లభిస్తే.. 2021లో కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ప్రాజెక్టుల గెజిట్‌లో 'అనుమతి లేని ప్రాజెక్టుల జాబితా'లో నుంచి కాళేశ్వరం అదనపు టీఎంసీని తొలగించే అవకాశాలున్నాయి. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ గోదావరి నదీ యాజమాన్యబోర్డు(జీఆర్ఎంబీ)కి అప్పగించాలని కోరుతూ 2021 జూలై 15వ తేదీన కేంద్రం గెజిట్ జారీ చేసింది. ఆ గెజిట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టును ఒక కాంపోనెంట్‌గా, కాళేశ్వరంలో భాగంగా ఆ తర్వాత చేపట్టిన అదనపు టీఎంసీని మరో కాంపోనెంట్‌గా గుర్తిస్తూ.. అదనపు టీఎంసీకి అనుమతి లేదని కేంద్రం తెలిపింది.

వ్యవసాయ అభివృద్ధికి ప్రణాళిక అవసరం: తుమ్మల


జర్మనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, జర్మనీ ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కొత్త ప్రణాళికలు చేపట్టాల్సిన అవసరం ఉందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిరిసిల్ల జిల్లా వేములవాడలో పైలట్ ప్రాతిపదికన హెచ్‌హెచ్ఐ, జర్మనీ సంస్థ సహకారంతో చేపడుతున్న పరిశోధనల్లో భాగంగా... 3 ఆహారశుద్ధి యూనిట్ల నుంచి 55 మంది రైతులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయంలో గురువారం జర్మన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికత, మార్కెటింగ్, డిజిటల్ వ్యవసాయ అభివృద్ధి, కూలీల ఖర్చు తగ్గింపు, దిగుబడి పెంపు, డ్రోన్లతో నేలసారాన్ని పరీక్షించటం, వాతావరణ పరిస్థితులపై అధ్యయనం వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. జర్మనీ ప్రభుత్వంతో కలిసి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, అగ్రి-హబ్ అధికారులకు సూచించారు. తెలంగాణ రైతులను జర్మనీ పంపించి శిక్షణ ఇప్పించాల్సి ఉందని అన్నారు.

కేటీఆర్ తండ్రి చాటు బిడ్డ

» ప్రభాకర్‌రావు అమెరికా నుంచి రాగానే కేసీఆర్ కుటుంబ సభ్యులందరూ జైలుకే: మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ అంటే ఎవరో ప్రజలకు కూడా తెలియదని, ఆయన తండ్రి చాటు బిడ్డ అని, ఆయన తమలాగా ప్రజల నుంచి వచ్చిన నాయకుడు కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ అమెరికాలో చదువుకుని ఇక్కడ ఇంగ్లిష్ మాట్లాడుతూ హీరో అనుకుంటున్నాడని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను బొందపెట్టారని, ఆ పార్టీకి 11 స్థానాల్లో డిపాజిట్లు కూడా రాలేదన్నారు. కేటీఆర్ సూర్యాపేటలో సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఖండించారు. ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సూచించారు. అప్పటి ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావు అమెరికా నుంచి వచ్చిన వెంటనే కేసీఆర్ కుటుంబ సభ్యులంతా జైలుకు పోవడం ఖాయమన్నారు. శ్రీశైలం సొరంగం పనులు తాత్కాలికంగా ఆగినా.. నాలుగైదు నెలల్లో నూతన ప్రణాళికతో ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో రైతులు
మంత్రుల కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు: అడ్లూరి

హైదరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల హయాంలో పంట పొలాలు ఎండిపోతే ఒక్కరూ మాట్లాడలేదని, రైతులు ఆనాటి మంత్రుల కాళ్ళు పట్టుకున్నా కనికరించలేదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. ఆ పదేళ్ల కాలంలో కల్వకుంట్ల కుటుంబానికి తప్ప ఎమ్మెల్యేలు, మంత్రులకు ఏమైనా పవర్ ఉండేదా? అని ప్రశ్నించారు. అప్పట్లో కేటీఆర్, హరీశ్‌రావు వారిని వారు రాజులు, మంత్రులుగా ఊహించుకుని రైతుల సమస్యలను అసలు పట్టించుకోలేదని ఆరోపించారు.

ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో మార్పులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లేఅవుట్ రెగ్యులరైజేషన్ పథకం (ఎల్ఆర్ఎస్)లో తలెత్తిన సాంకేతిక లోపాలపై ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి'లో 'ఎల్ఆర్ఎస్ షార్ట్‌ఫాల్ పత్రాలు అప్‌లోడ్ కావట్లే..' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి పురపాలక శాఖ అధికారులు స్పందించారు. పత్రాల అప్‌లోడ్, రుసుం నిర్ధారణలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను సరిదిద్దామని డీటీసీపీ దేవేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకునేలా దరఖాస్తు ప్రాసెసింగ్ విధానంలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. కొత్త విధానంలో దరఖాస్తుదారు తొలుత ఫీజు చెల్లించాక క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం అనుమతుల మంజూరు ఉంటుందని, ఈ మార్పుల వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయని, దీంతో వెబ్‌సైట్‌లో సవరణలు చేశామన్నారు. ఫీజు నిర్ధారణలో ఎక్కడైనా వ్యత్యాసం ఉన్నట్లు దరఖాస్తుదారులు గుర్తిస్తే సవరణ చేసే అధికారం సంబంధిత అధికారులకు ఇచ్చినట్లు వివరించారు. సిటిజన్ లాగిన్‌లోనూ దరఖాస్తును ట్రాక్ చేయడం, ఫీజు ఇంటిమేషన్ లేఖ కనిపించేలా మార్పులు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

» హాజరుకానున్న 5,09,403 మంది

» విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శుక్రవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల నిర్వహణకు 2,650 కేంద్రాలు ఏర్పాటు చేశామని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలకు 5,09,403 మంది విద్యార్థులు హాజరుకానుండగా, వారిలో 2,58,895 మంది బాలురు, 2,50,508 మంది బాలికలు ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లో తలెత్తే సమస్యలు, విద్యార్థుల విజ్ఞప్తుల స్వీకరణకు జిల్లా, రాష్ట్రస్థాయిలో 24 గంటలూ పని చేసే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని ఈవీ నరసింహా రెడ్డి చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్ కేటాయించినట్లు వెల్లడించారు. సజావుగా పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్షల విధుల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 28,100 మంది ఇన్విజిలేటర్లు, 2,650 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 2,650 మంది శాఖ అధికారులను నియమించామని తెలిపారు. శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో గురువారం సికింద్రాబాద్‌లోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌ను పాఠశాల విద్య సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారెడ్డి, హైదరాబాద్ డీఈఓ రోహిణి సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు.

పంచుకు తింటేే పట్టు వచ్చినట్లా!?

ఉత్తరాది వాళ్లు ఉద్యోగాల కోసం వస్తున్నారేం!?

దేశంలో అభివృద్ధి అంతా హైదరాబాద్, చెన్నై, బెంగుళూరుకు చేరింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ఉద్యోగావకాశాల కోసం దక్షిణాది రాష్ట్రాలకు వస్తున్నారు. దేశాన్ని అభివృద్ధి చేశామని ప్రధాని మోదీ చెబుతున్నారు. పదేళ్లు ప్రధానిగా చేశారు. వేరే ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం మీ దగ్గరకు ఎందుకు రావడం లేదు. అభివృద్ధి మేం సాధించినట్లా..? మీరు సాధించినట్లా.. మోదీ నా ప్రశ్నకు సమాధానం చెప్పాలి.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


కొలువుల పండుగ కార్యక్రమంలో 'బిల్డ్ నౌ' పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి సీతక్క, సీఎస్ శాంతికుమారి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారని, ప్రతి రోజూ 18 గంటలు పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉన్న తనకు పట్టు రాలేదని అంటున్నారని విమర్శించారు. అప్పుడూ ఇప్పుడూ అధికారులు వాళ్లేనని, వ్యవస్థ కూడా అదేనని, మారింది కేవలం 11 మంది మంత్రులు మాత్రమేనని తెలిపారు. అప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తదితరులు ఉంటే.. ఇప్పుడు రేవంత్, సీతక్క, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు తదితరులు ఉన్నారని చెప్పారు. మరి మేం ఎక్కడ విఫలమయ్యామని నిలదీశారు. కొలువుల పండుగ పేరిట రవీంద్ర భారతిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖలో 588 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అదేవిధంగా పురపాలక శాఖ, మిషన్ భగీరథ విభాగాల్లో పలు ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు. 'బిల్డ్ నౌ' పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. "నేను రాజకీయాల్లోకి వచ్చి 20 ఏళ్లు దాటింది. సీఎం అయ్యారు కదా మారాలంటున్నారు. హుందాగా వ్యవహరించాలంటున్నారు. నేను హుందాగా వ్యవహరిస్తే.. అర్థం చేసుకునే వాళ్లు ఉండాలి కదా..?" అని వ్యాఖ్యానించారు. జానారెడ్డి పెద్ద మనిషిలా హుందాగా వ్యవహరించారని, ధృతరాష్ట్ర కౌగిలితో కేసీఆర్ ఆయన గౌరవాన్ని మంటగలిపారని ఆరోపించారు. మీ పాలనలో కోదండరామ్ తలుపులు పగులగొట్టించారని, మీలాగే మేం కూడా పోలీసులను ఆదేశిస్తే.. ఇళ్లలో నుంచి బయటకు రానీయకుండా తాళమేసి ఒంగోబెట్టి దంచరా? అని ప్రశ్నించారు. కేటీఆర్ తలుపులు పగులగొట్టి వీపులు వలగ దంచరా? అని మండిపడ్డారు. "పోలీసులకు మీరు చెప్పారు. నేను చెప్పలేదు. అలాంటి విధానానికి మేం వ్యతిరేకం. గడీల్లో దొరల్లాగా పెరగకపోవచ్చు. మాకు మానవత్వం ఉంది. మీకు అది లేదు. నేను విజ్ఞతను ప్రదర్శిస్తున్నా. అది మీరు చూపలేదు. మీకు మాకు అదే తేడా" అని స్పష్టం చేశారు.

ప్రజలకు నాపై కోపమెందుకు?

తనపై అన్ని వర్గాల ప్రజలు కోపంగా ఉన్నారని ప్రచారం చేస్తున్నారని, రుణ మాఫీ చేసినందుకు రైతులు, ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించినందుకు ఆడబిడ్డలు, 57 వేల ఉద్యోగాలు కల్పించినందుకు నిరుద్యోగులు కోపంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. ఎస్‌హెచ్‌జీ సంఘాలకు ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుదుత్పత్తి కాంట్రాక్టు ఇస్తున్నందుకు కోపంగా ఉంటారా? అని ప్రశ్నించారు. అడ్డగోలుగా సంపాదించారని, ఆ డబ్బుతో ఇప్పుడు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నల్లధనాన్ని వాట్సాప్ వర్సిటీలో పెట్టుబడిగా పెట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అందాల పోటీలు హైదరాబాద్‌లో ఎందుకని ఒకాయన అంటున్నారని, ఆయన బాధ అర్థం కావడం లేదు కానీ.. హైదరాబాద్‌కు, పర్యాటక రంగానికి ఇది అందివచ్చిన అవకాశమని చెప్పారు. 140 దేశాలకు చెందిన ప్రతినిధులు, 3000 చానళ్లు, పత్రికల ప్రతినిధులు రానున్నారని, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తారని, తద్వారా, ప్రపంచంలోనే హైదరాబాద్ ల్యాండ్ మార్క్ కానుందని స్పష్టం చేశారు. ఇంత మంచి సందర్భం వస్తే అభినందించాల్సిందిపోయి విమర్శలు చేయడం తగదని అన్నారు. "ఫార్ములా ఈ రేస్ ముసుగులో ప్రభుత్వ డబ్బులు కొల్లగొట్టావ్ సామీ.. ఉద్యమం ముసుగులో ఉన్నదంతా ఊడ్చుకుపోయే ఆలోచనలో మీరున్నారు. ప్రజాకోణంలో వారి సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచనలో నేనున్నా. మీకు, నాకు తేడా ఇదే" అని వ్యాఖ్యానించారు.

11 శాతం వడ్డీతో అప్పులు తెచ్చారు..

"ప్రాజెక్టు డీపీఆర్ సమర్పిస్తే.. నాలుగైదు శాతం వడ్డీతో రుణాలిచ్చే సంస్థలు చాలా ఉన్నాయి. కానీ, కమీషన్ల కోసం.. డీపీఆర్ ఇస్తే దొంగతనం బయటపడుతుందని ఇంతకు ముందాయన 11 శాతం వడ్డీతో అప్పులు తెచ్చారు. దీనిపై నేను ఢిల్లీ వెళ్లి.. కాళ్లా వేళ్లా పడి దానిని 5 శాతం వడ్డీకి రీస్ట్రక్చర్ చేయించాను" అని సీఎం రేవంత్ చెప్పారు. ఇతర అప్పులనూ ఇలాగే పునర్వ్యవస్థీకరణ చేయిస్తున్నానన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షన్నర కోట్ల అప్పు కూడా 11 శాతం వడ్డీతో తెచ్చారని మండిపడ్డారు. తెలంగాణ పేరు గొప్పగా ఉందని, కానీ ఇప్పుడు అప్పు పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లలో 8 లక్షల కోట్ల అప్పు చేశారని, ఏడాదిలోనే తాను 88 వేల కోట్ల అసలు; 64 వేల కోట్ల మిత్తి కలిపి రూ.1.53 లక్షల కోట్లు చెల్లించాల్సి వచ్చిందని వివరించారు. ఆ డబ్బులే ఉంటే 75 లక్షల మంది రైతులకు రుణ మాఫీ, 30 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఇళ్లు కట్టించేవాడినని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు పెంచి రూ.8 వేల కోట్ల బకాయిలు పెట్టి పోయారని, వారి బాధలు చూసి నెలకు రూ.200 కోట్ల చొప్పున సర్దుబాటు చేస్తున్నానని చెప్పారు. ఇసుకలో అవినీతికి పాల్పడి రూ.7000 కోట్లు దోచేశారని, తాము ఆన్‌లైన్ విధానం పెట్టి ఇంటికే ఇసుక వచ్చేలా చేశామని, ప్రభుత్వానికి ఆదాయమూ పెరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం రికార్డుల్లో చేర్చకుండా పెద్దోళ్ల నిర్మాణాలకు అడ్డదారిలో అనుమతులిచ్చిందని, భూమి చెరువులో ఉందా? నాలాలో ఉందా!? ప్రభుత్వానిదా? ప్రైవేటుదా అని చూడకుండా ఆమోదం తెలిపిందని తప్పుబట్టారు. తాము తీసుకొచ్చిన బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా ఎంత పెద్దోడయినా నిబంధనల ప్రకారం నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవలసిందేనని చెప్పారు.

నోటిఫికేషన్లు ఇచ్చి ఆపేశారు

తాము నోటిఫికేషన్లు ఇచ్చామని, వాటినే రేవంత్ రెడ్డి భర్తీ చేస్తున్నాడని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, కానీ, నోటిఫికేషన్లు ఇచ్చి దొడ్డిదారిన వాటిపై కేసులు వేయించి భర్తీ చేయకుండా ఆపేశారని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. కొన్నిటికి పరీక్షలు నిర్వహించకుండా.. ఫలితాలు విడుదల చేయకుండా.. కోర్టు చిక్కుముడుల్లో ఇరుక్కోవడంతో నియామకాలు నిలిచిపోయాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్నే ప్రధాన సమస్యగా తీసుకుని 15 నెలల్లోనే 57,924 ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని వివరించారు. 30, 40 రోజుల్లోనే గ్రూప్ 1, 2, 3 నియామకాలను పూర్తి చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ వాళ్లు ఉద్యోగాలు ఇవ్వలేదని, తాను పని చేయకుండా కాళ్లల్లో కట్టెలు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు.

నాలో మానవత్వం ఉంది

"కారుణ్య నియామకాలు మీ హక్కు. గత ప్రభుత్వం వీటిని చేపట్టకపోవడంతో మీరు పదేళ్లు నష్టపోయారు. వాళ్లలో మానవత్వం లేదు. నాలో ఉంది. కాబట్టే.. జాబ్ క్యాలెండర్‌తోపాటు కారుణ్య నియామకాలు కూడా చేపట్టాలని నిర్ణయించా" అని సీఎం రేవంత్ అన్నారు. కేసీఆర్ బిడ్డ, బంధువు ఎన్నికల్లో ఓడిపోతే ఆరు నెలలు తిరక్కుండానే కారుణ్య నియామకాలు ఇచ్చుకున్నారని, కానీ, 20, 30 ఏళ్లు ప్రభుత్వానికి సేవ చేసి మరణించిన వారి కుటుంబాల్లోని పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్న సోయి వాళ్లకు లేదని దుయ్యబట్టారు. కేసీఆర్ నిర్లక్ష్యం చేసిన వాటిపై దృష్టిపెట్టి.. పేద కుటుంబాల్లో ఆనందం కలిగించేందుకు పాటుపడుతున్నామని చెప్పారు.

టెంపర్‌మెంట్‌లో తగ్గేదే లేదు

"తొలిసారి ఉద్యోగ నియామక పత్రం పొందడం, బాధ్యతలు చేపట్టడం మధుర జ్ఞాపకం. నేను కూడా తొలిసారి జడ్పీటీసీగా గెలిచి బాధ్యతలు చేపట్టినప్పుడు ఎంతో ఆనందమేసింది. సీఎం అయినప్పటి కంటే అప్పుడే ఎక్కువ సంతోషం పొందా" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారు ప్రజల కోసం పని చేయాలని, ప్రభుత్వ ఉద్యోగి 30 ఏళ్లలో గరమ్, నరమ్, బేషరమ్‌గా మారతారన్న నానుడిలోకి చేరవద్దని సూచించారు. అందరిలా కాకూడదనే 20 ఏళ్లయినా రాజకీయాల్లో తన టెంపర్‌మెంట్ మార్చుకోలేదని, మొదటి రోజు నుంచీ నైపుణ్యాలు పెంచుకుంటున్నానని, టెంపర్‌మెంట్‌లో మాత్రం ఏమాత్రం తగ్గేదేలేదని చెప్పారు.

నాడు కేసీఆర్‌కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయి: సీతక్క

హైదరాబాద్ సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా 57 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఘనత ఒక్క రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని మంత్రి సీతక్క కొనియాడారు. ప్రజాక్షేత్రంలో ఓడిపోయిన కుటుంబ సభ్యులకు కేసీఆర్ కొలువులు ఇచ్చారే గానీ కారుణ్య నియామకాలు చేపట్టి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పించలేదని, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. గురువారం రవీంద్రభారతి వేదికగా ప్రజాపాలనలో కొలువుల పండుగ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన మంత్రి సీతక్క మాట్లాడారు. కాగా, ప్రజాపాలనలో కొలువుల పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖలలో మొత్తం 922 మందికి నియామక పత్రాలు అంజేశారు. ఇందులో 588 కారుణ్య నియామకాలు ఉన్నట్లు ప్రతినిధులు తెలిపారు.


తైపీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ సూర్యకాంత్ శర్మ

ఫ్యూచర్ సిటీలో తైవాన్ పారిశ్రామిక పార్కు

» 2వేల కోట్ల పెట్టుబడులకు సంస్థలు ఓకే

» 'తైవాన్' సదస్సులో రాష్ట్రంతో ఒప్పందం

» 10వేల మందికి ఉపాధి : మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తైవాన్‌కు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల సమూహం (ఎలీజియన్స్ గ్రూప్) ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. రూ.2వేల కోట్లతో ప్రపంచస్థాయి సాంకేతిక, పారిశ్రామిక పార్క్ (ఐటీపీ) ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. తైవాన్ రాజధాని తైపీలో జరుగుతున్న తైవాన్-భారత ఆర్థిక సదస్సులో తెలంగాణ నుంచి ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ సూర్యకాంత్ శర్మ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలీజియన్స్ గ్రూప్‌నకు చెందిన 11 ప్రముఖ సంస్థలు ఐటీపీలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో గురువారం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు 250 ఎకరాలను కేటాయిస్తే.. వెంటనే పనులు ప్రారంభిస్తామని తైవాన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నిపుణులను అందుబాటులో ఉంచుతామన్న మంత్రి శ్రీధర్ బాబు సందేశాన్ని రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ సూర్యకాంత్ శర్మ తైవాన్ ప్రతినిధులకు వివరించారు. తెలంగాణలో ప్రతిభావంతులైన మానవ వనరుల లభ్యతతో అత్యంత అనుకూల పారిశ్రామిక వాతావరణం ఉందని తైవాన్ ప్రతినిధుల గ్రూప్ చైర్మన్ సైమోన్‌లీ పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రంలో పర్యటించి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకు తమ అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్ కంపెనీలు ఆసక్తి చూపడంపై మంత్రి శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. తాజా ఒప్పందాలతో 10వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో 24న పార్లమెంట్ ముట్టడి

యూజీసీ ముసాయిదా బిల్లును తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో 24న పార్లమెంట్‌ను ముట్టడించబోతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ నుంచి 400 మందికి పైగా విద్యార్థులు పార్లమెంట్ ముట్టడికి తరలిరానున్నారని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో పార్లమెంట్ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ విద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

సత్వరంగా భవన నిర్మాణ అనుమతులు

» దరఖాస్తు చేసిన ఐదు నిమిషాల్లోనే స్థల పరిశీలన

» పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్

» బిల్డ్ నౌ పోర్టల్‌ను ఆవిష్కరించిన సీఎం

» ఆ వెంటనే ఆన్‌లైన్‌లో భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి అనుమతి

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతులను పొందే విషయంలో సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలకు చెక్ పెట్టడంతో పాటు ఆ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ 'బిల్డ్ నౌ' పోర్టల్‌ను తీసుకొచ్చినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ తెలిపారు. పోర్టల్‌ను గురువారం రవీంద్రభారతిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. పోర్టల్ సమాచార బ్రోచర్‌నూ ఆవిష్కరించారు. అనంతరం భవన నిర్మాణం అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నేహాశర్మ, రాళ్లబండి హరిబాబు, బన్వరీలాల్ శర్మలకు అనుమతి పత్రాలు సీఎం చేతుల మీదగా అందించారు. ఈ సందర్భంగా దానకిశోర్ మాట్లాడుతూ.. ఇదివరకు ఒక భవన నిర్మాణం అనుమతి దరఖాస్తు చేసిన తర్వాత నిర్వహించే క్షేత్రస్థాయి తనిఖీలకు రెండునెలల గడువు పట్టేదని చెప్పారు. ఇప్పుడు నాలుగు లేదా ఐదు నిమిషాల్లోనే స్థలపరిశీలన పూర్తయ్యేలా సీఎం రేవంత్ ఆదేశాలతో బిల్డ్ నౌ పోర్టల్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. దీన్ని భారతదేశంలోనే అత్యంత వేగవంతమైన వ్యవస్థగా అభివర్ణించారు. ఇందులో మాన్యువల్‌కు ఎంత మాత్రం అవకాశం లేదని, అంతా ఆన్‌లైన్‌లోనే ప్రక్రియ పూర్తవుతుందన్నారు. బిల్డ్ నౌకు త్రీడీతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌నూ అనుసంధానం చేశారని, దీంతో తక్కువ సమయంలోనే నిర్మాణ ప్రదేశాన్ని పర్యవేక్షించవచ్చని వివరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అసలు ఫీల్డుకు వెళ్లకుండా ఆఫీసులో కూర్చొని స్థలాన్ని పరిశీలించేలా కొత్త సాంకేతికతను తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. బిల్డ్‌నౌ ద్వారా రియల్టర్లు, సామాన్యుల ఇబ్బందులు తొలగిపోనున్నాయన్నారు. సంబంధిత శాఖ మంత్రిగా సీఎం రేవంత్ మార్గనిర్దేశకత్వంతోనే ఈ పోర్టల్‌ను తీసుకొచ్చినట్లు దానకిశోర్ చెప్పారు. బిల్డ్‌నౌ పోర్టల్ రూపకర్తలు హైదరాబాదీలేనని అన్నారు. దీని గురించి తెలిసిన తర్వాత, ఈ రకమైన పోర్టల్ తయారీకోసం వారిని ఇతరరాష్ట్రాల నుంచి కూడా సంప్రదిస్తున్నట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల తిరస్కరణ ఉండదు.. మార్గ నిర్దేశమే

బిల్డ్ నౌ పోర్టల్ తెలంగాణ పట్టణీకరణకు మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకే రాష్ట్రం.. ఒకే ప్లాట్‌ఫాం పేరుతో పట్టణాల అభివృద్ధికి అవసరమైన అన్ని విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తున్నారు. సాంకేతిక ఆధారంగానే భవన నిర్మాణ అనుమతులు ఉంటాయని, దరఖాస్తులను తిరస్కరించడం కాకుండా మార్గనిర్దేశం చేసి డేటా ఆధారంగా విశ్లేషణ చేసేలా బిల్డ్ నౌ పోర్టల్‌ను రూపొందించారు. బిల్డ్ నౌ ద్వారా వారాలు పట్టే పనిని నిమిషాల్లో పూర్తి చేస్తారు. డిజైన్ సాఫ్ట్‌వేర్‌తో పోర్టల్ అనుసంధానం చేశారు. దీనిద్వారా దరఖాస్తులో ఉండే లోపాలను, తప్పులను అదే సవరించుకుని అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తుంది. నిబంధనల ప్రకారం డ్రాయింగ్, లేఅవుట్ అనుమతులు ఇస్తుంది. దరఖాస్తుదారు ఇచ్చే డ్రాయింగ్.. నిబంధనల ప్రకారం ఉందా.. లేదా? అనేది పోర్టల్ తక్షణమే నిర్ధారిస్తుంది. 24 గంటలపాటు ఏఐ ఆధారిత సేవలు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తుదశలో ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేస్తుంది. వాట్సాప్ ద్వారా సలహాలు ఇస్తుంది. 5 నిమిషాల్లో డ్రాయింగ్ పరిశీలన పూర్తి చేస్తుంది. ఈ పోర్టల్ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, నీటిపారుదల, రెరా ఇలా సంబంధిత అన్ని శాఖల్లోనూ అనుసంధానం అయి ఉంటుంది. కొత్త విధానంలో పాలసీ పరమైన మార్పులను వెంటనే సవరించుకుంటుంది. టారిఫ్‌లు, ప్రాసెసింగ్ ఫీజుల్లో ప్రభుత్వం మార్పులు చేర్పులు చేస్తే వాటిని వెంటనే అమల్లోకి తీసుకొస్తుంది.

మిస్‌వరల్డ్ పోటీలకు ప్రభుత్వ వ్యయం 27 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్లాజా హోటల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లే, మిస్ వరల్డ్ 2024 క్రిస్టీనా పిజ్కోవాతో పాటుగా తెలంగాణా పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక కార్యదర్శి స్మితా సభర్వాల్, మిస్ వరల్డ్ లిమిటెడ్ డైరెక్టర్ స్టీవ్ మోర్లే తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు

జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ పోటీల ద్వారా తెలంగాణలో ఉపాధి, పెట్టుబడి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణకు ఓ గుర్తింపు తీసుకురావడానికి 72వ మిస్ వరల్డ్ పోటీలు తోడ్పడతాయని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద 2500 రూపాయలు ఇవ్వలేకున్నా అందాల పోటీలకు 250 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్న ప్రతిపక్షాల విమర్శలను జూపల్లి తిప్పికొట్టారు. ప్రతిపక్షాలది పచ్చకళ్ల ధోరణి అని విమర్శించారు.

మిస్ వరల్డ్ పోటీలు మహిళా సాధికారతకు ప్రతీక

మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లే మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ అనేది అందం కన్నా అంతర్జాతీయ సంస్కృతి, సాధికారతకు ప్రతీక అన్నారు. ఈ పోటీలు అంతర్జాతీయ పర్యాటక, పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణను ముందు వరుసలో నిలుపుతాయన్నారు.


మిస్ వరల్డ్ 2024 క్రిస్టీనా పిజ్కోవా

చీర కట్టుకోవడం సంతోషాన్నిచ్చింది.

మిస్ వరల్డ్- 2024 క్రిస్టినా మాట్లాడుతూ.. ఇండియాకు తన హృదయంలో ప్రత్యేక స్థానముందన్నారు. గత సంవత్సరం ఇక్కడే తాను మిస్ వరల్డ్ కిరీటం అందుకున్నానని తెలిపిన ఆమె, తెలంగాణను అన్వేషించే అవకాశం తనకు కలగడం ఓ అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వైవిధ్యత అనేది ఇండియా బలమన్న ఆమె, ఇక్కడ విభిన్న భాషలు, మతాలు ఉన్నాయని, ఇది ఎంతో అందంగా కనిపిస్తుందన్నారు. ఇదే మిస్‌వరల్డ్ పోటీల్లోనూ కనిపిస్తుందని తెలిపారు. యాదగిరిగుట్ట దేవాలయం సందర్శించానని దేవాలయ నిర్మాణ శైలి అద్భుతమని ఆమె కొనియాడారు. ఆధ్యాత్మిక పరంగా గొప్ప అనుభూతులను తాను పొందానన్నారు. చీర కట్టుకోవడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు.

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా పోటీలు

పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా పోటీలు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లోనే కాకుండా రామప్ప దేవాలయం సహా పలు ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. 20-30 మందిని బృందాలుగా చేసి తెలంగాణాలో పలు ప్రాంతాలను చూపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పోచంపల్లి గ్రామ సందర్శన ద్వారా చేనేత వైభవాన్ని, నాగార్జున్ సాగర్‌లో బుద్ధవనం, చార్మినార్, లాడ్‌బజార్‌లలో హెరిటేజ్ వాక్, చౌమహల్లా ప్యాలెస్‌లో డిన్నర్, వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రం, కాకతీయ హెరిటేజ్ టూర్ చేయిస్తామని చెప్పారు. యాదగిరి గుట్టలో ఆధ్యాత్మిక టూర్‌తో పాటుగా మెడికల్ టూరిజంను కూడా ప్రమోట్ చేస్తామన్నారు.

సినిమా పాటల్లో అసభ్యకర స్టెప్పులపై మహిళా కమిషన్ సీరియస్

- సినీ పరిశ్రమ స్వీయనియంత్రణ పాటించాలి
- లేకుంటే చర్యలు తప్పవంటూ హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొన్ని సినిమాల పాటల్లో మహిళలను కించపరిచేలా అసభ్యకర డాన్స్ స్టెప్పులు ఉంటున్న నేపథ్యంలో సినీ పరిశ్రమకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నేరెళ్ల శారద తీవ్ర హెచ్చరికలు చేశారు. సినిమా దర్శక, నిర్మాతలు కొరియోగ్రాఫర్లు, సంబంధిత వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మహిళలను తక్కువ చేసి చూపించే అసభ్యకరమైన డాన్స్ స్టెప్పులను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. కొన్ని సినిమాల పాటల విషయంలో తమకు పలు ఫిర్యాదులు అందాయన్నారు. సినిమా అనేది సమాజంపై ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమమని, ఇందులో మహిళలను అవమానించే లేదా అసభ్యకరంగా చూపే అంశాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. సమాజానికి సానుకూల సందేశాలు అందించడంతోపాటు మహిళల గౌరవాన్ని కాపాడటం సినిమా రంగం నైతిక బాధ్యత అని గుర్తు చేశారు. యువత, పిల్లలపై సినిమాలు చూపే ప్రభావాన్ని అర్థం చేసుకుని సినీ పరిశ్రమ స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఈ అంశంపై ప్రజలు, సామాజిక సంస్థలు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చని, ఈ విషయమై నిశిత పరిశీలన తర్వాత అవసరమైన మరిన్ని చర్యలు తీసుకుంటామని శారద స్పష్టం చేశారు.



దొంగ జ్యోతిష్కుడిని మీడియాకు చూపుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మత్తులో ఉన్న మహిళలపై జ్యోతిష్కుడి లైంగిక దాడి

ఆపై వీడియోలు తీసి బెదిరింపు, డబ్బు వసూళ్లు

నిందితుడు బాపు స్వామి అరెస్టు

మెదక్ అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జాతక సమస్యలను, కుటుంబ సమస్యలను మంత్రాలు, పూజలతో మాయం చేస్తానని నమ్మించి నిద్రమాత్రలు కలిపిన నీళ్లను తాగించి.. మహిళలపై లైంగిక దాడికి పాల్పడుతూ వీడియోలు తీసి, వాటిని చూపించి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న బాపు స్వామి అనే ఓ దొంగ జ్యోతిష్కుడిని మెదక్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి గురువారం విలేకరులకు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలోని అనుపురం గ్రామానికి చెందిన బుడగజంగం బొమ్మెర బాపుస్వామి అలియాస్ శివస్వామి తానో జ్యోతిష్కుడినని ప్రచారం చేసుకునేవాడు. జాతకం చెబుతానని, కుటుంబ, ఆరోగ్య సమస్యలు పరిష్కరిస్తానని జనాన్ని నమ్మించి పలు పూజలు చేస్తుండేవాడు. మెదక్ జిల్లాతోపాటు పలు జిల్లాల్లో తిరుగుతూ తన విజిటింగ్ కార్డులు పంచేవాడు. ఈ ప్రచారాన్ని నమ్మి మహిళలు ఎవరైనా తన దగ్గరికి ఒంటరిగా వస్తే.. వారి వివరాలను తెలుసుకునేవాడు. సమస్యల పరిష్కారానికి పూజలు చేయాలని చెప్పి.. నిమ్మకాయ, పసుపు, కుంకుమ వాసనలు చూపిస్తాడు. ఈ క్రమంలో నిద్ర మాత్రలు కలిపిన నీటిని వారితో తాగించేవాడు. మహిళలు మత్తులోకి జారుకోగానే వారిని వివస్త్రలను చేసి కామవాంఛ తీర్చుకునేవాడు. ఈ దుశ్చర్య మొత్తాన్ని తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసేవాడు. ఆపై, ఆ వీడియోలను చూపించి ఆయా మహిళలను బెదిరించి వారి ఆర్థిక పరిస్థితి ప్రకారం వేల నుంచి రూ.లక్షల్లో డబ్బు వసూలు చేసేవాడు. ఆ డబ్బుతో విలాసవంతంగా జీవించేవాడు. వరంగల్, మెదక్, సంగారెడ్డి, తూప్రాన్, నర్సాపూర్‌తో పాటు ఇతర జిల్లాలో కూడా బాపు స్వామి బాధితులు ఉన్నట్టు తెలిసింది. బాపు స్వామి బ్లాక్‌మెయిల్ వ్యవహారంపై వచ్చిన ఓ ఫిర్యాదు మేరకు నిఘా పెట్టిన పోలీసులు నర్సాపూర్‌లో అతడిని అరెస్టు చేశారు. బాపు స్వామి మొబైల్‌లో పలువురు మహిళలకు సంబంధించిన వీడియోలను పోలీసులు గుర్తించారు.

తారలపై కేసులు

(మొదటి పేజీ తరువాయి)



ప్రకాశ్‌రాజ్



నిధి అగర్వాల్



ప్రణీత

నష్టపోవడానికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫణీంద్రశర్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల అనేకమంది పలు విధాల నష్టపోయారని.. ఆర్థిక ఇబ్బందుల పాలై ఆత్మహత్యాయత్నం కూడా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను కూడా బెట్టింగ్ యాప్‌ల గురించి యువత మాట్లాడుకునే సమయంలో విని, ఆకర్షితుడినై బెట్టింగ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ప్రయత్నించి.. బంధువులు సర్దిచెప్పడంతో ఆగిపోయానని ఫిర్యాదులో వివరించారు. చట్టవిరుద్ధమైన బెట్టింగ్, జూదం, క్యాసినో యాప్స్‌ను, వెబ్‌సైట్లను ప్రమోట్ చేస్తున్న 25 మంది సినీనటుల పేర్లనూ ఆయన ప్రస్తావించారు. సినీ ప్రముఖులతోపాటు.. వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల, బుల్లితెర ప్రముఖులు శ్రీముఖి, విష్ణుప్రియ, శోభా శెట్టి, టేస్టీ తేజ, రీతుచౌదరి, వర్షిణి సౌందరరాజన్, సిరి హన్మంతు, వాసంతి కృష్ణన్, అమృతచౌదరి, నయని పావని, నేహా, పండు, ఇమ్రాన్, యూట్యూబర్లు హర్షసాయి, భయ్యా సన్నియాదవ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సుప్రీత పేర్లనూ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే.. ఈ వ్యవహారంపై విజయ్ దేవరకొండ టీమ్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయన 'ఆన్‌లైన్ స్కిల్ బేస్డ్ గేమ్స్'కు మాత్రమే ప్రచారం చేశారని, వాటికి అనుమతి ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఆయన ప్రచారకర్తగా పరిమితమయ్యారని స్పష్టం చేసింది. "ఆయన ఏ యాడ్ చేసినా, ఏ కంపెనీకి ప్రచారకర్తగా ఉన్నా ఆ కంపెనీని లీగల్‌గా నిర్వహిస్తున్నారా లేదా అనేది ఆయన టీమ్ క్షుణ్నంగా పరిశీలిస్తుంది. ఆ కంపెనీ లేదా ప్రొడక్ట్‌కు చట్టప్రకారం అనుమతి ఉంది అని వెల్లడైన తర్వాతే విజయ్ ఆ యాడ్‌కు ప్రచారకర్తగా ఉంటారు. అలాంటి అనుమతి ఉన్న ఏ23 అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఆయన పనిచేశారు. రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని గతంలో పలుమార్లు గౌరవనీయ సుప్రీం కోర్టు తెలిపింది. ఏ23 అనే కంపెనీతో విజయ్ దేవరకొండ ఒప్పందం గత ఏడాది పూర్తయింది. ఇప్పుడు ఆ సంస్థతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదు. అక్రమంగా పనిచేస్తున్న ఏ సంస్థకూ ఆయన ప్రచారకర్తగా వ్యవహరించలేదు" అని విజయ్ దేవరకొండ టీమ్ స్పష్టం చేసింది. ఇదే కోవలో రానా టీమ్ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. "నైపుణ్య ఆధారిత గేమ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడానికి రానా ఒక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని గడువు 2017లో పూర్తయింది. చట్టబద్ధంగా అనుమతి ఉన్న వాటికే ఆయన ఆమోదం తెలిపారు. ఒప్పందాలు చేసుకునే ముందు రానా న్యాయ బృందం అన్ని భాగస్వామ్యాలనూ క్షుణ్నంగా సమీక్షిస్తుంది" అని అందులో పేర్కొంది.

గంటల తరబడి విచారణ..

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌పై నమోదైన కేసు విచారణలో భాగంగా.. యాంకర్లు విష్ణుప్రియ, రీతూ చౌదరిని పంజగుట్ట పోలీసులు గురువారం విచారించారు. ఉదయం 10 గంటలకు విష్ణుప్రియ తన న్యాయవాదితో రాగా.. రీతూ చౌదరి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వచ్చారు. పోలీసులు వారిని వేరువేరుగా, కలిపి విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేసినట్టు తెలిసింది. వారి మొబైల్ ఫోన్లను సైతం జప్తు చేశారు. రాత్రి 9.20 తర్వాత వారు బయటికి వచ్చారు. వారికి 41సీఆర్పీసీ నోటీసు ఇచ్చి మళ్లీ 25న విచారణకు రావాలని చెప్పినట్టు విష్ణుప్రియ న్యాయవాది మీడియాకు తెలిపారు.

కఠిన చర్యలు: టీఎఫ్‌పీసీ

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో సినీ ప్రముఖుల పేర్లు రావడంతో తెలుగు ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ స్పందించింది. "సినిమా వారైనా, మరెవరైనా చట్టానికీ, న్యాయానికీ కట్టుబడి ఉండాలి. ఈ యాప్‌ల వల్ల సమాజానికి చెడు జరుగుతుంటే అది తప్పే. రెండు రోజుల్లో 'మా'కు లేఖ రాస్తాం. ఆ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరతాం. ప్రజల జీవితాలను పణంగా పెట్టే వాటికి దూరంగా ఉందాం" అని పేర్కొంది. మరోవైపు.. ప్రముఖ బెట్టింగ్ సంస్థ 'వన్‌ఎక్స్‌బెట్'కు చెందిన 'వన్‌ఎక్స్‌బ్యాట్' అనే వెబ్‌సైట్ పేరుతో మెట్రో రైళ్లలో సరోగేట్ యాడ్స్ ప్రచారం జరుగుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ఈ ప్రచారంపై 2023లోనే విమర్శలు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు పోలీసులు బెట్టింగ్ యాప్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో.. ఆ యాడ్స్‌ను తొలగిస్తామని మెట్రో రైల్ వర్గాలు తెలిపినట్టు సమాచారం.

తెలియక చేశా.. తప్పు తెలుసుకున్నా: ప్రకాశ్‌రాజ్

బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న ప్రముఖులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్న నేపథ్యంలో.. గతంలో తాను చేసిన బెట్టింగ్ యాప్ ప్రమోషన్ గురించి నటుడు ప్రకాశ్‌రాజ్ స్పందించారు. దీనిపై 'ఎక్స్'లో ఒక వీడియో విడుదల చేశారు. "అందరినీ ప్రశ్నించే నేను సమాధానం చెప్పాలిగా. చాలా మంది ప్రశ్నించారు. (బెట్టింగ్ యాప్‌లను) ఎలా ప్రమోట్ చేస్తారని! 2016లో ఇలాంటి ఒక యాడ్ నాదగ్గరికి వచ్చింది. నేను ప్రమోట్ చేయడం నిజం. ఆ తర్వాత కొన్ని నెలల్లోనే అది తప్పు అని అర్థమైంది. వాళ్లు మళ్లీ నన్ను 2017లో సంప్రదించారు. దానికి నేను.. 'ఇది తప్పు. అప్పుడు నేను తెలియక చేశాను' అని చెప్పాను. 2017 నుంచి నేను బెట్టింగ్ యాప్‌లను నేను ప్రమోట్ చేయలేదు. 2021లో ఆ కంపెనీని వేరొకరు తీసుకున్న తర్వాత అప్పట్లో నేను చేసిన ప్రమోషన్‌ను సోషల్ మీడియాలో ప్రసారం చేస్తే.. దానిపై నేను అభ్యంతరం తెలిపాను. వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు.. 'నా కాంట్రాక్ట్ ముగిసింది. ఇది తప్పు' అంటూ ఈ మెయిల్, వాట్సాప్ ద్వారా సందేశం పంపాను. దాంతో వారు ఆపేశారు. ఇప్పుడు అది మళ్లీ లీక్ అయింది. దాని వల్ల ఈ సమాధానం నేను చెబుతున్నా. పోలీసులు నన్ను పిలిచినా వారికి సమాధానం చెబుతాను. 2017 నుంచి ఎప్పుడూ నేను బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయలేదు. నేను యువతకు ప్రత్యేకంగా చెప్పాలనుకుంటున్నాను. యువత బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు. గేమింగ్ యాప్.. అదొక వ్యసనం. దయచేసి మీ జీవితాన్ని కోల్పోకండి" అని ప్రకాశ్ రాజ్ ఆ వీడియోలో పేర్కొన్నారు.

2 వారాల్లో కౌంటర్ వేయండి

- ఎమ్మెల్సీల కేసులో తెలంగాణ సర్కారు, గవర్నర్ కార్యాలయం, కోదండరాం, ఆమీర్ అలీఖాన్‌కు సుప్రీం ఆదేశం
- ఏప్రిల్ 24న తుది వాదనలు



న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వివాదం కేసులో ఏప్రిల్ 24న తుది వాదనలు వింటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర మంత్రివర్గం గవర్నర్‌కు సిఫారసు చేసింది. రాజకీయ నేపథ్యం ఉందంటూ నాటి గవర్నర్ తమిళిసై వారి పేర్లను తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని ఇద్దరూ హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టులో కేసు నడుస్తుండగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ఏడాది జనవరి 13న కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రివర్గం సిఫారసు చేసింది. దీనికి గవర్నర్ ఆమోదం తెలిపారు. అయితే, హైకోర్టులో కేసు విచారణలో ఉండగా తమ కోటాలో మరో ఇద్దరిని ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారంటూ శ్రవణ్‌కుమార్, సత్యనారాయణ మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత గత ఏడాది మార్చి 17న సీజే ధర్మాసనం తీర్పు వెలువరించింది. దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ల పేర్లను రాష్ట్ర మంత్రివర్గం మరోసారి సిఫారసు చేయగా, గవర్నర్ ఆమోదం తెలిపారు. వారు ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఆగస్టు 4న తమకు న్యాయం చేయాలని కోరుతూ దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్లపై గురువారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. దాసోజు శ్రవణ్ ఇప్పటికే ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇది గవర్నర్ అధికారాలకు సంబంధించిన కేసని శ్రవణ్ తరఫు న్యాయవాది వాదించారు. వాదనల విన్న ధర్మాసనం.. ప్రతివాదులైన గవర్నర్ కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వం, కోదండరాం, ఆమీర్ అలీఖాన్ రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఏప్రిల్ 24న చేపడతామని తెలిపింది. ఆ రోజు తుదితీర్పు ఉంటుందని స్పష్టం చేసింది.

ప్రింటింగ్ ప్రెస్‌లో 'ఎమ్మెల్యే' నకిలీ స్టిక్కర్లు!

- కొనుగోలు చేసి కారుకు అంటించుకున్న నిందితులు
- ఎమ్మెల్యే స్టిక్కర్ దుర్వినియోగం కేసులో ఇద్దరి అరెస్ట్

పంజాగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ కారు పాస్ స్టిక్కర్ దుర్వినియోగం ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలిసింది. నకిలీ స్టిక్కర్లను ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో కొనుగోలు చేశామని నిందితులు వెల్లడించినట్లు సమాచారం. ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్కకు సంబంధించిన అసెంబ్లీ కారు పాస్ స్టిక్కర్‌ను కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ మంత్రి పీఆర్‌వో పాండునాయక్ ఈ నెల 17న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూరుకు చెందిన కృష్ణ యాదవ్, భాను ప్రసాద్ యాదవ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో ఒక ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఈ స్టిక్కర్లను ముద్రించి, రూ.3-10వేలకు అమ్ముతున్నట్లు వారు తెలిపారు. టోల్‌ప్లాజాల వద్ద డబ్బు చెల్లించకుండా వెళ్లేందుకు ఆ స్టిక్కర్లను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టారు.





కృష్ణానది జలాధివాసం నుంచి బయటపడిన సంగమేశ్వరాలయం, సంగమేశ్వరాలయం గర్భాలయంలో వేపదార శివలింగం, దేవతా విగ్రహమూర్తులు

జలాధివాసం నుంచి బయటకు సంగమేశ్వరాలయం

- ఈసారి 8 నెలల పది రోజులు వరద జలాల్లోనే...

కొల్లాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సప్త నదుల సంగమ క్షేత్రం నాగర్ కర్నూలు జిల్లా, ఏపీ సరిహద్దులోని సంగమేశ్వరాలయం కృష్ణానది జలాధివాసం నుంచి గురువారం పూర్తిగా బయటపడింది. కృష్ణానదిపై ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో 8 నెలల పది రోజులపాటు జలాధివాసంలో ఉన్నా చెక్కు చెదరని ఆలయ శిల్పసంపదను వీక్షిస్తూ భక్తులు మైమరిచిపోతున్నారు. గురువారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ గర్భాలయంలో వేపదార శివలింగం, దేవతా విగ్రహమూర్తులకు తొలి పూజలు నిర్వహించారు. ఆలయం వరద జలాల నుంచి బయటపడిందని తెలియడంతో కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు దర్శనానికి వస్తున్నారు.

ఏసీబీ వలలో సబ్‌రిజిస్ట్రార్, ఆఫీస్ అసిస్టెంట్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తండ్రి పేరిట ఉన్న ఇంటి స్థలాన్ని అన్నదమ్ముల పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ సబ్ రిజిస్ట్రార్ పర్వతం రామకృష్ణ, ప్రైవేట్ ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎదునూరి రమేష్ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం... చిలుపూరు మండలం వెంకటేశ్వరపల్లెకు చెందిన బట్టమేకల శివరాజ్‌శివరాజ్, ధర్మరాజు అన్నదమ్ములు. తమ తండ్రి పేరిట ఉన్న 585 గజాల ఇంటి స్థలాన్ని తమ పేరుపై గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ వారి తండ్రిని తీసుకుని ఈనెల 17న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. ఇద్దరి పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని సబ్ రిజిస్ట్రార్ మెలికపెట్టారు. తర్వాత రమేష్ రంగంలోకి దిగి ఇద్దరి పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలంటే ఒక్కొక్కరు రూ.11వేల చొప్పున ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని బేరం పెట్టాడు. శివరాజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు రూ.20వేలు ఇస్తానని సబ్‌రిజిస్ట్రార్‌కు తెలపడంతో రిజిస్ట్రేషన్ చేసేందుకు అంగీకరించాడు. పథకం ప్రకారం గురువారం శివరాజ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి రమేష్‌కు రూ.20వేలు ఇవ్వగా ఆయన ద్వారా సబ్‌రిజిస్ట్రార్ తీసుకుంటున్న క్రమంలో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆగి ఉన్న యాత్రికుల బస్సును ఢీకొన్న వ్యాన్

- ఏపీకి చెందిన ఇద్దరు మహిళల మృతి

పెద్దశంకరంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రకు బయలుదేరిన బృందంలోని ఇద్దరు మహిళలను మృత్యువు వ్యాన్ రూపంలో వచ్చి కబళించింది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట శివారు కోలపల్లి వద్ద 161వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఏపీకి చెందిన అప్పలనారాయణమ్మ (50), సూరప్పమ్మ (62) మరణించారు. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన దాదాపు 40 మంది ఈ నెల 13న ట్రావెల్స్ బస్సులో తీర్థయాత్రలకు బయలుదేరారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పలు దేవాలయాలను సందర్శించారు. బుధవారం రాత్రి తుల్జాపూర్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హైదరాబాద్ వైపు బయలుదేరారు. కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం కోలపల్లి వద్ద బస్సును ఆపడంతో పలువురు కిందకు దిగారు. ఆ సమయంలో ఓ డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొంది. కింద ఉన్న నారాయణమ్మ, సూరప్పమ్మ మరణించగా.. బస్సులో ఉన్న పలువురికి గాయాలయ్యాయి.

3,750 కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

మూడుచింతలపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భారీ స్థాయిలో తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాల గుట్టురట్టయింది. 3,750 కిలోల (150 బస్తాలు) నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.98 లక్షలు ఉంటుందని గుర్తించారు. డీసీపీ కోటిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్నారనే సమాచారంతో శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద ఎస్‌వోటీ, శామీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి మంచిర్యాలకు నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న ఓ డీసీఎం వాహనాన్ని పట్టుకున్నారు. డ్రైవర్ నరేశ్‌ను విచారించగా మంచిర్యాలకు చెందిన సోల్లు సురేశ్ అనే వ్యక్తి డీసీఎంను కిరాయికి తీసుకున్నాడని, కర్ణాటక నుంచి మంచిర్యాలకు పత్తి విత్తనాలను తీసుకురావాలని చెప్పినట్టు తెలిపాడు. ఈ క్రమంలో కర్ణాటక కొస్తంగికి చెందిన రమణ అలియాస్ రామయ్య వద్ద నుంచి డీసీఎంలో మంచిర్యాలకు పత్తి విత్తనాలను తీసుకుని బయలుదేరగా శామీర్‌పేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు.

గాంధారిలో కారు భీభత్సం

- మద్యం, గంజాయి మత్తులో యువకుడి డ్రైవింగ్
- పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపైకి దూసుకొచ్చిన కారు.. ఒకరి మృతి



కానిస్టేబుల్ రవి (ఫైల్)

గాంధారి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మద్యం, గంజాయి మత్తులో ఉన్న ఓ యువకుడు కారుతో బీభత్సం సృష్టించాడు. విచక్షణ కోల్పోయి అతివేగంగా కారు నడిపి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులపైకి దూసుకెళ్లాడు. దీంతో రవి (38) అనే కానిస్టేబుల్ మృతి చెందగా.. మరో కానిస్టేబుల్ సుభాష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా గాంధారిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గాంధారి ఠాణాలో పనిచేస్తున్న తాడ్వాయి మండలం దేమికలాన్‌కు చెందిన రవి, సుభాష్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ బస్టాండ్ సమీపంలో టిఫిన్ సెంటర్ వద్ద తమ బైక్‌ను ఆపి నిల్చున్నారు. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి ఓ కారు వారిపైకి దూసుకొచ్చింది. దాంతో రవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తోటి కానిస్టేబుళ్లు అక్కడకు చేరుకుని కారులో ఉన్న గాంధారికి చెందిన యువకుడు సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతను గాంధారి శివారులోని ఓ రైస్ మిల్లులో తన స్నేహితులతో కలిసి బుధవారం రాత్రంతా మద్యం, గంజాయి తాగి తెల్లవారుజామున ఇంటికి వెళ్లే క్రమంలో కారును అతి వేగంగా నడిపినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. సందీప్ కొద్ది నెలల క్రితం ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడపడంతో జరిగిన ప్రమాదంలో వెనక కూర్చున్న అతని స్నేహితుడు మరణించాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.